సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 37

శనివారం 21-10-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

ఖజానా జ్యూవలరీ



531, 32వ క్రాస్, 11వ మెయిన్ రోడ్, 4వ బ్లాక్, జయనగర్ ✆ 41539900 | 93/1, వర్తూర్ రోడ్, తులసి థియేటర్ దగ్గర, మారతహళ్లి ✆ 25400009
హోటల్ రామేశ్వరి కాంప్లెక్స్, (SRR థియేటర్ ఎదురుగా), కాలమ్మ వీధి, బళ్ళారి ✆ 08392-271600.
(అన్ని రోజులు షాపు తెరచి ఉండును. కార్ పార్కింగ్ కలదు.)

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 21-10-2023

న్యూస్‌మేకర్

కశ్మీర్ పేరు చెప్తే అందమైన ప్రదేశాలే గుర్తొస్తాయి.
కాని ఆ లోయలో దాగిన రుచులు
అన్వేషిస్తే తప్ప తెలియదు.
శాకాహారమైనా మాంసాహారమైనా
స్వచ్ఛమైన దినుసులతో గుమ్మెత్తిస్తారు.
'మేము ఎలా వండుతామో నా వంట చూసి
తెలుసుకోండి' అని
కశ్మీర్ వంట చేసి చూపుతోంది రుక్సార్ సయీద్.
కశ్మీర్ మహిళలు పెద్దగా పాల్గొనని
'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' తాజా సిరీస్‌కు
రుక్సార్ స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది.
పోటీని తట్టుకుని టాప్ 12లో నిలిచిన ఆమెను చూసి
కశ్మీర్‌లో ఆడవాళ్లు గర్విస్తున్నారు.


రుక్సార్ సయీద్

టేస్ట్ ఆఫ్ కశ్మీర్

సోనీ లివ్‌లో ప్రసారమవుతున్న తాజా సీజన్ 'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' కోసం రుక్సార్ సయీద్ (33) 'షబ్ దేక్' అనే కశ్మీరీ వంట చేసింది. 'ఇది మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు, మా అమ్మ నుంచి నాకు అందిన వంట. ముదురు గుమ్మడికాయ, నాటుకోడి, ఆల్ బకారా ఎండుగుజ్జు వేసి చేస్తాం. చాలా బాగుంటుంది' అంది. జడ్జీలుగా ఉన్న ప్రముఖ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, పూజా ధింగ్రా... కొద్దిగా రుచి చూసి 'అద్భుతం' అన్నారు. ఆమె ఇంకో ఎపిసోడ్‌లో 'షికారా రైడ్' అనే అల్పాహారం చేసింది. మటన్ కోఫ్తాను, పుదీనా మసాలాతో రంగరించి చేసింది. టేస్ట్ అదిరిందని వేరే చెప్పాలా?

'కశ్మీర్ లోయంతా రకరకాల మసాలా దినుసులు, మేం మాత్రమే తినే ఆకుకూరలు, కాయగూరలు ఉన్నాయి. వాటిని వండే పద్ధతి అందరికీ తెలియదు. మాస్టర్ షెఫ్ ద్వారా దేశమంతటికీ ఆ రుచులను తెలియజేయాలనుకుంటున్నాను' అంటుంది రుక్సార్ సయీద్.

ఆమె సంకల్పం గట్టిదిలాగుంది. తాజా సీజన్‌లో మహా మహా వంటగాళ్లు, వంటగత్తెలు పోటీ పడితే తుది జాబితాలో 22 మంది ఉంటే, వారిలో చాలామందిని అధిగ'మించి' టాప్ 12కు చేరింది రుక్సార్. దాంతో కశ్మీర్‌లో ఇప్పుడు ఈ షోను అక్కడి స్త్రీలు చూస్తున్నారు. రుక్సార్‌ను తమ ప్రతినిధిగా, తమ సామర్థ్యాలకు కొలమానంగా చూస్తున్నారు. 'ఆ సంతోషం చాలు నాకు. నన్ను స్ఫూర్తిగా తీసుకుని స్త్రీలు ముందుకు రావాలి' అంటుంది రుక్సార్.



ఫుడ్ టెక్నాలజీలో డాక్టరేట్

రుక్సార్ సయీద్‌ది పుల్వామా జిల్లాలోని పామ్‌పోర్ అనే ప్రాంతం. నిత్యం మంచు కురిసే ఈ ప్రాంతంలో కవులు ఎక్కువ. 'నేను కవిత్వం రాయను. కాని ప్లేట్‌లో పదార్థమే ఒక కవిత్వమంత అందంగా అమర్చగలను' అంటుంది రుక్సార్. ఫుడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన రుక్సార్ అందరిలా ఏ లెక్చరర్ పోస్ట్‌కో వెళ్లలేదు. 'నాకు ఆహారం మీద సంపూర్ణ అవగాహన ఉంది. ముఖ్యంగా ఫ్రోజెన్ ఫుడ్‌ను సరిగా అమ్మగలిగితే తక్షణం వేడి చేసుకుని తినాలనుకునేవారికి మేలు జరుగుతుంది. కాని ఆహారంలో కల్తీ ఎక్కువ. ఈ కల్తీ విషంతో సమానం. అందుకే నేను ఏ కల్తీ లేని ఫ్రోజెన్ ఫుడ్‌ను అమ్మాలని ఖాలిస్ ఫుడ్స్ పేరుతో చిన్న సంస్థను మొదలుపెట్టాను. చికెన్ ఉత్పత్తులను కశ్మీర్‌లో అమ్ముతున్నాను. కశ్మీర్‌లో ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించడమే ఎక్కువ అవసరం అని నేను భావిస్తాను. నిరుద్యోగం పోవాలంటే ఇలాగే చేయాలి. నా సంస్థ బాగా నడుస్తోంది. కాని దేశవ్యాప్తంగా పంపాలంటే కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ లోపు నేను, నా బ్రాండ్ తెలియడానికి మాస్టర్ షెఫ్ ప్రోగ్రామ్‌కు వచ్చాను' అని తెలిపింది రుక్సార్.

అంతే తేడా

'వంట అందరు ఆడవాళ్లు చేస్తారు. కాని ఫుడ్ షోలలో ఆ వంటను శాస్త్రీయంగా చేయాలి. అంతే తేడా. కశ్మీర్‌లో వంట తెలిసిన యువతీ యువకులు బాగానే ఉన్నారు. నేను ఈ షో ద్వారా గడించిన అనుభవంతో వారికి సాయం చేయాలనుకుంటున్నాను. ఆహారం తయారు చేయడంలో మెళకువలు తెలిపి వారు ఫుడ్ జాయింట్‌లు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడేలా చూడాలనుకుంటున్నాను. ఇందుకు కావాల్సిన సామాగ్రి నేనే సమకూరుస్తాను' అంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్న రుక్సార్ తన భర్త సాదిక్ అహ్మద్ సహకారం వల్లే ఇలా షోకు వచ్చినట్టుగా తెలిపింది. 'ఆడవాళ్లు.. ప్రయత్నించండి. ఓడిపోవద్దు' అనేది రుక్సార్ సందేశం.

ప్రమాదమా..? టాన్యా ఉందిగా..!

కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడు... సెలవుల్లో స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు చాలామంది యువతీ యువకులు. అయితే అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఎవరు కాపాడతారు? అందుకే అలాంటి వారికి అండగా ఉంటోంది టాన్యా. అవును, సరదాగా గడపాల్సిన వయసులో ఇతరుల ప్రాణాలను రక్షిస్తోంది టాన్యా కోలి. ఐదోఏటి నుంచే కొండలు ఎక్కడం నేర్చుకుని, టీనేజ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏకంగా రెస్క్యూ టీమ్‌ను నిర్వహిస్తూ ఎంతోమందిని ఆపదల నుంచి బయటపడేసింది. పెద్ద పెద్ద కొండలను అవలీలగా ఎక్కేస్తూ, మరొకరికి సాయంగా నిలబడుతూ.. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది టాన్యా.



నాసిక్‌కు చెందిన టాన్యా కోలి ఐదేళ్ల వయసు నుంచే పర్వతాలు ఎక్కడం నేర్చుకోవడం మొదలు పెట్టింది. టాన్యా తండ్రి దయానంద్ కోలి నాసిక్ క్లైంబర్స్ అండ్ రెస్క్యుయర్స్ అసోసియేషన్‌లో పని చేస్తుండడంతో తరచూ ట్రెక్కింగ్, రెస్క్యూ అనే పదాలను తండ్రి నోట వెంట వినేది. టాన్యాకూ ట్రెక్కింగ్ పైన ఆసక్తి ఏర్పడడంతో తండ్రి దగ్గర ట్రెక్కింగ్ ఎలా చేయాలో నేర్చుకుంది. అలా ట్రెక్కర్‌గా మారిన టాన్యా, రెస్క్యూటీమ్ కలిసి ఎంతోమందిని ప్రమాదాల నుంచి బయటపడేస్తోంది. తండ్రి దగ్గర నేర్చుకున్న ట్రెక్కింగ్ మెళకువలతోపాటు, హిమాలయాల్లో ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడంతోపాటు, పర్వతారోహకులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తోంది టాన్యా. పర్వతాన్ని అధిరోహించేటప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కూడా నేర్పిస్తుంది. టాన్యా దగ్గర శిక్షణ తీసుకుంటున్నవారిలో మహారాష్ట్ర పోలీసు అకాడమీ ట్రైనీలు కూడా ఉన్నారు. ప్రతిసారీ తను అందుబాటులో ఉండడం కష్టం కాబట్టి ఇతరులకు నేర్పించడం ద్వారా ప్రమాద సమయంలో వారిని వారే కాపాడుకోవడంతోపాటు, ఇతరులను కూడా కాపాడగలరు. అందుకే మరింతమందికి రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నాను అని టాన్యా చెబుతోంది.

''ప్రమాదంలో ఉన్నారు, కాపాడాలి అని సమాచారం తెలిస్తే వెంటనే బయలుదేరతాం. అది అర్ధరాత్రి అయినా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో సిద్ధంగా ఉంటాం. ట్రెకింగ్ చేసేవారిని, ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్ని రక్షించడం థ్రిల్లింగ్ ఇచ్చేదే అయినప్పటికీ చాలా సవాళ్లతో కూడుకున్నది. సమస్యలు ఉన్నప్పటికీ అవతలి వారిని ప్రమాదం నుంచి కాపాడగలిగామన్న సంతృప్తి ముందు ఆ సమస్యలు, సవాళ్లు చిన్నబోవలసిందే'' అని చెబుతోంది తాన్యా.

● సందర్భం

ఆమె సక్సెస్ మంత్రా...
వ్యూహ చతురత వృత్తి నిబద్ధత


ఇప్సితా దాస్‌గుప్తా

అనుభవం నేర్పిన పాఠాలు అద్భుత విజయాలను సొంతం చేస్తాయి.
రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో కార్పొరేట్ కంపెనీలలో పని చేసిన ఈప్సితా దాస్‌గుప్తా ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకుంది.
అమెరికాలో యాపిల్ సర్వీసెస్‌లో సీనియర్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకుంది.
తాజాగా...
అమెరికన్ మల్టీ నేషనల్ ఐటీ కార్పోరేషన్ 'హెచ్‌పీ ఇండియా' సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ), మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం అయింది...

పనిలోని కష్టమే ఇష్టమైతే అంతకంటే సుఖం ఏమున్నది?

కొలంబియా యూనివర్శిటీలో మ్యాథ్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ఈప్సితా ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలలో పనిచేసింది. ముంబై రోడ్లపై ఉరుకులు, పరుగులు, పని భారంతో నిద్రలేని రాత్రులు ఆమెకు కొత్తేమీ కాదు.

కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోడంలో సమస్యలు తలెత్తాయి.

'నాకు కష్టంగా ఉంది' అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

ఎన్నో కంపెనీలలో మార్కెటింగ్, స్ట్రాటజీ విభాగాలకు నేతృత్వం వహించి మన దేశంతో సహా బంగ్లాదేశ్, శ్రీలంకలలో పనిచేసింది ఈప్సితా. ఆఫీస్ గదికే పరిమితం కాకుండా జనాల్లోకి వెళ్లి క్లయింట్స్ అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేది. వాటికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకునేది.

యాపిల్‌కు ముందు స్టార్ ఇండియా ప్రెసిడెంట్ ఆఫ్ కార్పొరేట్ స్ట్రాటజీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ దక్షిణ ఆసియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేసిన ఈప్సితా వృత్తికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరితో చర్చిస్తుంది.

'తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవచ్చునేమోగానీ, ఆ నిర్ణయం ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను వెనక్కి తీసుకోలేదు. అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద కోణాల్లో ఆలోచిస్తాను' అంటుంది ఈప్సితా.

ఉద్యోగంలోకి అప్పుడే వచ్చిన రోజుల్లో ఈప్సితాలాంటి కొత్త ఉద్యోగులకు సీనియర్‌ల నుంచి వినిపించిన మాట 'ఇలా ఎవరైనా ఆలోచిస్తారా?'

అందరిలాగే ఈప్సితా ఆలోచించినట్లయితే ఆమెకు ఇంత పేరు వచ్చేది కాదేమో.

'ఇలా కూడా చేయవచ్చు... అంటూ సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించేదాన్ని. ఇది సీనియర్‌లకు రుచించేది కాదు. అయితే నా ఆలోచనల్లో సత్తా ఉందని ఆ తరువాత నిరూపణ అయింది' అంటుంది ఈప్సితా.

'మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?' అనే ప్రశ్నకు ఈప్సితా చెప్పే జవాబు...
'వీరు వారు అని కాదు. నేను మాట్లాడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత ఇన్‌స్పైర్ అవుతుంటాను. సాధారణ ప్రజల నుంచి ఇన్వెస్టర్‌లు, లీడర్‌లు, ఆర్టిస్టుల వరకు నాకు ఎంతోమంది రోల్ మోడల్స్ కనిపిస్తారు'

వృత్తిరీత్యా ఈప్సితా దాస్‌గుప్తా ఒక సమస్యకు పరిష్కారం వెదకగానే పని అక్కడితో ఆగిపోదు. 'మేమున్నాం' అంటూ కొత్త సమస్యలు పుట్టుకొస్తుంటాయి. గత సమస్యలతో వీటికి పోలిక ఉండకపోవచ్చు. కొన్నిసార్లు పరిష్కారం దుర్భేద్యంగా అనిపించవచ్చు. ఇలాంటి సమయంలోనే వ్యూహకర్తలు చురుగ్గా ఆలోచించాలి.

వ్యూహకర్తగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఈప్సితా దాస్‌గుప్తా ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలిచింది.

బ్యూటిప్స్

కనుబొమలకు కలోంజీ





నల్లజీలకర్ర (కలోంజీ) విత్తనాలను పొడిచేయాలి. ఈ పొడిలో ఆలివ్ ఆయిల్, అలోవెరా జెల్‌ను వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు తడి కాటన్ వస్త్రంతో కనుబొమలను శుభ్రంగా తుడిచి.. నల్ల జీలకర్ర మిశ్రమాన్ని ప్యాక్‌లా వేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. కనుబొమ్మలను తడిలేకుండా తుడిచి కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను కనుబొమలపైన రాసి ఐదునిమిషాలపాటు మర్దన చేయాలి.

- ఈ ప్యాక్‌ను వారానికి మూడుసార్లు వేయడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి కనుబొమల మీద వెంట్రుకలు పెరుగుతాయి.
- నల్లజీలకర్ర ప్యాక్ పలుచటి కనుబొమలను ఒత్తుగా మారుస్తుంది. కనుబొమలు తీరైన ఆకృతిలో చక్కగా మెరుస్తాయి.
- కలోంజీలోని పోషకాలు కనుబొమల వెంట్రుకలు రాలకుండా చేస్తాయి.
- కనుబొమలు తెల్లబడడం మొదలైన వారు సైతం ఈ ప్యాక్‌ను వాడితే వెంట్రుకలు నల్లగా మారతాయి.


డాక్టర్ మురళీకృష్ణ

నేను జయించాను

వైద్యులు రోగులకు వైద్యం చేస్తారు. పేషెంట్ వ్యాధిని అంచనా వేసి, పరీక్షలతో నిర్ధారణకు వచ్చి, సిలబస్‌లో చదివిన సమాధానాలతో వైద్యం చేస్తారు. మరి... అప్పటివరకు లేని కొత్త రోగం వస్తే? చికిత్స కోసం అప్పటికే చదివిన సిలబస్‌లో సమాధానం ఎలా వెతకాలి? వైద్యవిద్యలో చెప్పని పాఠాల కోసం అన్వేషణ ఎలా మొదలు పెట్టాలి? అందుకే... 'పేషెంట్‌లు, పరిశోధనలే నా గురువులు' అన్నారు డాక్టర్ మురళీకృష్ణ. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిర్ధారిత ప్రయోగాలు, నిరూపిత సమీకరణలతో వైద్యం చేయడానికే పరిమితం కాకూడదు. రోగికి అవసరమైన కొత్త సమీకరణాలను వైద్యులు సృష్టించగలగాలన్నారు. బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ విశేషంగా వైద్యసేవలందించిన వైద్యులను ఇటీవల న్యూఢిల్లీలో గౌరవించింది. పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ 'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2023' పురస్కారం అందుకున్నారు తెలుగు డాక్టర్ మురళీకృష్ణ.

మైక్రో బయాలజీ నడిపించింది!

''మాది అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రాపురం. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, అదే కాలేజ్‌లో ఎం.డీ (మైక్రో బయాలజీ) కూడా చేసి, సాంక్రమిక వ్యాధుల నిపుణుడిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. మైక్రో బయాలజీలో చేరడం ఇష్టంతో కాదని చెప్పడానికి ఏ మాత్రం మొహమాట పడను. సీటు వచ్చిన కోర్సుతో రాజీపడిపోయాను. కానీ కోర్సు మొదలైన తర్వాత ఏర్పడిన ఆసక్తిని మాటల్లో వర్ణించలేను. నేరుగా వైద్యం చేయడం కంటే వైద్యరంగానికి అవసరమైన తెర వెనుక కృషి చాలా సంతృప్తినిచ్చింది. గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులకు పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను తీసుకుని ఎయిడ్స్ వైరస్ గురించి ప్రభుత్వం చాలా గోప్యంగా పరీక్షలు నిర్వహించేది. మనదేశంలో వెయ్యిలో 15 మందిలో ఎయిడ్స్ వైరస్ ఉన్నట్లు, అది దక్షిణాది ఆఫ్రికా దేశాల నుంచి మనదేశంలోకి వస్తున్నట్లు తెలుసుకున్నాం. దేశంలో ప్రభుత్వ సంస్థల దగ్గర ఉన్న సమాచారమంతటినీ సేకరించాను. అన్ని సంస్థల దగ్గరున్న సమాచారం కంటే ఎక్కువ డాటా నా దగ్గరుంది. అప్పట్లో మనదగ్గర ఎయిడ్స్‌కి వైద్యం చేసే డాక్టర్‌లు లేరు. అనుబంధ సమస్యలకు వైద్యం చేసే నిపుణులే హెచ్‌ఐవీకి కూడా మందులిచ్చేవారు. ఆ ఖాళీని భర్తీ చేయాలనుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి హెచ్‌ఐవీ ఫిజీషియన్‌ని నేనే.

వారానికి ఇద్దరు పేషెంట్‌లు!

సొంత ప్రాక్టీస్ మొదలుపెట్టింది 2000లో. మొదట్లో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు పేషెంట్‌లు వచ్చేవారు. దాంతో నా సమయాన్ని ఎయిడ్స్ అధ్యయనానికి ఉపయోగించాను. ప్రముఖ పరిశోధకులందరూ శాస్త్రం ఆధారంగా ఎయిడ్స్‌కు వైద్య శోధన మొదలు పెట్టారు. నా అధ్యయనం, పరిశోధనలను పేషెంట్ వైపు నుంచి మొదలు పెట్టాను. ఎయిడ్స్‌కి మాంటూక్స్ టెస్ట్ అలాంటిదే. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వ్యాధినిరోధక శక్తిని కోల్పోయి టీబీ సోకడం సర్వసాధారణంగా జరిగేది. ఎయిడ్స్ మరణాల్లో ఎక్కువ టీబీ మరణాలే ఉండేవి. '13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్' సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లో జరిగింది. ఆ సదస్సులో నేను 'మాంటూక్స్ టెస్ట్' ఎయిడ్స్ తీవ్రత పట్ల ఒక అంచనాకు రావచ్చని చెప్తూ నా పరిశోధన పత్రాన్ని సమర్పించాను. అది ఎయిడ్స్ చికిత్సలో కొత్త దృక్పథానికి దారి తీసింది. ఎయిడ్స్ చికిత్సలో వైద్యం మొదలు పెట్టిన వారం రోజుల నుంచి రికవరీ స్పష్టంగా తెలుస్తుంది. అయితే జీవితకాలం మందులు వాడాల్సిందే. పేషెంట్ తిరిగి తన పనులకు వెళ్లగలిగేటట్లు చేయడం నా వైద్యం ఉద్దేశం. ఈ వ్యాధి పేద వాళ్లలోనే ఎక్కువ. వారికి వైద్యం చేయడంలో టెస్ట్‌ల మీద ఆధారపడకుండా వ్యాధి లక్షణాలు, చిహ్నాలను బట్టి తీవ్రతను అంచనా వేసి చికిత్స చేస్తాను. అలాగే రెండంచెల ఔషధాలతో వైద్యం చేయడం కూడా నేను చేసిన మరో ప్రయోగం. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ సింపోజియమ్ హెచ్‌ఐవీ ఎమర్జింగ్ మెడిసిన్' సదస్సులో పేపర్ సమర్పించాను. నేను ప్రతిపాదించిన పదేళ్ల తర్వాత 2019 నుంచి ఇప్పుడు అంతర్జాతీయంగా టూ డ్రగ్స్ చికిత్సనే అనుసరిస్తున్నారు.


'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ 2023' అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

కోవిడ్‌కి ఇంట్లోనే వైద్యం

కోవిడ్ వైద్యరంగానికి పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఒక వ్యాధికి మందులు రావాలంటే దశాబ్దాల పరిశోధన తర్వాత మాత్రమే సాధ్యం. కొత్త వ్యాధి, పైగా ఒక్కసారిగా విజృంభించినప్పుడు రోగులందరికీ ఒకేసారి నాణ్యమైన వైద్యం అందించడం ఎవరికీ సాధ్యం కాదు. వ్యాధి విస్తరించినంత వేగంగా ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడా జరగాలన్న ఆలోచనతో సులభంగా, చవగ్గా దొరికే మందులతో హోమ్‌కేర్ కిట్ రూపొందించాను. కోవిడ్ మీద అవగాహన కోసం వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒక్కో పోస్ట్ వేలసార్లు షేర్ అయింది. వైద్యం కోసం పేషెంట్‌లు అప్పుల పాలు కాకూడదనేది నా పాలసీ. అందుకోసమే నా తాపత్రయమంతా. కోవిడ్ మీద కూడా అవగాహన పుస్తకం తెచ్చాను. కోవిడ్ తర్వాత వస్తున్న సమస్యల మీద అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. నాలుగు ఇంటర్నేషనల్ సెమినార్‌లలో పేపర్‌లు ప్రెజెంట్ చేశాను. ఇంకా చేస్తాను కూడా. ఒక డాక్టర్‌గా వైద్యరంగం నేర్పించిన జ్ఞానంతో పేషెంట్‌లను ఆరోగ్యవంతులను చేయడానికి కృషి చేయడం అనేది నూటికి తొంబై తొమ్మిది మంది చేసే పని. నా కృషితో వైద్యరంగానికి తోడ్పాటు అందించడం నా విజయం. మొదట ఆరోగ్యపరంగా నన్ను నేను జయించాను. ఆ తర్వాత జీవితాన్ని జయించాను. మా ఇంట్లో తొలి వైద్యుడిని నేనే. నా పిల్లలిద్దరిలో ఎవరూ వైద్యరంగం పట్ల ఆసక్తి చూపకపోవడమే మనసుకు బాధ కలిగించే విషయం'' అన్నారు ప్రజారోగ్య పరిరక్షణలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ మురళీకృష్ణ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎయిడ్స్ అవగాహన వ్యాసాలు

హెచ్‌ఐవీ గురించి మన సమాజంలో విపరీతమైన భయం రాజ్యమేలుతున్న రోజులవి. ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం నగరాలు, పట్టణాలు, చిన్న కాలనీలు, గ్రామాల్లో ఐదు వందలకు పైగా సమావేశాల్లో ప్రసంగించాను. వయోజనుల్లో అవగాహన కోసం 'అక్షర గోదావరి' పేరుతో క్లుప్తంగా, సరళంగా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాశాను. మొదట మా జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించారు. ఆశ వర్కర్స్, రిసోర్స్ పర్సన్స్‌కి ప్రామాణిక గ్రంథంగా నా రచననే తీసుకున్నారు. హెచ్‌ఐవీ గురించిన అవగాహన వ్యాసాలతో 'ఎయిడ్స్' పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకం పునర్ముద్రణలతో పదేళ్లలో ఎనిమిది వేల కాపీలు అమ్ముడవుతుందని నేను కూడా ఊహించలేదు. ఎంబీబీఎస్‌లో కాలేజ్ మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా పని చేసిన అనుభవమే ఇప్పటికీ నా అధ్యయనాలన్నింటినీ అక్షరబద్ధం చేయిస్తోంది.

- డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎం.డి.,
కాకినాడ, ఆంధ్రప్రదేశ్

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 37

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

'గ్రూప్-2' గెట్ రెడీ

పది రోజుల్లో నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం

- ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించే యోచన
- ఆగస్టులోనే 508 పోస్టుల భర్తీకి అనుమతి.. తాజాగా మరో 212 పోస్టులకూ ఓకే
- గత నోటిఫికేషన్‌లోవి, క్యారీ ఫార్వార్డ్ పోస్టులు మరో 230 కూడా భర్తీ
- మొత్తం 950 పోస్టులను భర్తీ చేసే అవకాశం
- ఏపీపీఎస్సీకి ఆర్థికశాఖ అనుమతి
- నిరుద్యోగ యువత వినతిపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్.. వీలైనంత ఎక్కువ పోస్టుల భర్తీ చేపట్టాలని ఆదేశం

2లో



'కాంట్రాక్టు' ఉద్యోగులకు కానుక

ప్రభుత్వ శాఖల్లో 10,117 మంది సర్వీసు క్రమబద్ధీకరణ

గవర్నర్ ఆమోదంతో గెజిట్‌లో ముద్రించిన ప్రభుత్వం

2లో



ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా డీఏ

నేడు ఒక డీఏ విడుదల

3.64 శాతం డీఏ... 2022 జూలై 1 నుంచి వర్తింపు

- వివరాలు 2లో

1,896 వీఏహెచ్ఏ పోస్టులు భర్తీకి గ్రీన్ సిగ్నల్

2లో

వైఎస్సార్ ఆర్బీకేల్లో ఖాళీగా ఉన్న 1896 వీఏహెచ్ఏ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. భర్తీకి అనుమతినిస్తూ ఆ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలుత స్థానికంగా ఉండే పశుసంపద ఆధారంగా 9,844 వీఏహెచ్ఏలు అవసరమని గుర్తించి ఆ మేరకు నోటిఫికేషన్ ఇచ్చారు.

దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం జగన్

- రాష్ట్ర ప్రజల తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పణ.. సంప్రదాయ దుస్తులతో ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రి
- ఆలయం వద్ద సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం
- సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మకు ప్రత్యేక పూజలు
- సీఎంకు స్వాగతం పలికిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

2లో



దుర్గమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించడానికి వెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తుది దశకు డ్రోన్ సర్వే

ఇప్పటివరకు 97% పూర్తి

2లో

- 13,075 గ్రామాల్లో 1.75 కోట్ల ఎకరాలు కొలిచారు
- ఇక మిగిలింది మూడు జిల్లాల్లోని 385 గ్రామాల్లోనే...
- ఈ నెలాఖరుకు మొత్తం పూర్తయ్యే అవకాశం
- మొత్తం పూర్తయితే 1.8కోట్ల ఎకరాలను కొలిచిన రికార్డు
- ప్రతిష్టాత్మకంగా డ్రోన్లు, విమానాలతో సర్కార్ సర్వే





ఈ పండగ సీజన్‌లో, వేగవంతమైన మరియు ఎలక్ట్రిక్ Ather 450 సిరీస్ కోసం మీ పెట్రోల్ 2-వీలర్‌ను ఎక్స్‌ఛేంజ్ చేయండి.₹6,500, వరకు పరిమిత సమయం ఆఫర్స్‌తో, Ather యొక్క ప్రపంచ స్థాయిని చేరుకోవడానికి ఇది ఉత్తమమైన సమయం.

వాట్సాప్ చేయడానికి స్కాన్ చేయండి

విద్యుత్ సామర్థ్యం
- 90 km/గంటకు అత్యంత వేగం
- 150 km IDC రేంజ్
- 5-సంవత్సరాల బ్యాటరీ వారంటీ

సొంతం చేసుకోవడం సులభం
- తక్కువ వడ్డీ రేట్ - 5.99%
- జీరో డౌన్ పేమెంట్
- EMIలు నెలకు ₹2,739/కి ఆరంభం

450X

Ex-showroom Price	₹137,999
Festive Benefit	₹4,000*
Corporate Benefit	₹1,500*
Exchange Value of Your 2W	₹40,000*
Effective Exchange Price	**₹97,999**

Ather Space Experience Centers: Indiranagar - 9827300900 | Electronic City - 9364008548 | Hebbal - 8971001740 | Jayanagar - 8951064554 | JP Nagar - 7829770055 | Marathahalli - 7026014000 | Rajajinagar - 7829330022 | Whitefield - 7026073000 | Yelahanka - 8105405610 | Ambattur - 8884454430 | Guindy - 7667002222 | Nungambakkam - 9827200400 | Perungudi - 8884127711 | Porur - 8884261717 | Redhills - 8884137766 | Tambaram - 8884063355 | Ather Test Ride Zone: Bellandur - 7026014000 | Kolar - 7026073000 | Doddaballapur - 8105405610 | Chengalpattu - 8884127711 | For bulk order queries, please call 8884010044

T&C apply. Product shown is for representational purposes only. Actual color, features & specifications may vary. Ex-showroom price includes FAME-II subsidy & State subsidy (if applicable). Festive benefit and Corporate benefit offers applicable on Pro variants only. Exchange value for used 2-Wheeler vehicles will be subject to the Retail Partner's assessment and will vary as per age and condition of the vehicle. IDC range is for Ather 450X with 3.7 kWh battery as per ARAI testing conditions.

banginthemiddle

క్లుప్తంగా...

31న కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 31వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లోని కేబినెట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశంలో ప్రస్తావించే ప్రతిపాదనలు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా సాధారణ పరిపాలన (కేబినెట్) విభాగానికి పంపాల్సి ఉంటుందని అన్ని శాఖల ఉన్నతాధికారులను సీఎస్ ఆదేశించారు.

25 నుంచి 27 వరకు హైకోర్టుకు దసరా సెలవులు

- అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ బెంచ్‌ల ఏర్పాటు
- జడ్జిలుగా వ్యవహరించనున్న జస్టిస్ వెంకటేశ్వర్లు, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ జ్యోతిర్మయి



సాక్షి, అమరావతి: హైకోర్టుకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సెలవులు ఇస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు నోటిఫికేషన్ జారీ చేశారు. హైకోర్టు కార్యకలాపాలు తిరిగి ఈ నెల 30న ప్రారంభమవుతాయి. ఈ సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి వెకేషన్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి వెకేషన్ కోర్టు జడ్జిలుగా వ్యవహరిస్తారు. ఇందులో జస్టిస్ వెంకటేశ్వర్లు, జస్టిస్ రవీంద్రబాబు ధర్మాసనంలో కేసులను విచారిస్తారు. జస్టిస్ జ్యోతిర్మయి సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. హెబియస్ కార్పస్, బెయిల్స్, ముందస్తు బెయిల్స్, ఇతర అత్యవసర వ్యాజ్యాలపై మాత్రమే వెకేషన్ జడ్జిలు విచారణ జరపాల్సి ఉంటుంది. ఈ సెలవుల్లో అత్యవసర కేసులు దాఖలు చేయాలనుకునే వారు ఈ నెల 25న దాఖలు చేయాల్సి ఉంటుంది. అలా దాఖలైన వ్యాజ్యాలను న్యాయమూర్తులు ఈ నెల 27న విచారిస్తారు.

నేటి నుంచి 29 వరకు లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీకి దసరా సెలవులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని ఏపీ లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ)కు దసరా సెలవులను ప్రకటించారు. శనివారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు కార్యాలయాలకు సెలవు ప్రకటించినట్లు లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, హెచ్‌ఆర్‌సీ కమిషన్ కార్యదర్శి ఎస్.వెంకటరమణమూర్తి శుక్రవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. తిరిగి అక్టోబర్ 30న హెచ్‌ఆర్‌సీ తన విధులను నిర్వర్తిస్తుందన్నారు. ముఖ్య కేసుల విచారణ, వాయిదాలు, ఇతర అవసరాల నిమిత్తం ఈ నెల 25, 26, 27 తేదీల్లో వెకేషన్ బెంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

రాజమహేంద్రవరంలో పీపీఏ కార్యకలాపాలు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) కార్యకలాపాలు నవంబర్ 1 నుంచి రాజమహేంద్రవరం నుంచి కొనసాగనున్నాయి. ఇందుకోసం బొమ్మూరులో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భవనాన్ని పీపీఏ స్వాధీనం చేసుకుంది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం, దాని నిర్మాణానికి 2014, మే 28న పీపీఏను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పీపీఏతో ఒప్పందం చేసుకుంటే ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతామని కేంద్రం అప్పటి టీడీపీ ప్రభుత్వానికి సూచించింది. కానీ.. కమీషన్ల కక్కుర్తితో పోలవరం నిర్మాణ బాధ్యతలను తమకే అప్పగించాలంటూ నాటి టీడీపీ సర్కార్ కేంద్రాన్ని కోరుతూ వచ్చింది. చివరకు ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు నాటి సీఎం చంద్రబాబు సిద్ధమవడంతో 2016, సెప్టెంబర్ 7న పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యేలా చేసేందుకు పీపీఏ కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలించాలని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను సీఎం జగన్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన పీపీఏ కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలించాలని సీఈవో శివ్‌నందన్‌కుమార్‌ను ఆదేశించారు.



దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రాష్ట్ర ప్రజల తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పణ
- సంప్రదాయ దుస్తులతో ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రి
- ఆలయం వద్ద సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం
- సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మకు ప్రత్యేక పూజలు
- సీఎంకు స్వాగతం పలికిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో అత్యంత ప్రాశస్త్యమైన మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మకు రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆహ్లాదకర వాతావరణం మధ్య క్యాంప్ కార్యాలయం నుంచి ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆలయం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సాదర స్వాగతం పలికారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పరివేష్టితం నిర్వహించారు. పరివేష్టితం ధారణతో అమ్మ వారి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలను ముఖ్యమంత్రి తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య ఆలయంలోకి ప్రవేశించారు. అంతరాలయంలో శ్రీసరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వైదిక కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు లింగంభట్ల దుర్గాప్రసాద్, ఇతర అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు సీఎం వైఎస్ జగన్‌ను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, దేవదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్,, ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాల రాజు, దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్ కుమార్, కల్పలతా రెడ్డి, ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కనకదుర్గ ఆలయం చైర్మన్ కర్నాటి రాంబాబు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరి గౌతంరెడ్డి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, ఆలయ ఈవో కెఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు



సంప్రదాయ దుస్తుల్లో అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న సీఎం వైఎస్ జగన్

'గ్రూప్–2' గెట్ రెడీ

- పది రోజుల్లో నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం
- ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించే యోచన

APPSC

సాక్షి, అమరావతి: విజయ దశమి వేళ నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న దాదాపు 950 గ్రూప్–2 పోస్టుల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈమేరకు ఏపీపీఎస్సీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఈ ఏడాది ఆగస్టు 28వతేదీన 508 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ఆర్థిక శాఖ తాజాగా మరో 212 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఏపీపీఎస్సీకి అనుమతినిస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు గత నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు పొందిచేరని పోస్టులు, క్యారీ ఫార్వార్డ్ పోస్టులు మరో 230 వరకు ఈ నోటిఫికేషన్‌లోనే భర్తీ చేయాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. తద్వారా గ్రూప్–2 కింద దాదాపు 950 పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది.

ఆగస్టులో అనుమతినిచ్చిన 508 పోస్టులు ఇవీ..

డిప్యూటీ తహసీల్దార్స్ గ్రేడ్ 2 (సీసీఎల్‌ఏ)	114
సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ 2 (స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్)	16
మున్సిపల్ కమిషనర్స్ గ్రేడ్–3	04
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్స్	150
అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్	18
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఫైనాన్స్)	23
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (సాధారణ పరిపాలన)	161
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (లా)	12
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (లెజిస్లేచర్)	10

మరో పది రోజుల్లోనే నోటిఫికేషన్ జారీ చేసి ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించాలని సర్వీస్ కమిషన్ యోచిస్తోంది.

యువత వినతిపై స్పందించిన సీఎం

గ్రూప్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ పలు సందర్భాల్లో అభ్యర్థుల నుంచి వినతులు రావడంతో వీలైనంత వేగంగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గతంలో అనుమతినిచ్చిన పోస్టులతో పాటు వీలైనంత ఎక్కువ సంఖ్యలో భర్తీ చేయాలని స్పష్టం చేయడంతో తాజాగా గ్రూప్ 2 విభాగంలో 212 పోస్టులకు అనుమతి ఇచ్చారు. ఆయా శాఖల నుంచి పోస్టుల ఖాళీలను నిర్ధారించుకున్న వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాల్సిందిగా సర్వీస్ కమిషన్‌కు ఉత్తర్వుల్లో సూచించారు. రోస్టర్ పాయింట్లతో పాటు విద్యార్హతల ఆధారంగా నిబంధనల మేరకు ఈ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థికశాఖ కోరింది. గ్రూప్స్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఇది చక్కటి అవకాశం. నోటిఫికేషన్ నాటికి ఆయా శాఖల్లో ఉన్న మరిన్ని ఖాళీలను సైతం కలపనున్నారు. దీంతోపాటు గత నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు పొంది చేరని పోస్టులు, క్యారీ ఫార్వార్డ్ పోస్టులను కూడా ఈ నోటిఫికేషన్‌లోనే భర్తీ చేయాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది.

శాఖల వారీగా పోస్టుల సంఖ్య ఇలా..

శాఖ	పోస్టులు		
వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనరేట్	02	ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టరేట్	03
వ్యవసాయ, సహకార కమిషనరేట్	07	పరిశ్రమ ట్రిబ్యునల్ కం లేబర్ కోర్టు	02
పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్	07	మున్సిపల్ పరిపాలన కమిషనరేట్	07
మత్స్యశాఖ డైరెక్టరేట్	03	పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ	02
పౌరసరఫరాల కమిషనరేట్	08	మైనారిటీ సంక్షేమ డైరెక్టరేట్	02
ఏపీపీఎస్సీ	30	పంచాయతీరాజ్ ఈఎన్‌సీ	05
డీజీపీ కార్యాలయం	08	ఆర్థిక, గణాంకశాఖ డైరెక్టరేట్	05
జైళ్ల డీజీ	02	సీసీఎల్‌ఏ	31
ప్రాసిక్యూషన్స్ డైరెక్టరేట్	02	పాఠశాల విద్య కమిషనరేట్	12
సైనిక సంక్షేమ డైరెక్టరేట్	02	వయోజన విద్య డైరెక్టరేట్	01
ఏపీ అడ్వకేట్ జనరల్ కార్యాలయం	08	పరీక్షల డైరెక్టరేట్	20
ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టరేట్	01	సాంఘిక సంక్షేమ కమిషనరేట్	01
పబ్లిక్ హెల్త్, కుటుంబ సంక్షేమశాఖ	19	రహదారులు-భవనాలు (ఈఎన్‌సీ)	07
సెకండరీ హెల్త్ డైరెక్టరేట్	02	మహిళా శిశు సంక్షేమ డైరెక్టరేట్	02
కార్మిక కమిషనరేట్	03	భూగర్భ జలాల డైరెక్టరేట్	01
ఫ్యాక్టరీస్ డైరెక్టరేట్	04	యువజన సర్వీసుల కమిషనరేట్	01
బాయిలర్స్ డైరెక్టరేట్	01	ఆర్కియాలజీ మ్యూజియం కమిషనరేట్	01
		మొత్తం	212

ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా డీఏ

- నేడు ఒక డీఏ విడుదల
- 3.64 శాతం డీఏ... 2022 జూలై 1 నుంచి వర్తింపు

సాక్షి, అమరావతి: దసరా పండుగ సందర్భంగా ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం దసరా పండుగ ముందు ఒక డీఏను శనివారం విడుదల చేయనుంది. ఈ మేరకు డీఏ 3.64 శాతం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డీఏను 2022 జూలై ఒకటో తేదీ నుంచి ఇస్తారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిల హర్షం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని శుక్రవారం ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి వేర్వేరుగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదల చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సాయంత్రానికి డీఏ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై వారు హర్షం వ్యక్తంచేశారు. డీఏ విడుదల చేయాలని నిర్ణయించినందుకు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు, సీఎస్ జవహర్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

తుది దశకు చేరిన డ్రోన్ సర్వే

ఇప్పటి వరకు 97 శాతం పూర్తి

- 13,075 గ్రామాల్లో 1.75 కోట్ల ఎకరాలు కొలిచారు
- ఇక మిగిలింది మూడు జిల్లాల్లోని 385 గ్రామాల్లోనే...
- ఈ నెలాఖరుకు మొత్తం పూర్తయ్యే అవకాశం
- మొత్తం పూర్తయితే 1.8కోట్ల ఎకరాలను కొలిచిన రికార్డు
- ప్రతిష్టాత్మకంగా డ్రోన్లు, విమానాలతో సర్వే చేయిస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేలో కీలకమైన డ్రోన్ సర్వే (డ్రోన్లతో భూముల కొలత) తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు 97 శాతం సర్వే పూర్తయింది. మిగిలిన 3 శాతాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయడానికి సర్వే, సెటిల్‌మెంట్ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలోని 17,595 గ్రామాలకు గాను, డ్రోన్ సర్వే సాధ్యం కాని 4,135 గ్రామాలను మినహాయిస్తే 13,460 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ గ్రామాల్లో డ్రోన్లు, విమానాల ద్వారా సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు 13,075 గ్రామాల్లో దాదాపు 1.75 కోట్ల ఎకరాల్లో సర్వే పూర్తయింది. ఇంకా కేవలం 385 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తి కావాల్సి ఉంది. వీటిలో శ్రీకాకుళం, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఎక్కువ గ్రామాల్లో సర్వే జరగాల్సి ఉంది. ఈ నెలాఖరుకు మొత్తం గ్రామాల్లో సర్వే పూర్తవుతుందని సర్వే శాఖ అధికారులంటున్నారు. ఇది పూర్తయితే రీ సర్వేలో అతి ముఖ్యమైన ఘట్టాన్ని పూర్తి చేసినట్లవుతుంది. మొత్తం 1.80 కోట్ల ఎకరాలను కొలిచినట్లవుతుంది. ఇది ఒక రికార్డుగా అధికారులు చెబుతున్నారు.



వేగంగా పూర్తి చేసేందుకు...

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పేరుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏరియల్ సర్వే కోసం డ్రోన్లతో పాటు విమానాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. సర్వే ఆఫ్ ఇండియాతోపాటు ప్రైవేట్ డ్రోన్ ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగించింది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 10 వేలమంది సర్వేయర్లను నియమించడంతోపాటు సొంతంగా 30 డ్రోన్లు కొనుగోలు చేసి సర్వేయర్లకు పైలెట్లుగా శిక్షణ ఇచ్చి సర్వే చేయిస్తోంది. దీంతో సర్వే అత్యంత వేగంగా పూర్తవుతోంది.

'కాంట్రాక్టు' ఉద్యోగులకు కానుక

- ప్రభుత్వ శాఖల్లో 10,117 మంది సర్వీసు క్రమబద్ధీకరణ
- గవర్నర్ ఆమోదంతో గజిట్‌లో ముద్రించిన ప్రభుత్వం
- మరో ఎన్నికల హామీని నెరవేర్చిన సీఎం జగన్ సర్కారు

సాక్షి, అమరావతి: గత ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్యరూపంలోకి తెచ్చింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించడంతో చట్ట రూపం సంతరించుకుంది. ఈ చట్టానికి సంబంధించి శుక్రవారం ప్రభుత్వ గజిట్‌లో ముద్రించింది. దీనిద్వారా 02--06-2014కు ముందు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న దాదాపు 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ జరగనుంది. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.311 కోట్ల ఆర్థిక భారం పడనుంది.

ఉద్యోగ సంఘాల హర్షం

మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో ముఖ్యమంత్రి జగన్ వెలుగులు నింపారని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి పేర్కొన్నారు. దసరా సందర్భంగా వేలాది మంది ఉద్యోగుల జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని, సీఎం ఉద్యోగుల పక్షపాతిగా శాశ్వతంగా నిలిచిపోతారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయటంపై ప్రభుత్వ కళాశాలల ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఇచ్చిన హామీకి కట్టుబడ్డ సీఎం జగన్, మంత్రివర్గం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి పఠాన్ కరీంఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో 3,600 మంది కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, 350 మంది కాంట్రాక్టు పాలిటెక్నిక్ లెక్చరర్లు, 600 మంది డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి చట్టబద్ధత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు ఏపీ స్టేట్ కాంట్రాక్టు ఫార్మసిస్ట్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్నాకరబాబు కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్ర హామీని నెరవేర్చి సీఎం జగన్ వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాలు పంచారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత హర్షం వ్యక్తం చేశారు. రెగ్యులరైజ్ అవుతున్న వారిలో దాదాపు 4 వేల మందికి పైగా బోధన రంగంలో సేవలు అందిస్తున్నవారేనని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీ నిరుద్యోగ జేఏసీ హర్షం

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు వేగంగా చర్యలు చేపడుతూ.. గతంలో ఇచ్చిన వాటికి అదనంగా కొత్తగా 212 గ్రూప్–2 పోస్టులు మంజూరు చేయడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే డీఎస్సీతో పాటు, పోలీసు శాఖ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించాలని కోరారు.

భావితరాలకు మార్గదర్శిగా ఏపీ రీసర్వే ప్రాజెక్టు

అస్సాం సర్వే డైరెక్టర్, పరిపాలన సంస్కరణలు, శిక్షణ శాఖ కార్యదర్శి శంతను పి.గోట్మారే

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రీ సర్వే ప్రాజెక్టు భావితరాలకు మార్గదర్శిగా నిలుస్తుందని అస్సాం ల్యాండ్ రికార్డ్స్, సర్వే డైరెక్టర్, పరిపాలనా సంస్కరణలు, శిక్షణ శాఖ కార్యదర్శి శంతను పి.గోట్మారే అన్నారు. అత్యాధునిక సాంకేతిక సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. గత రెండు రోజులుగా రీసర్వే ప్రాజెక్టుపై అధ్యయనం కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న గోట్మారే శుక్రవారం విజయవాడలోని సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్రంలో దశల వారీగా నిర్వహించిన రీ సర్వే పురోగతిని సిద్ధార్థ జైన్ ఆయనకు వివరించారు. సర్వే ప్రాజెక్టులో కీలక అంశాలుగా ఉన్న మీ భూమి పోర్టల్, రీ సర్వేలో మొదటి నుంచి చివరి వరకు జరిగే ప్రక్రియలు, మానవ వనరుల పరంగా విలేజ్ సర్వేయర్ల నియామకం, రీసర్వే బృందాల మోహరింపు, కార్స్ నెట్‌వర్క్ ఏర్పాటు, జీఎన్‌ఎస్‌ఎస్ రోవర్ల సేకరణ, డ్రోన్ సర్వే, ఓఆర్ఐల జారీ, క్షేత్ర స్థాయిలో నిజనిర్ధారణ, గ్రౌండ్ వెరిఫికేషన్ ప్రక్రియ, వివాదాల పరిష్కార యంత్రాంగం, రీ సర్వే రికార్డుల జనరేషన్ వంటి అన్ని అంశాలను వివరించారు. రీ సర్వే జరుగుతున్న తీరు చాలా బాగుందని, దీన్ని ఆదర్శంగా తీసుకుంటామని గోట్మారే తెలిపారు. అనంతరం గోట్మారేని అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్వే సెటిల్‌మెంట్ అదనపు కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ, జాయింట్ డైరెక్టర్ ప్రభాకరరావు, సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్, కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కెజియా కుమారి, స్పెషల్ ఆఫీసర్ ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అస్సాం పరిపాలన సంస్కరణలు, శిక్షణ శాఖ కార్యదర్శిని సన్మానిస్తున్న సిద్ధార్థ జైన్

1,896 వీఏహెచ్‌ఏ పోస్టులు భర్తీకి గ్రీన్ సిగ్నల్

- ఉత్తర్వులిచ్చిన స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది
- పశుసంవర్ధక శాఖ ద్వారా భర్తీకి చర్యలు
- నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్

సాక్షి,అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 1896 గ్రామ పశుసంవర్ధక సహాయకుల(వీఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు భర్తీకి అనుమతినిస్తూ ఆ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలుత స్థానికంగా ఉండే పశుసంపద ఆధారంగా 9,844 వీఏహెచ్‌ఏలు అవసరమని గుర్తించి ఆ మేరకు నోటిఫికేషన్ ఇచ్చారు. రెండు విడతల్లో 4,643 ఆర్బీకేల్లో వీహెచ్‌ఏలను నియమించారు. కాగా, రేషనలైజేషన్ ద్వారా ఒకే గ్రామంలో 2, 3 ఆర్బీకేలున్న చోట గ్రామాన్ని యూనిట్‌గా వీఏహెచ్‌ఏలను నియమించి, అదనంగా ఉన్న వీహెచ్‌ఏలను వీహెచ్‌ఏలు లేని ఆర్బీకేలకు సర్దుబాటు చేశారు. వెటర్నరీ డిస్పెన్సరీలు, ఆస్పత్రులున్న గ్రామాల్లోని ఆర్బీకేల్లో వీఏహెచ్‌ఎలను కూడా ఇతర ఆర్బీకేలకు సర్దుబాటు చేశారు. ఆ విధంగా 1,395 గ్రామాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలు, 1,218 గ్రామాల్లో రూరల్ లైవ్ స్టాక్ యూనిట్స్ ఉండగా, ఆ మేరకు సిబ్బందిని సర్దుబాటు చేశారు. తద్వారా 6,539 ఆర్బీకేల పరిధిలో వీఏహెచ్‌ఏలు అవసరమవుతారని గుర్తించారు. వాటిలో ఇప్పటికే 4,643 ఆర్బీకేల్లో వీఏహెచ్‌ఏలు పనిచేస్తున్నందున.. మిగిలిన 1896 ఆర్బీకేల పరిధిలో ఖాళీగా ఉన్న వీఏహెచ్‌ఏలను నియమించాలని గుర్తించారు. ఈ పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణను లేఖ రాశారు. ఈ మేరకు అనుమతినిస్తూ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులిచ్చారు. 1896 పోస్టుల భర్తీ ద్వారా 2030 ఆర్బీకేల్లో పశువైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. కాగా పశుసంవర్ధక శాఖ ద్వారా ఈ పోస్టుల భర్తీ కోసం నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ సాక్షికి తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగులకు శుభవార్త

- పెన్షన్ గ్యారెంటీ బిల్లుకు గవర్నర్ ఆమోదంతో చట్టబద్ధత
- చట్టం 31 2023ను గజిట్‌లో ప్రకటించిన ప్రభుత్వం
- గ్యారెంటీ పెన్షన్ అమలుతో ఆర్థిక స్థిరత్వానికి భరోసా

సాక్షి, అమరావతి: జాతీయ పెన్షన్ స్కీమ్‌గా వ్యవహరించే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. సీపీఎస్ ఉద్యోగులకు పదవీ విరమణ తరువాత ఎంత పెన్షన్ వస్తుందన్నది మార్కెట్ ఆధారంగా ఉన్నందున వారికి గ్యారెంటీడ్ పెన్షన్‌ను అమలు చేసేందుకు ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించడంతో చట్ట రూపం దాల్చింది. ఈమేరకు గ్యారెంటీ పెన్షన్ స్కీము చట్టం 31, 2023ను శుక్రవారం గజిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పదవీ విరమణ అనంతరం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ ద్వారా ఉద్యోగి చివరి మూల వేతనంలో 50 శాతం మేర పెన్షన్ వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వానికి భరోసా ఇచ్చింది. సీపీఎస్ ఉద్యోగులకు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ ఈ చట్టం చేసింది. గ్యారెంటీ పెన్షన్ స్కీము అమలు కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై 2040 నాటికి రూ.2,500 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా వేశారు.

క్లుప్తంగా...

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు సీజే



హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్, ఈవో

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ సరస్వతీదేవిగా కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ఏపీ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు.. కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రధాన న్యాయమూర్తికి ఆలయం వద్ద స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం రాజగోపురం వద్ద ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావులు ప్రధానన్యాయమూర్తి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఆశీర్వాద మండపంలో ఠాకూర్ దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. అలాగే అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని, ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందించారు.

విశాఖలో ఐసీఐడీ 25వ కాంగ్రెస్

- 74వ ఐఈసీ సమావేశం కూడా..
- నవంబర్ 2 నుంచి 8 వరకు

సాక్షి, అమరావతి: ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ (ఐసీఐడీ) 25వ కాంగ్రెస్ నవంబర్ 2 నుంచి 8 వరకు విశాఖలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. రానున్న రోజుల్లో ప్రపంచంలో వ్యవసాయరంగంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొని..పంటలు సాగుచేసి, ఆహార భద్రత చేకూర్చడమే ఈ సదస్సు అజెండా. ఈ సదస్సులో భాగంగానే ఐసీఐడీ 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్) సమావేశాన్ని కూడా నిర్వహించనున్నారు. వారం పాటు నిర్వహించే ఈ అంతర్జాతీయ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సదస్సును విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ సదస్సుకు 78 దేశాల నుంచి ప్రతినిధులు, ఇంజినీరింగ్ నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు.

72 ఏళ్ల తర్వాత దేశంలో..

జలవనరుల సంరక్షణ..తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు విధానాలపై అధ్యయనం చేసి, వాటి ఫలితాలను ప్రపంచానికి అందించడమే లక్ష్యంగా 1950, జూన్ 24న సిమ్లాలో ఐసీఐడీ ఆవిర్భవించింది. ఇందులో 78 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఐసీఐడీ తొలి కాంగ్రెస్‌ను 1951, జనవరిలో ఢిల్లీలో నిర్వహించారు. ఇప్పుడు ఆ సంస్థ 25వ కాంగ్రెస్‌ను విశాఖలో నిర్వహిస్తున్నారు.

'టీటీడీ నిధులతో తిరుపతి అభివృద్ధి' ప్రతిపాదనకు ప్రభుత్వం నో

- దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెమో జారీ

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వార్షిక బడ్జెట్ నుంచి ఒక్క శాతం నిధులను తిరుపతి నగర అభివృద్ధికి ఖర్చు పెట్టాలని టీటీడీ ధర్మకర్త మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం 'నో' చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనలో భాగంగా తిరుపతి నగరాభివృద్ధి బాధ్యత టీటీడీకి ఉందని పేర్కొంటూ.. ఏటా టీటీడీ వార్షిక బడ్జెట్ నుంచి ఒక శాతం తిరుపతి అభివృద్ధికి ఖర్చు పెట్టేలా టీటీడీ ప్రతిపాదన చేస్తూ ఈనెల 9న జరిగిన ఆలయ ధర్మకర్తల మండలి (ట్రస్టు బోర్డు) సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదన ఆమోదం కోరుతూ ఈనెల 15న ఆలయ ఈవో ధర్మారెడ్డి దేవదాయశాఖకు లేఖ రాశారు. దీనికి ప్రతిగా టీటీడీ ధర్మకర్తల మండలి ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలుపలేదని పేర్కొంటూ దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఇచ్చిన హామీల్లో జగన్ నెరవేర్చింది చారడంతే

- టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీల జాబితా చాంతాడంత ఉంటే నెరవేర్చింది కేవలం చారడంతేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన టీడీపీ నేతలతో కలిసి ఏపీ హేట్స్ జగన్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతిని ఆధారాలతో ప్రజలకు వివరిస్తూ, వారిలో చైతన్యం తీసుకు వస్తున్నాడన్న అక్కసుతోనే చంద్రబాబును జగన్ జైలుకు పంపాడని ఆరోపించారు. ఏపీ హేట్స్ జగన్ పుస్తకాన్ని చదవాలని ప్రజలను కోరారు. 2019 ఎన్నికల సమయంలో ప్రజల్ని హామీలతో, మోసపు వాగ్దానాలతో నమ్మించడంలో జగన్ విజయం సాధించారని ఆరోపించారు.

చిట్టి గుండెకు గట్టి భరోసా

గుండె సమస్యలున్న చిన్నారులకు శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయం పునర్జన్మ

"ముక్కుపచ్చలారని ఏ చిన్నారి కూడా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడకూడదు. వ్యాధిబారిన పడ్డ నా బిడ్డను కాపాడుకోలేకపోయాననే వేదన ఏ ఒక్కరూ పడకూడదు. ఇందుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరించాలి. ఆ బాధ్యత నాది"..

.. అంటూ చిన్నపిల్లల గుండె సంబంధిత చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చి వివిధ ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్య సహాయం అందించేలా దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషిచేశారు. 2003లో ఆయన చెప్పిన ఈ మాటలను కార్యరూపం దాల్చేలా 2004లో నిర్ణయం తీసుకుని పసిగుండెలకు సాంత్వన చేకూర్చారు. ఇప్పుడాయన వారసుడిగా సీఎం జగన్ మరో అడుగు ముందుకేసి చిన్నపిల్లల గుండె సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఓ ఆస్పత్రినే నిర్మించాలని సంకల్పించారు. మరెక్కడా ఇలాంటి సమస్యల కోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి లేకపోవడంతో చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దీనికి బీజం వేశారు. అనుకున్నట్లుగానే అత్యాధునిక వైద్య సదుపాయాలతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తిరుపతిలో విజయవంతంగా అంకురార్పణ చేశారు.

- 2021 అక్టోబరులో ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం జగన్
- రూ.లక్షలు విలువచేసే గుండె మార్పిడి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తున్న ముఖ్యమంత్రి మానసపుత్రిక
- ఇప్పటివరకు 1,980 మందికి పైగా చిన్నారులకు ఆపన్నహస్తం
- విజయవంతంగా ఏడు గుండె మార్పిడి ఆపరేషన్లు..
- రెండేళ్లలో 14,800 ఓపీ సేవలు ఇక్కడ నమోదు
- లబ్ధి పొందిన మెజారిటీ శాతం పేద కుటుంబాల వారే..
- రూ.450 కోట్లతో.. చిన్నారులకు 15రకాల సూపర్ స్పెషాలిటీ విభాగాలతో అలిపిరిలో మరో ఆసుపత్రి నిర్మాణం



శస్త్ర చికిత్సల అనంతరం ఆస్పత్రి వార్డులో ఉన్న పిల్లలు



ఈ ఫొటోలోని సుర్ల శివ, పార్వతి దంపతులది పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురం. ఎనిమిది నెలల క్రితం వీరికొక కొడుకు ప్రన్షు పుట్టాడు. చిన్నారికి ఆరోగ్యం బాగోకపోవడంతో విశాఖలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నారి గుండెలో రంధ్రంతో పాటు.. చెడు, మంచి రక్తం కలుస్తున్నాయని వైద్యులు పిడుగులాంటి వార్త చెప్పారు. ఆపరేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చవుతుందన్నారు. అంత స్తోమత ఆ దంపతులకు లేదు. అదే సమయంలో తిరుపతిలో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చికిత్స గురించి తెలిసిన వాళ్లు చెప్పారు. వెంటనే అక్కడ తీసుకెళ్లగా చిన్నారికి పరీక్షలు చేసి ఒక్కరూపాయి కూడా ఖర్చుకాకుండా ఆరోగ్యశ్రీ కింద స్టెంట్లు వేశారు. చిన్నారి కోలుకుని బరువు పెరిగాక గుండె రంధ్రానికి కూడా ఇక్కడే ఉచితంగా ఆపరేషన్ చేయనున్నారు. 'ఇక నాకు పిల్లలు పుట్టే అవకాశంలేదు. బాబుకు ఏదైనా జరిగితే ఎలా అని నేను ఏడవని రోజులేదు. ఈ రోజు నా బిడ్డ ప్రాణాలతో ఉన్నాడంటే అది ఒక్క సీఎం జగన్ వల్లే'.. అంటూ పార్వతి భావోద్వేగంతో కన్నీరు పెట్టుకుంది.



ఈ ఫొటోలోని అన్నమయ్య జిల్లా మంగపట్నంకు చెందిన గంగాదేవి వ్యవసాయ కూలీ. మంచం మీద నిద్రపోతున్న చిన్నారి ఈమె కుమారుడు.. పేరు దేవాన్ష్. ముగ్గురు ఆడపిల్లల అనంతరం కలిగిన మగ సంతానం. అయితే, పుట్టుకతోనే గుండె సమస్య వచ్చిపడింది. రెక్కాడితే కానీ డొక్కాడని వీరికి ఆపరేషన్ చేయించే స్థోమతలేదు. గంగాదేవి కుమారుడి ప్రాణాలను ఆరోగ్యశ్రీ, హృదయాలయం రూపంలో ప్రభుత్వం ఆదుకుంది. తాముంటున్న ప్రాంతానికి కొద్దిదూరంలోని తిరుపతిలో ఆపరేషన్ చేస్తున్నారని తెలిసి బాబును ఇక్కడికి తీసుకొచ్చింది. ఏ సిఫార్సు, చేతి నుంచి ఒక్క రూపాయి ఖర్చులేకుండా చిన్నారికి ఆపరేషన్ పూర్తయింది. 'కుటుంబ పోషణే భారమైన మాకు కొడుకు ఆరోగ్య సమస్యతో పెద్ద చిక్కొచ్చి పడింది. కానీ, కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం నా బిడ్డకు ఉచితంగా ఆపరేషన్ చేయించింది'.. అని అంటున్న గంగాదేవి ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.



ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారి

..ఈ ఇద్దరు చిన్నారుల తరహాలోనే పుట్టుకతో తీవ్రమైన గుండె సమస్యలున్న వందల మంది చిన్నారులకు శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయం అక్కున చేర్చుకుని పునర్జన్మను ప్రసాదించింది. 11 అక్టోబరు 2021 అక్టోబరు 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన మానసపుత్రికను ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్క రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. విజయవంతంగా గుండె ఆపరేషన్లు నిర్వహిస్తూ అభాగ్యుల పాలిట వరంగా నిలుస్తున్న హృదయాలయాన్ని 'సాక్షి' పరిశీలించి రోగుల కుటుంబాలను పలకరిస్తే.. ఒకొక్కరిదీ ఓ కన్నీటి గాథ ఆవిష్కృతమైంది.

(వడ్డే బాలశేఖర్, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం నుంచి సాక్షి ప్రతినిధి)

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చీరాగానే సీఎం వైఎస్ జగన్ ప్రజారోగ్య వ్యవస్థను పట్టాలెక్కించి పరుగులు పెట్టించారు. పిల్లలకు ప్రభుత్వరంగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల బలోపేతంపైనా దృష్టిసారించారు. ఇందులో భాగంగా టీటీడీ సహకారంతో తిరుపతిలో చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా శ్రీపద్మావతి హృదయాలయాన్ని ప్రారంభించారు. ఇప్పుడు పిల్లల గుండె చికిత్స కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలకు వెళ్లే పనిలేకుండా పోయింది.

1,980 మంది చిన్నారులకు పునర్జన్మ

ఇక ఈ రెండేళ్లలో 14,800 ఓపీ సేవలు ఈ ఆస్పత్రిలో నమోదయ్యాయి. వీరిలో పుట్టుకతో వచ్చిన గుండె సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు ఓపెన్ హార్ట్, కీ హోల్, వంటి ఇతర సర్జరీలు పెద్దఎత్తున నిర్వహించారు. మరికొందరికి మెడికల్ మేనేజ్‌మెంట్ చేశారు. ఇలా 1,980 మందికి పైగా చిన్నారులకు పునర్జన్మను ప్రసాదించారు. వీరిలో మెజారిటీ శాతం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారే. ఆరోగ్యశ్రీ కింద వీరికి పూర్తి ఉచితంగా వైద్యసేవలన్నింటినీ అందించారు. ఈ క్రమంలో ఆరోగ్యశ్రీ కింద 2,052 ప్రొసీజర్లు రెండేళ్లలో నమోదయ్యాయి. చిన్నారులతో పాటు, పెద్దలకు సైతం గుండె మార్పిడి ఆపరేషన్లను చేపట్టారు. ఇప్పటివరకూ ఏడు గుండె మార్పిడి ఆపరేషన్లు ఇక్కడ నిర్వహించారు. ఒక్కో ఆపరేషన్‌కు రూ.10 లక్షల వరకూ ఖర్చుకాగా ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించింది. గుండె మార్పిడి, ఇతర చికిత్సల కోసం సీఎం ఆర్ఎఫ్ కింద కూడా అదనంగా సహాయం అందింది. 75 పడకలున్న ఈ ఆస్పత్రిలో 15 మంది నిష్ణాతులైన వైద్యులు సేవలు అందిస్తున్నారు. అడ్వాన్స్ క్యాథ్‌ల్యాబ్, మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ పరికరాలతో పాటు, ఆపరేషన్ థియేటర్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ ఆసుపత్రికి తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి సులభంగా ఆటోలో వెళ్లొచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అలాగే.. బాధితులతో వచ్చే అటెండర్లలో ఒకరు ఇక్కడ ఉండొచ్చు. ఇక ఈ ఆసుపత్రి ఇటీవలే ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా గుర్తింపు పొందింది. ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా సంస్థ ప్రైడ్ ఆఫ్ నేషన్‌గా ఈ అవార్డును ప్రకటించగా తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ డా.శ్రీనాథరెడ్డి దానిని అందుకున్నారు.

త్వరలో మరో సూపర్ స్పెషాలిటీ..

మరోవైపు.. తిరుపతి జిల్లా అలిపిరి వద్ద శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా నిర్మిస్తున్నారు. రూ.450 కోట్ల వ్యయంతో, అత్యాధునిక ప్రమాణాలతో దీనిని ఏర్పాటుచేస్తున్నారు. హెమటో ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ లాంటి 15 రకాల సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో చిన్నారులకు వైద్యసేవలు, చికిత్సలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇదే తరహాలో విశాఖపట్నం, గుంటూరు, విజయవాడల్లోను పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల వైద్యశాఖ అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

నెలకు 120 సర్జరీలు..



మొదట్లో ఇక్కడ నెలకు 30 ఆపరేషన్ల వరకూ చేసేవాళ్లం. ప్రస్తుతం నెలకు 100 నుంచి 120 చేస్తున్నాం. పెద్దల్లో కూడా పుట్టుకతో వచ్చిన స్ట్రక్చరల్ గుండె సమస్యలతో పాటు, గుండె మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం. 15 మంది నిపుణులైన వైద్యులు, ఇతర సిబ్బంది, అత్యాధునిక వైద్య పరికరాలున్న ఈ తరహా ఆస్పత్రి ప్రైవేట్‌లో కూడా ఎక్కడా ఉండదు. ఆస్పత్రి నిర్వహణ కోసం టీటీడీ పుష్కలంగా నిధులు అందిస్తోంది. ఇక పేద ప్రజలకు ఉచితంగా చికిత్సలు చేయడానికి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ రూపంలో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. త్వరలో అలిపిరిలో పీడియాట్రిక్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తుంది.

– డాక్టర్ శ్రీనాథరెడ్డి, డైరెక్టర్, శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయం



ఆస్పత్రిలోని అధునాతన క్యాథ్‌ల్యాబ్

సీఎం జగన్ నాకు పునర్జన్మనిచ్చారు



గుంటూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తుంటాను. నాకు గుండె సంబంధిత సమస్య ఉండటంతో హైదరాబాద్, గుంటూరు ఇలా చాలాచోట్ల చూపించుకున్నా. గుండె మార్పిడి చేయాలన్నారు. గతనెల 24న గుండె మార్పిడి చేశారు. ఈ ఆపరేషన్‌కు రూ.10 లక్షల పైనే ఖర్చవుతుందన్నారు. అయితే, నాకు ఒక్క రూపాయి కూడా ఖర్చుకాలేదు. మొత్తం ప్రభుత్వమే భరించింది. సీఎం జగన్ నాకు పునర్జన్మ ప్రసాదించారు.

– ఎస్. సుమతి, వెల్దుర్తి, పల్నాడు జిల్లా

ఆరోగ్యశ్రీ కింద ఇప్పటివరకూ నిర్వహించిన గుండె చికిత్సలు..

సంవత్సరం	ప్రొసీజర్లు	నిధులు (రూ.కోట్లలో)
2021-22	201	1.56
2022-23	1,049	8.42
2023-24 (ఇప్పటివరకూ)	802	6.14
మొత్తం	2,052	16.12

సమస్యలకు చకచకా పరిష్కారం

- జగనన్నకు చెబుదాంలో 2.20 లక్షల సమస్యల పరిష్కారం
- 86 శాతం సమస్యల పరిష్కారం
- పరిష్కార దశలో మరో 36,526 సమస్యలు
- సమస్యల పరిష్కారంపై 85 శాతం ప్రజలు సంతృప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం విజయవంతగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రజలు చెప్పుకొన్న సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి. టోల్‌ఫ్రీ నంబర్‌కు ప్రజలు సమస్యలు చెప్పగానే, వాటిని సంబంధిత శాఖలు వెనువెంటనే పరిష్కరిస్తున్నాయి. ఈ ఏడాది మే 9వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు ఈ నెల 12వ తేదీ వరకు తెలిపిన సమస్యల్లో ఇప్పటివరకు 86 శాతం పరిష్కారమయ్యాయి. మిగతావి పరిష్కారదశలో ఉన్నాయి. 85 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు వెల్లడైంది.

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమస్యలను తెలపడానికి ప్రభుత్వం 1902 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసింది. ఈ నంబరుకు వచ్చిన సమస్యలను నిర్ధారించిన గడువులోగా పరిష్కరించి, దాని స్థితిగతులను ఫిర్యాదుదారుకు తెలియజేస్తారు. ఇలా జవాబుదారీతనంతో కూడిన ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారాన్ని నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో పాటు శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. పరిష్కరించిన సమస్యల పట్ల ప్రజలు అభిప్రాయాన్ని కూడా తిరిగి ఆడిట్ ద్వారా తెలుసుకుంటున్నారు. 1902 నంబరుకు ఈ నెల 12వ తేదీ వరకు 2,57,311 సమస్యలు వచ్చాయి. అందులో 2,20,785 సమస్యలను పరిష్కరించారు. అంటే 86 శాతం పరిష్కారమయ్యాయి. మరో 14 శాతం అంటే 36,526 సమస్యలు పరిష్కార దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్లతో ఈ కార్యక్రమంపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించి, ప్రజల సంతృప్తి శాతాన్ని ఇంకా మెరుగుపరచాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో మొదటి 5 స్థానాల్లో ఉన్న శాఖలు, వాటి పనితీరు

ఇంధన	71 శాతం
గృహ నిర్మాణం	70 శాతం
పౌరసరఫరాలు	70 శాతం
వైద్య ఆరోగ్య	62 శాతం
వ్యవసాయం	62 శాతం

మొదటి 5 జిల్లాల్లో పనితీరు ఇలా

అన్నమయ్య	70 శాతం
చిత్తూరు	68 శాతం
తిరుపతి	65 శాతం
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	64 శాతం
శ్రీకాకుళం	64 శాతం

సమస్యల పరిష్కారంలో ఇంధన శాఖ, గృహ నిర్మాణ, వైద్య ఆరోగ్య, వ్యవసాయ శాఖల పట్ల ప్రజల్లో అత్యధికంగా సంతృప్తి వ్యక్తమైంది. అలాగే అన్నమయ్య , చిత్తూరు, తిరుపతి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు. శ్రీకాకుళం జిల్లాల్లో జగనన్నకు చెబుదాంలో సమస్యల పరిష్కారం పట్ల అత్యధిక శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

'డౌనూరు'లో కాఫీ క్యూరింగ్ కేంద్రం

- దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు
- అల్లూరి జిల్లాలో శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం రాజన్నదొర

కొయ్యూరు: దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని డౌనూరులో కాఫీ క్యూరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. కొయ్యూరు మండలంలోని డౌనూరులో రూ.4 కోట్లతో ఏర్పాటు చేస్తోన్న కాఫీ క్యూరింగ్, రోస్టింగ్, ప్యాకింగ్ యూనిట్‌కు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి రాజన్నదొర శంకుస్థాపనచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..నాణ్యమైన సేంద్రియ ఎరువులతో కాఫీని పండించడం వల్ల రుచి అద్భుతంగా ఉంటుందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ 20 సదస్సులో అతిథులకు ప్రధాని మోదీ అరకు కాఫీని బహూకరించారని గుర్తు చేశారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో ప్రస్తుతమున్న 2.5 లక్షల ఎకరాలకు అదనంగా మరో లక్ష ఎకరాల్లో కాఫీని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు గిరిజన సంక్షేమానికి ఖర్చు చేసిందన్నారు. గిరిజనుల నుంచి పసుపును కూడా కొనుగోలు చేయాలని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. గిట్టుబాటు ధర విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. కాఫీ రైతులకు రుణాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ మాధవి, ఎమ్మెల్సీ రవిబాబు, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు.



కాఫీ క్యూరింగ్ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న రాజన్నదొర, వైవీ సుబ్బారెడ్డి, మాధవి తదితరులు

అభాగ్యులకు ఆపన్నహస్తం

సీఎం జగన్‌ను కలిసి కష్టాలు చెప్పుకొన్న బాధితులకు ఆర్థిక సాయం

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభాగ్యులకు ఆపన్నహస్తం అందించారు. గురువారం ఎమ్మిగనూరుకు వచ్చిన ఆయనను పలువురు కలిసి తమ బాధలు చెప్పుకోవడంతో సీఎం చలించిపోయారు. తక్షణ సాయం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ఆరుగురు బాధితులకు రూ.లక్ష చొప్పున సాయం అందించారు. అలాగే సీఎంను ఉద్యోగాలు అడిగిన వారికి ఉపాధి కల్పన అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



శ్రావణి తల్లికి చెక్కు ఇస్తున్న కలెక్టర్ సృజన

సీఎంను కలిసిన బాధితుల వివరాలు

- కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన యు.అశోక్ ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.
- గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన కురువ రాజు కుమార్తె అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది.
- ఎమ్మిగనూరుకు చెందిన షేక్ రేష్మకు బ్రెయిన్ క్యాన్సర్ కారణంగా రెండు కళ్లు కోల్పోయింది.
- ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన బి.భాస్కర్ కుడి కాలు ఆపరేషన్ చేయించుకుని ఆర్థికంగా చితికిపోయారు.
- గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన డి.ఖాజావలి ఆరేళ్లుగా కిడ్నీ, యూరిన్ బ్లాడర్ సమస్యతో బాధపడుతున్నారు.
- ఎమ్మిగనూరుకు చెందిన గొల్ల లక్ష్మన్న కుమార్తె శ్రావణి మానసిక జబ్బుతో బాధపడుతోంది.

లాయర్లకు వేల కోట్ల ఫీజులు.. చంద్రబాబుకు ఆ డబ్బు ఎక్కడిది?

- చంద్రబాబు కోసం పేరున్న 19 మంది లాయర్లు పనిచేస్తున్నారు
- లాయర్ల ఫీజులు, ఖర్చులు చెల్లించడానికి ఎన్ని షేర్లు విక్రయించారు భువనేశ్వరి?
- నారా చంద్రబాబుపై లక్ష్మీపార్వతి విమర్శలు

సాక్షి, అమరావతి: లాయర్లకు వేల కోట్ల రూపాయల ఫీజులు చెల్లించడానికి నారా చంద్రబాబుకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. ఈ ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అది వైట్ మనీనా లేక బ్లాక్ మనీనా అనేది స్పష్టం చేయాలన్నారు. ప్రజలు సంధిస్తున్న ఈ ప్రశ్నలకు చంద్రబాబు కుటుంబం సమాధానం చెప్పాల్సి ఉందన్నారు.



తాడేపల్లిలో శుక్రవారం ఆమె ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అవినీతి సొమ్మును లాయర్లకు చెల్లించడానికే లోకేశ్ ఢిల్లీలో మకాం పెట్టారన్నారు. 40 రోజులుగా చంద్రబాబు కోసం పేరున్న 19 మంది లాయర్లు పనిచేస్తున్నారని, ఇందులో ముగ్గురి పేర్లు న్యాయబృందంలో చేర్చలేదని తెలిపారు. సీనియర్ లాయర్లకు రోజుకు రూ.కోటి నుంచి రూ.2.50 కోట్ల ఫీజు ఉందన్నారు. ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు చంద్రబాబు కేసులు వాదించడానికి లాయర్ల ఫీజుకే రూ. 2 వేలకోట్లకు పైగా ఖర్చు అయి ఉండొచ్చన్నారు. ఇతర ఖర్చులు రోజుకు రూ.3 కోట్లు అవుతోందని తెలిపారు.

అప్పట్లో ఇందిరకు ఇద్దరే లాయర్లు

2 శాతం హెరిటేజ్ షేర్లను విక్రయిస్తే రూ. 400 కోట్ల ఆదాయం వస్తుందని భువనేశ్వరి చెప్పిన విషయాన్ని లక్ష్మీపార్వతి ప్రస్తావిస్తూ, న్యాయవాదులు ఫీజులు, ఖర్చులు చెల్లించడానికి ఆమె ఎన్ని షేర్లను విక్రయించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో పచ్చమీడియా అయినా ప్రజలకు వివరించాలన్నారు. దేశ ప్రధానిగా 16 ఏళ్లు పనిచేసిన ఇందిరాగాంధీ కూడా తన కేసును వాదించడానికి ఇద్దరే లాయర్లను పెట్టుకున్నారని, చంద్రబాబు స్థాయిలో అమెరికా ప్రెసిడెంట్ కూడా లాయర్లను పెట్టుకోలేదంటూ లక్ష్మీపార్వతి సెటైర్లు వేశారు. చంద్రబాబు జైల్లో కూర్చొని కుట్రలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

ఎన్నో ఆత్మలకి శాంతి..

చంద్రబాబు అరెస్టు తర్వాత ఆయన కుట్రతో చనిపోయినటువంటి వారి ఆత్మలు శాంతిస్తున్నాయని లక్ష్మీపార్వతి అన్నారు. ఎన్టీఆర్, నందమూరి హరికృష్ణ, వంగవీటి మోహనరంగా, పింగళి దశరథ్‌రామ్, గోదావరి పుష్కరాల్లో మరణించిన 29 మంది, కందుకూరు తొక్కిసలాటలో చనిపోయిన 8 మంది, గుంటూరులో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరుతుందని చెప్పారు. ఒక నీచుడు, దుర్మార్గుడు జైలుకెళ్తే అతని చేతిలో బలైన వారి ఆత్మలు శాంతిస్తాయి తప్ప ఏ ఒక్కరి గుండెలు పగలవన్నారు.

సాక్షి

శనివారం, 21 అక్టోబర్ 2023

నిఠారి హంతకులెవరు?

కనీవినీ ఎరుగని ఘోరం జరుగుతుంది. పత్రికల్లో పతాక శీర్షికవుతుంది. చానెళ్లలో ప్రధాన చర్చనీయాంశంగా మారుతుంది. సమాజంలో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతాయి. కారకులను ఉరికంబం ఎక్కించాలంటూ జనం డిమాండ్ చేస్తారు. ఇప్పటికిప్పుడు ఎన్‌కౌంటర్ చేయాలని గొంతెత్తుతారు. తీరా కాలం గడిచాక, న్యాయస్థానాల్లో విచారణలు వాయిదాల్లో సాగాక నిందితులు నిర్దోషులుగా విడుదలవుతారు. అన్ని కేసుల్లోనూ కాకపోవచ్చుగానీ, కొన్నింటి విషయంలో ఇలాగే జరుగుతోంది. బాధిత కుటుంబాలకు న్యాయం దక్కలేదని ఆక్రోశించాలో, అమాయకులకు విముక్తి లభించిందని భావించాలో తెలియని అయోమయ స్థితి ఏర్పడుతోంది. మరి దోషులెవరన్న ప్రశ్న తలెత్తుతోంది. సరిగ్గా పదిహేడేళ్ల క్రితం పెనుసంచలనం సృష్టించిన 'నిఠారీ హత్యల' కేసుల్లో నిందితులుగా భావించిన సురేందర్ కోలీ, మోనిందర్ సింగ్ పంధేర్‌లు తాజాగా అలహాబాద్ హైకోర్టు తీర్పుతో నిర్దోషులుగా బయటపడటం బహుశా ఎవరూ ఊహించని ముగింపు. ఎందుకంటే 2005–06 మధ్య వారిద్దరూ చేశారని చెప్పిన నేరాల జాబితా చాలా పెద్దది. వారి చేతుల్లో ఏకంగా 18 మంది బాలికలు, మహిళలు ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తేల్చారు. ఒంటరిగా కనబడిన నిరుపేద బాలికలకూ, మహిళలకూ మాయమాటలు చెప్పి బంగ్లాలోకి తీసుకెళ్లటం, వారిని హతమార్చటం నేరగాళ్లు అనుసరించిన విధానం. హత్యల తర్వాత మృతదేహాలపై కోలీ, పంధేర్‌లు లైంగికదాడి జరిపేవారనీ, నరమాంస భక్షణ చేసేవారనీ వచ్చిన కథనాలు వెన్నులో వణుకు పుట్టించాయి. మృతదేహాలపై లైంగిక దాడి తర్వాత శరీర భాగాలను ఇంటి వెనకున్న కిటికీ నుంచి విసిరేసేవారని కూడా ఆ కథనాల సారాంశం. ఎప్పటికప్పుడు వీరందరి అదృశ్యంపైనా ఫిర్యాదులొచ్చినా పోలీసులు నిర్లక్ష్యం వహించటంవల్లే ఇన్ని హత్యలు జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. తీరా ఇన్నేళ్లు గడిచాక పోలీసులు సరైన సాక్ష్యాధారాలను చూపలేకపోయారనీ, వారి దర్యాప్తు ఆద్యంతం అస్తవ్యస్థంగా సాగిందనీ హైకోర్టు తేల్చింది.

వీధిలో ఆడుకుంటున్న పిల్లలకు మురికి కాల్వలో పుర్రె భాగం దొరకటంతో ఈ కేసుల డొంక కదిలింది. ఆ తర్వాత 8 మంది పిల్లల ఎముకలు ఇంటి వెనుక దొరికాయి. నిందితులపై 2009లో బ్రెయిన్ మ్యాపింగ్, నార్కో అనాలిసిస్, సైకలాజికల్ అసెస్‌మెంట్స్ వంటి శాస్త్రీయ పరీక్షలు చేశారని వార్తలొచ్చాయి. 'హఠాత్తుగా నాలో దయ్యం నిద్ర లేచేది. ఎవరినో ఒకరిని మట్టుబెట్టాలన్న వాంఛ పుట్టుకొచ్చేది' అని కోలీ చెప్పినట్టు కూడా మీడియా కథనాలు తెలిపాయి. నిందితులిద్దరిపైనా 19 కేసులు నమోదుకాగా, వీటిని విచారించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 12 కేసుల్లో కోలీని దోషిగా తేల్చి మరణశిక్ష విధించగా, రెండు కేసుల్లో పంధేర్ దోషిగా తేలాడు. అతనికి కూడా మరణశిక్ష పడింది. దోషులు అప్పీల్ చేసుకోగా యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఒక కేసులో మినహా అన్నింటిలోనూ కోలీ నిర్దోషిగా బయటపడ్డాడు. పంధేర్‌కు అన్ని కేసుల నుంచీ విముక్తి లభించింది. వీరిద్దరిపైనా బలమైన సాక్ష్యాధారాలూ లేవని ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

నోయిడా సెక్టార్‌లోని నిఠారి అప్పట్లో ఒక చిన్న గ్రామం. ఇప్పుడు పట్టణంగా మారింది. మన నేర న్యాయవ్యవస్థ మాత్రం ఎప్పట్లాగే లోపభూయిష్టంగా ఉంది. అలహాబాద్ హైకోర్టు తీర్పు దాన్నే నిర్ధారించింది. మీడియాలో ప్రముఖంగా ప్రచారంలోకొచ్చి, ఆందోళనలు మిన్నంటే కేసుల్లో పోలీసులపై వాటి ప్రభావం, ఒత్తిళ్లు అధికంగా వుంటాయనటంలో సందేహం లేదు.వాటిని సాకుగా చూపి ఆదరాబాదరాగా ఎవరో ఒకరిని నిందితులుగా తేల్చాలనుకోవటం సరికాదు. సాక్ష్యాధారాల సేకరణలో కూడా పోలీసులు కనీస జాగ్రత్తలు తీసుకోలేకపోయారనీ, నిందితులపై థర్డ్ డిగ్రీ పద్ధతులు ప్రయోగించి తేల్చటానికే ఉత్సాహం ప్రదర్శించారనీ హైకోర్టు తప్పుబట్టిందంటే దర్యాప్తు ఎలా అఘోరించిందో అర్థం చేసుకోవచ్చు. చాన్నాళ్లక్రితం కేంద్ర ప్రభుత్వ కమిటీ మనుషుల అదృశ్యాల వెనక శరీర అవయవాల వ్యాపారం సాగించే సంఘటిత ముఠాల హస్తం ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. నిఠారి హత్యల విషయంలో ఆ కోణంలో దర్యాప్తు సాగలేదు. థర్డ్ డిగ్రీ విధానాలను ఉపయోగించటం ద్వారా పోలీసులు కేసు తేల్చేశారన్న అభిప్రాయం జనంలో కలిగించవచ్చుగానీ, న్యాయస్థానాల్లో విచారణ సమయానికి ఇవన్నీ మటుమాయమవుతాయి. సంశయాతీతంగా సాక్ష్యాధారాలుండకపోతే, మమ్మల్ని కొట్టి ఒప్పించారని నిందితులు చెబితే చివరికి కేసు వీగి పోతుంది. కేవలం ఒక వ్యక్తి లేదా ఇద్దరు ఇంతమందిని హతమార్చారనీ, మరెవరి ప్రమేయమూ ఇందులో లేదనీ నిర్ధారించాలంటే అందుకు దీటైన సాక్ష్యాధారాలుండాలి. అవి శాస్త్రీయంగా సేకరించాలి. ఎక్కడ అశ్రద్ధ చేసినా, ఏ చిన్న లోపం చోటుచేసుకున్నా మొత్తం కుప్పకూలిపోతుంది. దానికి తోడు ప్రతీకారంతో రగిలిపోతూ తక్షణ న్యాయం కావాలని రోడ్డెక్కే ధోరణులు మొత్తం దర్యాప్తును అస్తవ్యస్థం చేస్తున్నాయి. జనాన్ని సంతృప్తిపరచటం కోసం దొరికినవారిని నిందితులుగా తేల్చి పోలీసులు చేతులు దులుపుకొంటున్నారు. సుప్రీంకోర్టులో ఎటూ సీబీఐ అప్పీల్ చేస్తుంది. అక్కడేమవుతుందన్నది చూడాల్సివుంది. అత్యాధునిక ప్రమాణాలతో భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. అంతరిక్షంలో ఘన విజయాలు నమోదు చేస్తున్నాం. కానీ పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దటంలో, దానికి వృత్తిగత నైపుణ్యాలను అలవాటు చేయటంలో విఫలమవుతున్నాం. క్రిమినల్ కేసుల్లో సత్వర దర్యాప్తు, పకడ్బందీ సాక్ష్యాధారాల సేకరణ ప్రాణప్రదం. వాటిని విస్మరిస్తే కేసులు కుప్ప కూలుతాయి. నేరగాళ్లు తప్పించుకుంటారు. నిఠారి నేర్పుతున్న గుణపాఠాలివే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
ఆశ్వయుజమాసం, తిథి: శు.సప్తమి రా.7.22 వరకు
తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాషాఢ సా.6.31 వరకు
తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2.04 నుండి 3.34 వరకు,
దుర్ముహూర్తం: ఉ.5.56 నుండి 7.28 వరకు,
అమృతఘడియలు: ప.1.55 నుండి 3.24 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సమస్య తొమ్మిది నెలలేనా?

అభిప్రాయం



శ్రేయ శ్రీ

ఇటీవలే ఓ వివాహిత 26 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. గర్భం దాల్చిన తొలినాళ్లలోనే అబార్షన్ చేయించుకోవాలని అనుకున్నప్పటికీ కొంతమంది మహిళలు న్యాయ, వైద్యపరమైన అడ్డంకులను దాటలేకపోతున్నారు. వేర్వేరు పరిస్థితుల కారణంగా మహిళలకు లేటైనా అబార్షన్ అవసరమవుతుంది. సరైన సమయంలో వైద్యం అందకపోవడం, లైంగికదాడి, గృహహింస, జైలు వంటివి ఎన్నో దీనికి కారణాలు. గర్భం ధరించిన తరువాత పరిస్థితుల్లో వచ్చే మార్పులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా మార్గదర్శకాల ప్రకారం... ప్రభుత్వాలు అబార్షన్‌ను నేరంగా పరిగణించడాన్ని నిలిపి వేయాలి. గర్భం వయసుపై పరిమితులు తొలగించాలి.

ప్రత్యేక పరిస్థితుల్లో అబార్షన్ చేయించుకునే విషయంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం 2021లో ఒక తీర్పునిచ్చింది. పిండం వయసు గరిష్ఠంగా 24 వారాలున్నా పీడిత మహిళలు అబార్షన్ చేయించుకునేందుకు వీలు కల్పించింది. వైకల్యమున్నప్పుడు మాత్రమే మెడికల్ బోర్డు సిఫారసుతో అబార్షన్‌కు అనుమతించే పాత చట్టం నుంచి వీరికి విముక్తిని ప్రసాదించింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల ముందు అబార్షన్‌కు అనుమతించే విషయంపై అనేక పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ఈ మార్పులు వచ్చాయి. అంతకుముందు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) యాక్ట్ (1971) ప్రకారం, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్ఎంపీలు) గర్భం ధరించిన 20 వారాల వరకూ అబార్షన్ చేసేందుకు అనుమతులుండేవి.

2021 నాటి సవరణ తీర్పు తరువాత కూడా చాలామంది మహిళలు వైద్యులు అబార్షన్‌కు నిరాకరించిన సందర్భాల్లో... కోర్టు నిర్దేశించిన సమయం దాటినా అబార్షన్‌కు అనుమతించాలని కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవలే ఓ వివాహిత మహిళ 26 వారాల వయసున్న గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, విచారణ తరువాత కోర్టు అందుకు నిరాకరించడం తెలిసిన విషయాలే. పాలిచ్చే సమయంలో కొంతకాలం రుతుస్రావం జరగదు. అయితే ఈ మహిళ పాలిచ్చే సమయంలోనే గర్భం ధరించింది. ఇది సహజం అనుకోవడంతో గర్భం ధరించినట్లు గుర్తించలేకపోయింది. ఏడాది క్రితమే బిడ్డకు జన్మనిచ్చి పోస్ట్‌పార్టమ్ సైకోసిస్‌కు చికిత్స తీసుకుంటున్న ఈ మహిళ మరోసారి గర్భం ధరించడం గమనార్హం. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బి.వి. నాగరత్న ధర్మాసనం అంతకుముందు పిటీషన్‌ను అనుమతిస్తూ, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ను ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించింది.

2021 సవరణలకు ముందు అబార్షన్ కోసం కోర్టుకు ఎక్కిన కేసుల్లో అత్యధికం మానభంగం లేదా పిండాల వైకల్యం ఉన్నవారికి సంబంధించినవి. పైగా చాలావాటిల్లో గర్భం వయసు 20 వారాల కంటే ఎక్కువే. వేర్వేరు పరిస్థితుల కారణంగా మహిళలకు కొంచెం లేటైనా అబార్షన్ అనేది అవసరమవుతుంది. తొలినాళ్లలోనే అబార్షన్ చేసేందుకు వైద్యపరంగా అవకాశాల్లేకపోవడం వీటిల్లో ఒకటి. లైంగిక దాడి, గృహహింస, జైలు వంటివి ఇతర కారణాలు. గర్భం ధరించిన తరువాత పరిస్థితుల్లో వచ్చే మార్పులు (భాగస్వామి సాయం లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉద్యోగం వంటివి), శారీరక, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మెనోపాజ్ లేదా లాక్టేషనల్ అమెనోరియా (పాలిచ్చే సమయంలో రుతుస్రావం నిలిచిపోవడం) కూడా అబార్షన్‌కు తగిన కారణాలని చెప్పాలి. అబార్షన్లకు సంబంధించి 2021 నాటి సుప్రీంకోర్టు సవరణ గర్భం తాలూకూ వయో పరిమితిని పెంచింది మినహా ఇతర మార్పులేవీ చేయలేదు. దీనివల్ల ప్రయోజనం కొద్దిమందికే. తల్లి ప్రాణాలు కాపాడాల్సిన పరిస్థితి వస్తే ఓ ఆర్ఎంపీ ఏ దశలోనైనా గర్భాన్ని తొలగించేందుకు అవకాశం ఉండగా చాలామంది కేసుల భయంతో ఆ పని చేసేందుకు జంకుతున్నారు. ఫలితంగా మహిళలు గత్యంతరం లేని పరిస్థితుల్లో కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోంది. కోర్టులకు వెళ్లడం ఇష్టం లేని వారైతే గర్భాన్ని కొనసాగిస్తున్నారు లేదా ముతక పద్ధతులతో అబార్షన్‌కు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.



గర్భం దాల్చిన తొలినాళ్లలోనే అబార్షన్ చేయించుకోవాలని అనుకున్నప్పటికీ కొంతమంది మహిళలు న్యాయ, వైద్యపరమైన అడ్డంకులను దాటలేకపోతున్నారు. పలుమార్లు వైద్యపరీక్షల అవసరం ఉండటం కూడా ప్రతిబంధకంగా మారుతోంది. ఒకవేళ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా న్యాయవాదుల ఇబ్బందికరమైన ప్రశ్నలను ఎదుర్కోవడం కూడా ఒక సమస్య. గత వారం సుప్రీంకోర్టులోనూ ఇలాంటి స్థితి ఎదురు కావడం చెప్పుకోవాల్సిన అంశం. అబార్షన్ కోరిన మహిళ మానసిక పరిస్థితి బాగాలేదనీ, కౌన్సెలింగ్ తీసుకోవాలనీ పలుమార్లు న్యాయవాదులు సూచించారు. ఇంతటి కష్టానికి, ఇబ్బందికి ఓర్చినా తుది ఫలితం అనుకూలంగా ఉంటుందన్న గ్యారెంటీ లేకపోవడం గమనార్హం. అయితే ఒక్క విషయం. ఇతర దేశాలతో పోలిస్తే అబార్షన్‌కు సంబంధించి భారతీయ చట్టాలు కొంత ఉదారంగానే ఉన్నాయని చెప్పాలి. అయినా అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలు, అబార్షన్‌లో అత్యుత్తమ విధానాల విషయంలో మాత్రం అంత గొప్పగా ఏమీ లేవన్నదీ సుస్పష్టం.

గత ఏడాది 'ఎక్స్' వర్సెస్ ఢిల్లీ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి మధ్య జరిగిన ఒక కేసు విషయంలో వైద్యపరమైన చట్టాలను అవసరాలకు తగ్గట్టుగా అర్థ వివరణ తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు సూచించింది. ఆ కేసులో 24 వారాల వయసు గర్భంతో ఉన్న అవివాహిత మహిళకు అబార్షన్ చేయించుకునే హక్కు కల్పించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆ మహిళకు ఉన్న హక్కుల ఆధారంగా వైద్యపరమైన పరీక్షలకు అతీతంగా నిర్ణయం తీసుకోవడం, ఎంటీపీ చట్టాలపై లక్ష్యాధారిత అర్థ వివరణ తీసుకోవడం గమనార్హం. మహిళల వాస్తవిక జీవన పరిస్థితులు, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకుని మరీ సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుందని అనుకోవాలి.

అబార్షన్‌కు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం... ప్రభుత్వాలు అబార్షన్‌ను నేరంగా పరిగణించడాన్ని నిలిపివేయాలి. గర్భం వయసుపై పరిమితులు, ఇతర నియంత్రణలను కూడా తొలగించాలి. దీనివల్ల అందరికీ వివక్ష లేని అబార్షన్ సేవలు అందుతాయి. ఏ సమయంలోనైనా సురక్షితంగా గర్భాన్ని తొలగించేందుకు ఉన్న పద్ధతులను ఉపయోగించాలని కూడా ఈ మార్గదర్శకాలు సూచించాయి. అబార్షన్‌పై అడ్డంకులు విధానపరమైన అడ్డంకులుగా మారుతున్నాయనీ, ఏ రకమైన శాస్త్రీయ ఆధారాలు లేనివిగా మారాయనీ కూడా అవి వ్యాఖ్యానించాయి.

గత వారం జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బి.వి. నాగరత్నల ముందు విచారణకు వచ్చిన కేసులో జస్టిస్ నాగరత్న, జస్టిస్ హిమా కోహ్లీ తీర్పుతో విభేదించిన విషయం తెలిసిందే. 'ఎక్స్' కేసును ప్రస్తావించిన జస్టిస్ నాగరత్న గర్భం విషయంలో ఆ మహిళకు ఉన్న హక్కును గుర్తు చేశారు. మహిళ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ ఆ గర్భం అవాంఛితమైతే తొలగించుకునే హక్కు ఆ మహిళకు ఉందని స్పష్టం చేశారు. గర్భాన్ని కొనసాగించాలని కోరడం ఆ మహిళ ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం అవుతుందనీ, ఇది ఆర్టికల్ 21, 15 (3)లను అతిక్రమించినట్లు అనీ వివరించారు. అయితే చివరకు ఈ మహిళకు 'ఎక్స్' మాదిరిగా అబార్షన్ చేయించుకునే అవకాశం కలగకపోవడం గమనార్హం. 'ఎక్స్' కేసులో అవాంఛిత గర్భం తాలూకూ ప్రభావాన్ని అర్థం చేసుకున్న కోర్టు... ఇంకో మహిళ విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరించింది. అబార్షన్‌ను తొమ్మిది నెలల వ్యవహారానికి పరిమితం చేసేసింది. అవాంఛిత గర్భం కారణంగా ఆ మహిళ కాన్పు తరువాత కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నది గుర్తించకపోవడం దురదృష్టకరం. వాదనల సందర్భంగానూ న్యాయమూర్తులు, ప్రభుత్వం పలుమార్లు ఈ కేసుకు ఇతర కేసులకు మధ్య తేడాలను ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. అబార్షన్‌కు గల కారణాల విలువ ఒకరికి ఎక్కువ? ఇంకొకరికి తక్కువగా ఉంటాయా?

వ్యాసకర్త బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ) బోధకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఒక ఆశ



మా పొరుగువాళ్లు ఇప్పుడే నేను పాలస్తీనియన్ అని తెలుసుకుని, తర్వాతి నిరసన ప్రదర్శన ఎప్పుడో తమకు చెప్పమన్నారు. అంతులేని వినాశనంలో చిన్నపాటి సంఘీభావం.

– రెమీ కనాజీ, (న్యూయార్క్) కవి

ఆగాలి కాల్పులు



గాజాలో కాల్పుల విరమణ కోసం బైడెన్ ప్రభుత్వం ఒత్తిడి తేవాలని వందలాది యూదులు నిరసనలు జరిపారు. 'క్యాపిటల్' (యూఎస్) దగ్గర నిరసన చేస్తూ అరెస్టు అయిన 300 మంది యూదుల్లో నేనూ ఒకరిగా ఉన్నందుకు గర్వపడతాను.

– ఎమిలీ వైల్డర్, యాక్టివిస్ట్

చెప్పుకోవడానికే...



ప్రపంచ కప్‌లో సచిన్ టెండుల్కర్ చాలా 100లు కొట్టాడు. అయినప్పటికీ, బాగా ఇష్టంగా గుర్తుండిపోయేది 98 (2003 ప్రపంచ కప్: పాకిస్తాన్‌తో). ధోనీ కొట్టిన చాలా సెంచరీలు మరిచిపోతాం. కానీ 91 నాట్ ఔట్ (2011 ప్రపంచ కప్ ఫైనల్: శ్రీలంకతో) మరిచిపోగలమా? ఈ మైలురాళ్లు అర్థం లేనివి.

– నితిన్ సుందర్, క్రికెట్ రచయిత

హీరోలకు థాంక్యూ



ఈ ఏడాది విదేశాల్లో స్మరణీయ విజయాలను సొంతం చేసుకున్న 'రా', ఇంకా ఇతర శాఖల సైలెంట్ హీరోలకు ప్రశంసగా ఈ ట్వీట్! మీ విజయాలు ఎప్పటికీ బహిరంగంగా అంగీకరించలేనివి. కానీ మీ వైఫల్యాలను మాత్రం బహిరంగంగా విచ్ఛేదించి చూస్తారు. భారత సాహసిక సైనికులకు ధన్యవాదాలు.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, విశ్లేషకుడు

అంటే హుషారే!



ఒకసారి, 'కొంచెం నెమ్మదిగా ఆడు. క్రీజులో ఉండు' అని నేను చెప్పగానే, 'ఓకే' అన్నాడు; తర్వాతి బంతినే ఫోర్ కొట్టాడు. నేను చెప్పిందానికి పూర్తి విరుద్ధంగా చేసే మనిషికి హేపీ బర్త్ డే. కాబట్టి, ఇలా చెప్తున్నా: వీరూ (వీరేంద్ర సెహ్వాగ్), నీకు బోరింగ్ బర్త్ డే జరగాలి.

– సచిన్ టెండుల్కర్, మాజీ క్రికెటర్


ఈమాత్రం తెలీదా?



అక్టోబర్ 7 నాటి జనవధకు ఇజ్రాయిల్ ఇలా స్పందిస్తుందని తెలిసీ హమాస్ ముందుకు వెళ్లిందంటే, గాజా పాలస్తీనియన్ల రక్తం హమాస్ చేతులకు అంటుకున్నట్టు. ఇజ్రాయిల్ ఇలా స్పందిస్తుందని ఊహించలేదంటే హమాస్ మూర్ఖపుదనుకోవాలి. ఏ రకంగానైనా పాలస్తీనాకు నాయకత్వం వహించడానికి హమాస్ తగినది కాదు.

– హుస్సేన్ అబ్దుల్–హుస్సేన్, రీసెర్చ్ ఫెలో

ఆగదు పోరాటం




ఇటీవలి హెచ్.డి. దేవెగౌడ వ్యాఖ్యలకు నేను పూర్తిగా విస్మయం చెందాను. జేడీఎస్–బీజేపీ కూటమికి నేను మద్దతిస్తానన్న ఆలోచన అసలు రావడమే భ్రాంతిమయ కల్పనకు తక్కువేమీ కాదు. దేవెగౌడ్ లాంటి సీనియర్ నాయకుడు ఇలాంటి అబద్ధాలను సృష్టించడం సిగ్గుచేటు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతూనే ఉంటుంది.

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

ఇన్ బాక్స్

కలం యోధునికి నివాళి

'నేను నడుస్తున్నది కత్తులు వంతెన పైనా, నిద్రపోతున్నది అగ్నిగుండం పైనా అని నాకు తెలుసు' అని తన హత్యకు ముందే సొంత పక్షపత్రిక 'ఎన్‌కౌంటర్'లో రాసుకున్నారు పింగళి దశరథరామ్. ఎటువంటి బెదిరింపులకూ, ప్రలోభాలకూ లొంగకుండా అప్పటివరకూ పత్రికా రంగంలో లేని ఒక నూతన ఒరవడినీ, అలజడినీ తన పత్రిక ద్వారా 'అక్షరాలనే డైనమైట్లుగా' చేసి అవినీతి, అక్రమాలు, మూఢనమ్మకాలపై యుద్ధం చేశారు. ప్రధానంగా కుళ్ళు రాజకీయ నాయకులకు నిద్రలేకుండా చేసిన దశరథరామ్ నాలాంటివారికి స్ఫూర్తినిచ్చిన గురువయ్యారు.



పింగళి దశరథరామ్

యువతను మేల్కొల్పి వారిలో చైతన్యం నింపి తెలుగు రాష్ట్రాలలో వేల సంఖ్యలో తన రాతల ద్వారా ఆలోచనపరులుగా, అభిమానులుగా చేసుకోగలిగారు. తన పత్రికలో కవర్ పేజీ నుండి చివరి పేజీ వరకు ఆయన ఒక్కడే వ్రాసేవారు. అదేవిధంగా పత్రిక ఎన్ని ఒడిదుడుకులలో ఉన్నా వ్యాపార ప్రకటనలు లేకుండానే నడిపారు. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ఆయన్ని మొదటిసారి కలిశాను. 1985 అక్టోబర్ 20న ఆయన హత్య జరిగిన తర్వాత నేనూ వెళ్లి చూశాను. దశరథరామ్ విగ్రహాన్ని పెడుతున్నారని తెలిసి వెళ్ళాము. కానీ, విగ్రహ ఏర్పాట్లు చేసేటప్పుడు తెల్లవారుజామున కొంతమంది వచ్చి విగ్రహాన్ని కూల్చి వేశారు. అప్పుడే కొన్ని పత్రికలు 'దశరథరామ్‌ను మరలా హత్య చేశారు' అనే వార్త ప్రచురించాయి. తన పత్రిక ద్వారా చైతన్యం తీసుకువచ్చి 'సంపూర్ణ విప్లవం' తీసుకురావాలని ఎన్నో కలలు కన్నారు. కానీ, నెరవేరకుండానే మరణించారు.

– పిల్లి సురేష్ కుమార్, నిడదవోలు

సిరివెన్నెల సమగ్ర సాహిత్యం



ప్రముఖ సినీ గీత రచయిత, 'పద్మశ్రీ' సిరివెన్నెల సీతారామశాస్త్రి కలం నుండి జాలువారిన సినీసాహిత్యం (నాల్గు సంపుటాలు: సినిమా పాటలు), సినీయేతర సాహిత్యం (రెండు సంపుటాలు) మొత్తం ఆరు సంపుటాలను సిరివెన్నెల కుటుంబ సభ్యుల సహకారంతో 'తానా' సంస్థ సాహిత్యవిభాగం – 'తానా ప్రపంచ సాహిత్య వేదిక' ప్రచురించింది.

తానా అధ్యక్షులు (2021–2023) అంజయ్య చౌదరి లావు నిర్వహణలో, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా॥ ప్రసాద్ తోటకూర గౌరవ సంపాదకులుగా, ప్రముఖ సాహితీవేత్త కిరణ్‌ప్రభ ప్రధాన సంపాదకులుగా ఈ గ్రంథాలు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు 'సిరివెన్నెల సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యం' ఆరు సంపుటాలు ఇటు అమెరికాలోనూ, అటు భారతదేశంలోనూ లభ్యమవుతున్నాయి.

ఇదేనా మహిళలను గౌరవించడం!

అభిప్రాయం



ఆచార్య టి. షారోన్ రాజు

'ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దైవత్వం వికసిస్తుంది. ఎక్కడ స్త్రీలు పూజింపబడరో అక్కడ సత్కర్మలకు విలువ ఉండద'ని భారతీయ సంస్కృతి తెలియజేస్తోంది. త్రిశక్తి రూపంగా, ప్రకృతికి ప్రతిరూపంగా, ఆదిశక్తిగా స్త్రీని ఆరాధించడం, పూజించడం భారతీయ సంప్రదాయం. మాతృదేవోభవ అంటూ తల్లిని తొలి దైవంగా గౌరవించే విశిష్ట సంస్కృతి భారతీయుల సొంతం. వేదకాలం నుంచి నేటి ఆధునిక యుగం వరకు అన్ని రంగాలలో స్త్రీలను గౌరవించడం, ప్రోత్సహించడం జరుగుతోంది. పురాణేతిహాసాల నుంచి నేటి ఆధునిక సమాజం వరకు పరిశీలిస్తే వేదాధ్యయనం, కళలు, యుద్ధ నైపుణ్యాలు నుంచి నేటి ఆధునిక సమాజంలో విభిన్న బాధ్యతలను అలవోకగా నిర్వహిస్తున్నారు మన మహిళలు. అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా, కూతురుగా, కోడలిగా విభిన్న బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించే శక్తి కేవలం మహిళలకే ఉంది. తాను పుట్టినింటిని వదిలి, కుటుంబాన్నీ, బంధువులనూ వదలి, వేరొకరి ఇంటికి వెళ్లి వారికోసం నిస్వార్థంగా కృషి చేసే మహా మనిషి స్త్రీ మూర్తి.



భారత దేశంలో స్త్రీకి అత్యంత ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఆదిమ కాలం నుంచీ ఉంది. అటువంటి సమాజంలో నేడు జరుగుతున్న కొన్ని సంఘటనలు మనిషితనం దిగజారడానికి అద్దం పడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర మంత్రి ఆర్.కె. రోజాపై తెలుగు దేశం పార్టీ మాజీ శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఉన్నత స్థానంలో, మంత్రి పదవిలో ఉన్న మహిళ గురించి ఆ విధంగా వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర ప్రజలందరినీ కదిలించింది. మహిళలను కించపరచడం, దూషించడం, వారి పట్ల అసభ్యకరంగా వ్యవహరించడం ఎంతమాత్రం హర్షణీయం కాదు. దీనిపై స్త్రీ, పురుషులనే వ్యత్యాసం లేకుండా సమాజంలో ప్రతి వ్యక్తీ స్పందించాల్సిన అవసరం ఉంది.

రాజకీయ విలువలు, మానవీయ విలువలు, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలుగా ఈ వ్యాఖ్యలు నిలుస్తున్నాయి. సభ్య సమాజం బండారు ఉపయోగించిన పదజాలాన్నీ, వ్యాఖ్యల్నీ ముక్త కంఠంతో ఖండిస్తూ ఉంది. అంతరిక్షంలోకి సైతం మహిళలు వెళుతున్న ఈ కాలంలో ఇటువంటి అవమానాలకు మహిళలను గురిచేయడం సమంజసం కాదు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్త్రీ, పురుషులను సమానంగా చూడాలని కాంక్షించారు. స్త్రీల హక్కుల కోసం న్యాయ శాఖమంత్రి పదవికి సైతం రాజీనామా చేశారు. ఇటువంటి మహనీయులు పుట్టిన ఈ దేశంలో, రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు విరుద్ధంగా మాట్లాడుతున్న వీరిని అంబేడ్కర్ వ్యతిరేక వాదులుగా చూడాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో ఎవరైనా సరే మహిళలను అవహేళన చేయడాన్నీ, అవమానకరంగా మాట్లాడటాన్నీ ఉపేక్షించరాదు. ఇటువంటి సంఘటనలపై న్యాయస్థానాలు సైతం స్వచ్ఛందంగా స్పందించాలి. సుమోటోగా వీటిని స్వీకరిస్తూ మహిళల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఒక పటిష్ఠ వ్యవస్థనూ, చట్టాన్నీ ఏర్పాటు చేసే దిశగా న్యాయకోవిదులు దృష్టి సారించాలి. ప్రజాస్వామ్య వాదులూ, మానవీయ వాదులూ అంతా దీనిని ఖండించాల్సిన అవసరం ఉంది. ఇది మనందరి సామాజిక బాధ్యత.

వ్యాసకర్త విద్యావిభాగాధిపతి, ఏయూ. । 94907 98631

నవరాత్రులు

నవరాత్రుల్లో తొమ్మిది అనేది చాలా విశిష్టమైనది. గర్భస్థ శిశువుగా ఉండేది తొమ్మిది మాసాలు. తొమ్మిది రోజులు శ్రద్ధతో పూజిస్తే గర్భవాసం మళ్లీ పొందక్కర్లేదు. కాశీలో 9 మాసాలో, 9 వారాలో, 9 రోజులో, కనీసం 9 రాత్రులో ఉండాలంటారు. నవగ్రహాలకు కూడా సంకేతమే. లోకంలో మనుషులంతా ఈ తొమ్మిది గ్రహాల కారకత్వాల లక్షణాలలోనే ఇమిడి పోతారు కాబట్టి తొమ్మిది రోజులు అమ్మవారిని ప్రార్థించడం ద్వారా నవగ్రహాల అనుగ్రహాన్ని పొందగలుగుతాము. తద్వారా మళ్లీ జన్మించనక్కరలేని పరిస్థితిని కల్పించుకో గలుగుతాము.

నవగ్రహాల్లో రాహు కేతువులను మినహాయిస్తే మిగిలిన ఏడు గ్రహాలు మనలోని ఏడు చక్రాలకు సంకేతం. ఈ ఏడు చక్రాలు శక్తిమంతమై సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతాము. ఇలా శక్తిని ఇంకా పెంచుకోగలిగితే కుండలినీ ప్రసారం బాగా జరిగి దైవత్వాన్నీ, అలాగే మోక్షాన్నీ సాధించడానికి ఉపయోగపడుతుంది. ఎలాగంటే అమ్మవారిని పూజించేటప్పుడు 'నేనే అమ్మవారిని' అన్న ఏకాత్మ భావన పొందడం ద్వారా దైవత్వ సాధనకు ఉపకరిస్తుంది.

కలశ స్థాపన అనేది పరిపూర్ణతకు సంకేతం. విగ్రహంలో జీవాన్ని సాక్షాత్కరింప చేసుకోవడానికి ప్రత్యేకంగా కలశంలో నీళ్లు పెట్టి, పండ్లు పెట్టి ప్రార్థన చేయడం చాలా మంచిది.

ఇలా నవ విధాలుగా సమస్త ప్రాకృతిక జీవశక్తితో మనల్ని రీఛార్జ్ చేసుకోవడమే నవరాత్రుల పరమార్థం!

– ఆచార్య సి. వి. బి. సుబ్రహ్మణ్యం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

పుష్పక విమానంలో పురుషోత్తముడు


పుష్పక విమానంలో విహరిస్తున్న స్వామివారు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గోవర్ధనగిరిధారి అయిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని అలంకారంలో శ్రీమలయప్పస్వామి వారు పుష్పక విమానంలో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం శ్రీరామచంద్రుని రూపంలో మలయప్ప స్వామి తన భక్తశిఖామణి హనుమంతుని వాహనంగా మలుచుకుని ఊరేగుతూ దర్శనమిచ్చారు. ధనుర్బాణాలు చేతపట్టిన శ్రీరామచంద్రుడిని ఆంజనేయుడు తన భుజంపై ఉంచుకుని ఆలయ పురవీధుల్లో అశేష భక్త జనులకు కనువిందు చేశారు. రాత్రి గజ వాహనంపై శ్రీనివాసుడు ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, గురువారం రాత్రి శ్రీవారి గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించామని, లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి తెలిపారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ కటాక్షం



దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ప్రధానమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని దుర్గమ్మ శుక్రవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

–ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

కాత్యాయనీదేవిగా శ్రీశైల భ్రమరాంబ



శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భ్రమరాంబాదేవి కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి హంస వాహనంపై ఆశీనులయ్యారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

–శ్రీశైలం టెంపుల్

సరస్వతీదేవిగా రాజశ్యామల



విశాఖ శ్రీశారదా పీఠంలో శుక్రవారం రాజశ్యామలఅమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠంలో భారీ ఎత్తున సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. –పెందుర్తి

తీర భద్రతలో 'ప్రస్థాన్' అదుర్స్

విజయవంతంగా ఆఫ్ షోర్ డెవలప్‌మెంట్ ఏరియా సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్


ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంలో జరుగుతున్న ప్రస్థాన్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: సముద్ర తీరంలో భద్రత మరింత బలోపేతం చేసేందుకు భారత నౌకాదళం రెండు రోజుల పాటు 'ఆఫ్ షోర్ డెవలప్‌మెంట్ ఏరియా సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్'ను విజయవంతంగా నిర్వహించింది. శుక్ర, శనివారాల్లో ఇచ్ఛాపురం నుంచి కాకినాడ వరకూ తీర భద్రత కార్యక్రమాన్ని 'ప్రస్థాన్' పేరుతో చేపట్టింది.తూర్పు నౌకాదళం నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో జరిగిన ఎక్సర్‌సైజ్‌ను కాకినాడలోని ఓఎన్జీసీ రిగ్‌షిప్ ప్లాటినం ఎక్స్‌ప్లోరర్, ఆర్‌జీ ఫిక్స్‌డ్ ఆయిల్ ప్లాట్ ఫాం ఆఫ్ వేదాంత లిమిటెడ్ సంస్థల కార్యకలాపాలపై శత్రువుల కన్ను పడకుండా సముద్రజలాల్లో నిశిత పరిశీలన అంశంపై నిర్వహించారు. అనంతరం వుయ్ ప్రొటెక్ట్ పేరుతో ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో ఏపీ తీరం వెంబడి ఐసీజీ కనక్‌లతాబారువా షిప్‌తో పహారా కాశారు. ఉగ్రవాదుల దాడులు, బాంబ్ స్కేర్, మేజర్ ఫైర్, గ్యాస్ లీక్, ఆయిల్ స్పిల్, పేలుడు తదితర సమయాల్లో ఎలా వ్యవహరించాలన్న అంశాలపై భారత నౌకాదళ బృందాలతో పాటుగా కోస్ట్‌గార్డ్, ఆయిల్ ఆపరేటర్లు, పోర్టు అథారిటీలు, రాష్ట్ర మత్స్యశాఖ, మెరైన్ పోలీసుల బృందాలు విన్యాసాల్లో పాల్గొన్నాయి. భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ కోరా, ఐఎన్ఎస్ తిహాయు, నాలుగు తక్షణ సహాయ నౌకలు, మెరైన్ కమాండోలు, ఎక్స్‌ప్లోజివ్ ఆర్డినెన్స్ డిస్పోజల్ బృందాలు, హెలికాప్టర్లు ఇందులో భాగస్వామ్యమయ్యాయి.

క్షతగాత్రునికి అండగా సీఎం జగన్

- ఇప్పటివరకు రూ.6.50 లక్షల ఆర్థిక సాయం అందజేత

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతోన్న రోగికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.6.50 లక్షల సహాయం అందినట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ విభాగంలో చికిత్స పొందుతోన్న నరసింహులు (41)ను శుక్రవారం ఆమె పరామర్శించారు. అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు నరసింహులు గత మే 28న కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై జ్ఞాపకశక్తి కోల్పోయాడు. వీరి కుటుంబం ఆర్థిక సహాయం కోసం సీఎం జగన్‌ను అనంతపురం, డోన్, ఎమ్మిగనూరు పర్యటనలో కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఆదేశాలతో నరసింహులు కుటుంబాన్ని కలెక్టర్ పరామర్శించారు.

'మార్గదర్శి'పై పోలీసుల అప్పీళ్లను కొట్టేసిన హైకోర్టు ధర్మాసనం

సింగిల్ జడ్జి ఉత్తర్వులకు సమర్థన

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీరాల, విశాఖపట్నం, సీతంపేట బ్రాంచీల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తూ పోలీసులు జారీ చేసిన నోటీసుల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తాము మార్గదర్శి చిట్ గ్రూపుల్లో చందాదారు కాకపోయినప్పటికీ, తమ సంతకాలను ఫోర్జరీ చేసి చందాదారులుగా చూపారని, దీనివల్ల తమకు భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయని, ఇలా చేసినందుకు మార్గదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ కొందరు చందాదారులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అలాగే చీటీ పాట పాడుకున్నా తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదంటూ మరో చందాదారు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. చీరాల, విశాఖపట్నం, విశాఖలోని సీతంపేట బ్రాంచీలకు చెందిన బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బు నేరానికి సంబంధించినదని దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు ఆ బ్రాంచీలకు చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలంటూ బ్యాంకులకు నోటీసులిచ్చారు. బ్యాంకు అధికారులు ఆ ఖాతాలను స్తంభింపజేశారు. పోలీసుల నోటీసులను సవాలు చేస్తూ మార్గదర్శి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పోలీసులు జారీ చేసిన నోటీసుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం విచారణ జరిపింది.

పవన్.. నీ పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారు?

జన్ జన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సుదర్శన్

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఐదుగురు పిల్లలు చదువుతున్నది తెలుగు మీడియంలోనా, ఇంగ్లిష్ మీడియంలోనా ప్రజలకు చెప్పాలని జన్ జన్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మామిడి సుదర్శన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్ తప్పిన పవన్‌కు టోఫెల్, జీఆర్ఈ పరీక్షలు అంటే ఏంటో తెలుసా అని నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంతో పాటు టోఫెల్ శిక్షణ ఇవ్వడాన్ని పవన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నావని ప్రశ్నించారు. తెలుగు భాష పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద పిల్లల భవిష్యత్‌ను నాశనం చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఆసియా క్రీడల్లో సత్తా చాటారు

- పతకాల విజేతలకు సీఎం జగన్ అభినందనలు
- క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా
- బకాయిలతో కలిపి రూ.4.29 కోట్లు ప్రోత్సాహకాలు విడుదల
- క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసిన కోనేరు హంపి, జ్యోతి, అనూష

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి పతకాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన కోనేరు హంపి (చెస్), జ్యోతి యర్రాజీ (అథ్లెట్), బి.అనూష (క్రికెట్) శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ప్రపంచ క్రీడా వేదికలపై తెలుగువారి ఖ్యాతిని నిలబెడుతూ రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తెచ్చారని సీఎం జగన్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తాము గెలుచుకున్న పతకాలను సీఎంకు చూపించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేలా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు.

ఏపీకి 11 పతకాలు..

ఆసియా క్రీడల్లో మన దేశం తొలిసారిగా 107 పతకాలను సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 13 మంది క్రీడాకారులు దేశం తరఫున వివిధ క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ఎనిమిది మంది క్రీడాకారులు 11 పతకాలను (5 గోల్డ్, 6 సిల్వర్) సాధించారు. రాష్ట్ర స్పోర్ట్స్ పాలసీ ప్రకారం ఆసియా క్రీడల్లో పతకాల విజేతలకు ప్రభుత్వం రూ.2.70 కోట్ల నగదు ప్రోత్సాహకాలను విడుదల చేసింది. వీటితో పాటు గతంలోని ప్రోత్సాహక బకాయిలతో కలిపి మొత్తం రూ.4.29 కోట్లు క్రీడాకారుల ఖాతాల్లో జమ చేయడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్కే రోజా, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎండీ హెచ్.ఎం.ధ్యానచంద్ర, శాప్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన జ్యోతి యర్రాజీ, హంపి, బి.అనూషలతో సీఎం జగన్. చిత్రంలో మంత్రి రోజా

ఆసియా క్రీడల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇలా..

పేరు	క్రీడ	నగదు ప్రోత్సాహకం
మైనేని సాకేత్ సాయి(విశాఖపట్నం)	టెన్నిస్‌లో సిల్వర్ మెడల్	రూ. 20 లక్షలు
వెన్నం జ్యోతి సురేఖ (ఎన్టీఆర్ జిల్లా)	ఆర్చరీలో 3 గోల్డ్ మెడల్స్	రూ. 90 లక్షలు
కిడాంబి శ్రీకాంత్ (గుంటూరు)	బాడ్మింటన్‌లో సిల్వర్ మెడల్	రూ. 20 లక్షలు
ఆర్. సాత్విక్ సాయిరాజ్ (రాజమహేంద్రవరం)	బాడ్మింటన్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్	రూ. 50 లక్షలు
యర్రాజీ జ్యోతి (విశాఖపట్నం)	అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్	రూ. 20 లక్షలు
బొమ్మదేవర ధీరజ్	ఆర్చరీలో సిల్వర్ మెడల్	రూ. 20 లక్షలు
కోనేరు హంపి (ఎన్టీఆర్ జిల్లా)	చెస్‌లో సిల్వర్ మెడల్	రూ. 20 లక్షలు
బి.అనూష (అనంతపురం)	క్రికెట్‌లో గోల్డ్ మెడల్	రూ. 30 లక్షలు

బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం (22) నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అనంతరం మూడు రోజులు ఉత్తర ఈశాన్య దిశగా పయనిస్తూ పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్తుందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. సముద్రం అలజడిగా ఉంటుందని, రానున్న మూడు రోజులు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించింది. మరోవైపు రానున్న రెండు రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఈ రుతుపవనాల ఆగమనానికి సంకేతంగా భావించే తూర్పు, ఈశాన్య గాలులు రాష్ట్రంపైకి బలంగా వీస్తున్నాయి. సాధారణంగా అక్టోబర్ 18 – 22 తేదీల మధ్య ఈశాన్య రుతుపవనాలు తమిళనాడులో ప్రవేశిస్తాయి. ఆ వెంటనే దక్షిణ కోస్తాంధ్రలోనూ ప్రభావం చూపుతాయి. దీంతో అక్కడ వర్షాలు ప్రారంభమవుతాయి. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈశాన్య రుతుపవనాల ప్రారంభ దశ బలహీనంగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఫలితంగా వీటి ప్రవేశ సమయంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే తప్ప భారీ వర్షాలకు ఆస్కారం ఉండదని వివరించింది.

ప్రజలు ఛీకొట్టిన వారిని 'ఏపీ నీడ్స్' అంటారా?: రోజా

సాక్షి, అమరావతి: సొంత నియోజకవర్గం కుప్పం ప్రజలే ఛీకొట్టిన వ్యక్తిని, స్కిల్ స్కాంలో దొరికి, ప్రస్తుతం రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబును ఎవరైనా ఏపీ నీడ్స్ చంద్రబాబు అంటారా? అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. చంద్రబాబు అవసరం ఈ రాష్ట్ర ప్రజలకు లేదని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగనే రాష్ట్రానికి అవసరమని శుక్రవారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. ''ఈ రాష్ట్రంలో లేని రామోజీ రావు, రాధాకృష్ణ, బీఆర్ నాయుడులకు, వందలాది టీడీపీ దోపిడీదారులకు, ఆ దోచుకున్న సొమ్ములతో వేరే రాష్ట్రాల్లో, వేరే దేశాల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్న ఆయన బంధువులకు చంద్రబాబు కావాలేమో తప్ప.. ఏపీ ప్రజలకు, ఇక్కడి పేద, మధ్యతరగతి వర్గాలకు చంద్రబాబు బంధువూ కారు ఆత్మ బంధువూ కారు. వారికి కావాల్సింది చంద్రబాబు 40 ఏళ్ళుగా చేసిన అన్యాయాలను సరిదిద్దే సీఎం జగన్ మాత్రమే'' అని ఆమె స్పష్టం చేశారు. మళ్లీ పొరపాటున అధికారం ఇస్తే చంద్రబాబు, పవన్ దోచుకుంటారని, అధికారం లేకపోతే రాష్ట్రంలో మంటలు పెడతారని, ఇది వారి తత్త్వమని రోజా మండిపడ్డారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు, పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రానికి వలసపక్షులన్నారు. రాబోయే రోజులు చాలా కీలకమైనవని, వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉత్తరాంధ్రపై రామోజీ ఉన్మాదం..


ఆ ప్రాంత అభివృద్ధి అంటే ఈనాడుకు నిద్రపట్టట్లేదు

- రుషికొండపై వాస్తవాలు వక్రీకరిస్తూ పెడబొబ్బలు
- ప్రగతిని అడ్డుకోవడంలో ముఖ్యమంత్రి లక్ష్యంగా దిగజారుడు రాతలు
- రుషికొండపై ప్రభుత్వం శాశ్వత భవనాలు నిర్మిస్తుంటే తాత్కాలిక సచివాలయంతో పోలిక
- గతంలో ఈ ప్రాంతంలోనే ఎంవీఎస్ మూర్తి కబ్జాచేస్తే కన్నెత్తి చూడని ఈనాడు
- ప్రస్తుత ప్రభుత్వం ఆక్రమణలు తొలగిస్తుంటే మాత్రం గగ్గోలు
- రుషికొండ దగ్గర 2019కి ముందే హెలీప్యాడ్, కొండచుట్టూ రోడ్డు
- ఇక్కడున్న భవనాలన్నీ ప్రభుత్వ భవనాలే
- ప్రభుత్వ భవనాల్లో ఎక్కడైనా సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుచేసుకోవచ్చు
- ఇది రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కు
- కానీ, గుండెలు బాదుకుంటూ ఈనాడు క్షుద్ర రాతలు

టూరిజం పునర్నిర్మాణ ప్రాజెక్టు ఇలా..

	ఎకరాలు
రుషికొండలో ఏపీటీడీసీకి ఉన్న భూమి :	61
ప్రతిపాదిత టూరిజం పునర్నిర్మాణ ప్రాజెక్టు :	9.88
నిర్మించ తలపెట్టిన బ్లాకులు :	7
నిర్మాణాలు చేసినవి :	4
వాస్తవంగా వినియోగించిన భూమి :	1.84

ఇది రుషికొండ మొత్తం విస్తీర్ణంలో 3 శాతం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రజాదరణ కోల్పోయింది.. చంద్రబాబు అరెస్టయినప్పటి నుంచి ఆ పార్టీ పరిస్థితి నానాటికీ పాతాళానికి పడిపోతోంది.. సానుభూతి పవనాలు ఎక్కడా లేవు.. పైగా అరెస్టును నిరసిస్తూ పార్టీ చేపట్టిన కార్యక్రమాలు మైలేజీ ఇవ్వలేకపోయాయి.. ఎన్ని జాకీలు పెట్టినా ఫలితం శూన్యం. దీంతో పచ్చగ్యాంగ్‌కు పిచ్చెక్కిపోతోంది. ఒకటే మార్గం కనిపిస్తోంది.. అదీ పదేళ్లకు పైగా చేస్తున్నదే.. ఎప్పటిలాగే జగన్‌ను టార్గెట్ చేయడం.. ప్రభుత్వాన్ని అభాసుపాల్జేయడం. ఇంకేముంది.. రుషికొండపై జనం సొమ్ముతో జగన్ సోకులు అంటూ శుక్రవారం ఈనాడు తన పైశాచిక ఆనందాన్ని మరోసారి ప్రదర్శించి విశాఖపై తన అక్కసుకు అంతులేదని చాటుకుంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగంగా ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామంటే ప్రభుత్వంపై తెగ విషం చిమ్ముతోంది. ప్రగతిని అడ్డుకోవడంలో ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని దిగజారుడు రాతలు రాస్తోంది. చంద్రబాబు హయాంలో అడ్డగోలుగా కబ్జాలు చేస్తే కన్నెత్తి చూడని, పెన్నెత్తి రాయని రామోజీ.. ఇప్పుడు ఉన్మాదంతో వెర్రెక్కిపోతున్నారు.

బోడిగుండు రాతలు..

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో ఈనాడుకు కంటిమీద నిద్ర కరువైంది. అందుకే తన మార్కు వక్రీకరణ రాగం అందుకుంది. రుషికొండ బోడిగుండయ్యిందంటూ అనుమతుల విషయంలో అసత్య ప్రచారం చేసింది. కానీ, ప్రభుత్వం రుషికొండపై నిర్మాణాలు చేస్తున్న విస్తీర్ణం, వాటికున్న అనుమతులు అంకెలతో సహా చెప్పేసరికి దిమ్మతిరిగింది. అయితే.. ఎన్నడూ నిజాలను అంగీకరించని ఈనాడు.. నిస్సిగ్గుగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలకు పదును పెడుతూనే ఉంది. ఇంతలో సీఎం జగన్ విశాఖ కేంద్రంగా సమీక్షలు, సమావేశాలు చేయాల్సి ఉండటంతో, అక్కడ విడిది చేసేందుకు ముఖ్యమంత్రికి, అధికారులకు, ఇతర ప్రభుత్వ శాఖలకు అవసరమైన వసతి సదుపాయాలను గుర్తించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ ప్రభుత్వ భవనాలను గుర్తించే పనిలో ఉంది. ఇందులో భాగంగానే సీఎం క్యాంపు కార్యాలయం కోసం సరైన భవనాలను అన్వేషిస్తూ రుషికొండపై నిర్మాణాలను కూడా పరిశీలిస్తోంది. వాస్తవానికి అవి రిసార్టుల కోసం నిర్మించినవి కావడం, వాటిని సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగించాల్సి వస్తే కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుంది. అయితే.. ఇప్పటివరకూ దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదు. కానీ, రుషికొండలో నిర్మిస్తున్న భవనాలు సీఎం క్యాంపు కార్యాలయం కోసమేనంటూ గుండెలు బాదుకుంటోంది.

రుషికొండపై శాశ్వత భవనాల నిర్మాణం..

ఇక రుషికొండపై నిర్మిస్తున్నవి ప్రభుత్వ భవనాలే. అవి కూడా శాశ్వత భవనాలు. వాటిని టూరిజం ప్రాజెక్టులో భాగంగా పునర్నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు మార్లు స్పష్టంచేసింది. దాదాపు ఈ భవనాలు ఇప్పుడు పూర్తి కావొచ్చాయి. కానీ, వాటిని ప్రైవేటు భవనాలుగా, ప్రైవేటు వ్యక్తుల కోసం ఉచితంగా నిర్మిస్తున్నట్లు.. వేరెవరికో దోచిపెడుతున్నట్లుగా ఈనాడు రంకెలేస్తోంది. అవి ఎప్పటికీ ప్రభుత్వ భవనాలే అన్న విషయాన్ని దాచేందుకు నానా పాట్లు పడుతోంది. అందుకే రుషికొండలో నిర్మిస్తున్న భవనాలు సీఎం క్యాంపు కార్యాలయం కోసమేనని, వాటిని వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయ భవనాల ఖర్చుతో పోల్చి బొక్కబోర్లా పడింది. నిజానికి.. గత టీడీపీ ప్రభుత్వం తాత్కాలిక సచివాలయం నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6,070 మాత్రమే ఖర్చయిందంటూ దోపిడీని తక్కువ చేసి చూపించింది. వాస్తవంగా అక్కడ చ.అ.కు అయిన ఖర్చు రూ.9,166. ఆ తర్వాత కూడా మరికొంత అదనంగా ఖర్చుచేశారు. ఈ మొత్తం కలుపుకుంటే ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంత ఖర్చుచేసినా అవన్నీ తాత్కాలిక భవనాలే. ఈ విషయాన్ని గత ప్రభుత్వమే చెప్పింది. కేవలం తాత్కాలిక భవనాల నిర్మాణం కోసం చదరపు అడుగుకు ఎక్కడైనా ఇంత ఖర్చు చేస్తారా? పైగా ఈ భవన నిర్మాణాల్లో డొల్లతనం రాష్ట్ర ప్రజానీకానికి తెలిసిందే. వర్షం నీరు కారడం, గదుల్లోకి మురుగు పొంగడం, గోడలు బీటలు వారడం చూస్తే వాటి గొప్పతనం అర్థమవుతుంది.

కబ్జాలను దగ్గరుండి ప్రోత్సహించలేదా?

మరోవైపు.. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని పేరుతో భూకబ్జాలకు పాల్పడుతున్నారంటూ ఆధారాలు లేకుండా ఈనాడు క్షుద్ర రాతలు రాస్తోంది. కానీ, టీడీపీకి చెందిన మాజీ ఎంపీ, బాలకృష్ణ వియ్యంకుడు తద్వారా చంద్రబాబుకు బంధువైన ఎంవీఎస్ మూర్తి ఎండాడ, రుషికొండ గ్రామాల పరిధిలోనే ఏకంగా 38.60 ఎకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జాచేస్తే ఈనాడు కళ్లు మూసుకుని కూర్చుంది. పైగా ఈ కబ్జా జరిగింది ఎక్కడోకాదు.. రోజూ రుషికొండ చుట్టూ తప్పుడు కథనాలు అల్లుతున్న ప్రాంతానికి సరిగ్గా ఎదురుగానే. ఇంత జరుగుతుంటే అప్పట్లో చంద్రబాబు నోరు పెగల్లేదు.. రామోజీ పెన్ను కదల్లేదు. పైగా వారి కబ్జాలకు వత్తాసు పలికారు. కానీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భూములను కబ్జాల చెర నుంచి విడిపిస్తోంది. ఇవి తొలగిస్తుంటేనే ఈనాడు దానిని అభివృద్ధి విధ్వంసంగా చిత్రీకరిస్తోంది. వాస్తవానికి ఈ ప్రభుత్వం రుషికొండలో మొదటి విడతలో 19.39 ఎకరాలను, రెండో విడతలో 4.74 ఎకరాలను కలిపి మొత్తంగా 24.13 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. కోర్టు స్టేతో మిగిలిన భూముల స్వాధీన ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడింది.

అభివృద్ధిపైనా ఈనాడు అక్కసు..

ఇక రుషికొండకు సమీపంలో హెలీప్యాడ్, రుషికొండ చుట్టూ గ్రావెల్ రోడ్డు 2019కి ముందే ఉన్నాయి. కానీ, ముఖ్యమంత్రి విలాసాల్లో భాగంగా వీటిని నిర్మించారంటూ ఈనాడు కలరింగ్ ఇచ్చింది. తాజాగా.. టూరిజం ప్రాజెక్టులో భాగంగా ఈ రోడ్డు మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. చివరికి ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధిని కూడా ఈనాడు జీర్ణించుకోలేకపోతోంది. ఒక ప్రాంతాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసేటప్పుడు.. ప్రజల నివాసాలు వస్తున్న కొద్దీ కరెంటు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తారు. ఇది ఏ ప్రభుత్వమైనా చేసేదే. కానీ, ఈనాడుకు మాత్రం వంకరగా కనిపిస్తోంది. ఎందుకంటే.. రామోజీ బుద్దే వక్రబుద్ధి కాబట్టి!.

ప్రభుత్వ భవనాల్లో ఎక్కడైనా ఉండొచ్చు..

రుషికొండపై సీఎం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఏర్పాటుచేస్తే ఏదో తప్పన్నట్లుగా, చట్టవిరుద్ధమైనట్లు ఈనాడు పెడబొబ్బలు పెడుతోంది. విశాఖపట్నం పక్క దేశంలోనో, శత్రుదేశంలోనో ఉన్నట్లు చిత్రీకరిస్తోంది. అసలు రుషికొండలో ఉన్నవన్నీ ప్రభుత్వ భవనాలేనన్న పచ్చి నిజాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతోంది. వాస్తవానికి.. ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయాన్ని ఎక్కడైనా పెట్టుకోవచ్చు. దీనికి రాజ్యాంగబద్ధంగా ఆయనకు సర్వాధికారాలు ఉంటాయి. ఈ నిజాన్ని ఈనాడు అంగీకరించదు.



రుషికొండలో భూముల కబ్జాకు సంబంధించినచిత్రం ఇది:

- గులాబీరంగులో ఉన్న 19.39 ఎకరాల కబ్జా భూమిని మొదటివిడతగా ఈ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- ఆకుపచ్చ రంగులో 4.74 ఎకరాల కబ్జా భూమిని రెండో విడతగా స్వాధీనం చేసుకుంది.
- ఎరుపు రంగు గళ్లతో ఉన్న భూమి ఇంకా కబ్జాలో ఉంది. కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను చాలా స్పష్టంగా చూడొచ్చు.

అక్రమ బంగారం, విదేశీ కరెన్సీ స్వాధీనం

జప్తు చేసిన విజయవాడ కస్టమ్స్ అధికారులు

సాక్షి, అమరావతి/పాత గుంటూరు: విజయవాడ కస్టమ్స్(ప్రివెన్షన్) కమిషరేట్ అధికారులు ఇప్పటి వరకూ రూ.55.34లక్షల విలువైన అక్రమ బంగారం, రూ.16.63లక్షల విదేశీ కరెన్సీ జప్తు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న ఓ బస్సులో గుంటూరు జిల్లా, కాజా టోల్‌ప్లాజా వద్ద కస్టమ్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించి ఓ వ్యక్తి వద్ద రూ.13.10లక్షల విలువైన విదేశీ కరెన్సీ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేయగా చెన్నైలో అక్రమ బంగారం కొనుగోలు చేసేందుకు వెళుతున్నట్టు వెల్లడైంది. అతని సమాచారం మేరకు పశ్చిమగోదావరిజిల్లా నరసాపురంలో ఓ నగల వ్యాపారి నివాసంలో గురువారం తనిఖీలు నిర్వహించి రూ.55.34లక్షల విలువైన అక్రమ బంగారం, రూ.3.53లక్షల విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం అంతా దుబాయ్, శ్రీలంక నుంచి అక్రమంగా తీసుకొచ్చినట్టు విచారణలో వెల్లడైంది. కస్టమ్స్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు రూ.40కోట్ల విలువైన 70 కేజీల అక్రమ బంగారాన్ని జప్తు చేసిందని కమిషనర్ సాధు నర్సింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబు పాలన అవినీతిమయం

1,118వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకుల మండిపాటు

తాడికొండ: ఐదేళ్ల చంద్రబాబు పాలన అవినీతిమయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం, తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,118వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఒకే ప్రాంతంలో రాజధాని నిర్మించడం సాధ్యం కాదని శివరామకృష్ణన్, బోస్టన్, జీఎన్ రావు కమిటీలు స్పష్టంగా నివేదించినా పెడచెవిన పెట్టిన బాబు, తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే భూ సమీకరణ పేరుతో రైతులను నిలువునా ముంచేశాడని విమర్శించారు. పేదవాడికి కనీస అవసరాలు తీర్చేందుకు ఒక్క రూపాయి విదల్చని చంద్రబాబు, ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తానని చెప్పి లక్షల కోట్లు దొడ్డిదారిలో దోచుకొని ఈ ప్రాంతాన్ని అడవిలా మార్చాడని మండిపడ్డారు. బాబు అరెస్టు పేరుతో రాష్ట్రంలో ఓ సామాజిక వర్గం రోడ్లపైకి చేరి రాజకీయ డ్రామాలకు తెరలేపడం సిగ్గుచేటని, వీరంతా న్యాయవ్యవస్థను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై న్యాయస్థానాలు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బహుజన పరిరక్షణ సమితి నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పల్లె బాబు, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



క్లుప్తంగా...

అవతలి పక్షంతో సంప్రదింపులా?

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా పరువు నష్టం కేసులో అవతలి పక్షంతో సంప్రదింపులకు దిగినందుకు ఆమె తరపు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్‌ను ఢిల్లీ హైకోర్టు మందలించింది. దాంతో ఆయన కేసు నుంచి తప్పుకున్నారు. లోక్‌సభలో పారిశ్రామికవేత్త అదానీ గ్రూప్‌పై ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి మహువా డబ్బులు తీసుకున్నారని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే, సుప్రీంకోర్టు లాయర్ జై అనంత్ దేహద్రాయ్ తదితరులు ఆరోపించడం తెలిసిందే. వారిపై ఆమె పరువు నష్టం దావా వేశారు. లాయర్ నారాయణన్ గురువారం తనకు ఫోన్ చేసి, ఆమెపై దాఖలు చేసిన సీబీఐ ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని కోరినట్టు దేహద్రాయ్ హైకోర్టుకు తెలిపారు. దాంతో న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా ఆగ్రహించారు. ''ఇది విని నేను నిజంగా షాకయ్యాను. ఇలా మధ్యవర్తిత్వం చేసేందుకు ప్రయత్నిస్తే ఈ కేసులో వాదించేందుకు మీరెలా అర్హులవుతారు?''అని ప్రశ్నించారు. దేహద్రాయ్, మహువా కొంతకాలం పాటు సహజీవనం చేసినట్టు తృణమూల్ వర్గాలు చెబుతుంటాయి. ఆయన తమ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారని, అసభ్యకర మెసేజీలు పంపుతున్నారని, చోరీకి యత్నించారని గత ఆర్నెల్లలో మహువా పలు కేసులు పెట్టారు.

నేడు స్వదేశానికి నవాజ్ షరీఫ్

లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్(73) దాదాపు నాలుగేళ్ల తర్వాత శనివారం స్వదేశానికి రానున్నారు.లండన్ నుంచి దుబాయ్‌కి, అక్కడి నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డాకు చేరుకున్నారు. అక్కడి నుంచి చార్టెర్డ్ విమానంలో శనివారం పాకిస్తాన్‌కు చేరుకుంటారు. లాహోర్‌లో శనివారం సాయంత్రం తమ పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్ -నవాజ్(పీఎంఎల్-ఎన్) నిర్వహించే బహిరంగ సభలో షరీఫ్ పాల్గొంటారు. అయితే, ఆయన భద్రతకు ముప్పు ఉందన్న నిఘా సమాచారం మేరకు పంజాబ్ పోలీస్ యంత్రాంగం హై అలెర్ట్ ప్రకటించింది.

రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణపై పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. పిల్ వేసిన న్యాయవాది అశోక్ పాండేకు రూ.1 లక్ష జరిమానా విధించింది. రాహుల్ ఎంపీ సభ్యత్వ పునరుద్ధరణ కారణంగా పిటిషనర్ ప్రాథమిక హక్కులకు ఎటువంటి భంగం కలుగలేదని, చట్టప్రక్రియను పిటిషనర్ ఉల్లంఘించారని జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర భట్ పదవీ విరమణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర భట్ రిటైరయ్యారు. ఆఖరి పనిదినమైన శుక్రవారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సహ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ..న్యాయవ్యవస్థ కోసం ముఖ్యంగా రాజ్యాంగ సంబంధ అంశాల్లో ఆయన అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. 1979 నుంచి ఆయనతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదిష్ అగర్వాల్ పాల్గొన్నారు. 2019 సెప్టెంబర్ 23న జస్టిస్ భట్ సుప్రీంకోర్టులో నియమితులై నాలుగేళ్లపాటు సేవలందించారు. పలు చారిత్రక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. 1958లో మైసూరులో జన్మించిన జస్టిస్ భట్ 1982లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేయించుకున్నారు.

కేసుల పరిష్కారం ఆలస్యమైతే

న్యాయవ్యవస్థపై కక్షిదారులకు విశ్వాసం తగ్గుతుంది

న్యూఢిల్లీ: న్యాయ ప్రక్రియ నత్తనడకన సాగితే కక్షిదారులు నిరుత్సాహానికి గురవుతారని సుప్రీంకోర్టు పేర్కొంది. కొన్ని కేసులు 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్న విషయంపై విస్మయం వ్యక్తం చేసింది. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యూపీల్లో 65 ఏళ్లకు పైగా అపరిష్కృతంగా కేసులుండటాన్ని ప్రస్తావించింది. పెండింగ్ కేసులను త్వరితి గతిన పరిష్కరించాలంటూ ఆయా రాష్ట్రాల హైకోర్టులకు శుక్రవారం 11 మార్గదర్శకాలను జారీ చేసింది.

కాన్సులేట్ సేవలు నిలిపేసిన కెనడా

న్యూఢిల్లీ: ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌ప్రీత్‌సింగ్ నిజ్జర్ హత్య విషయమై భారత్, కెనడా మధ్య నెలకొన్న విభేదాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. కెనడాలోని మన దౌత్యవేత్తలను ఆ దేశం బహిష్కరించడం, బదులుగా 41 మంది దౌత్యవేత్తలను దేశం వీడాల్సిందిగా కేంద్రం ఆదేశించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో చండీగఢ్, ముంబై, బెంగళూరుల్లోని కాన్సులేట్లలో ఇన్ పర్సన్ సేవలను నిలిపేయాలని కెనడా నిర్ణయించింది. విదేశాంగ మంత్రి మెలానీ జోలీ గురువారం ప్రకటించారు. 41 మంది దౌత్య సిబ్బందిని వెనక్కు పిలవాల్సి రావడంతో సిబ్బంది కొరత ఏర్పడ్డ కారణంగా ఈ చర్యకు దిగాల్సి వచ్చిందని ఆమె చెప్పడం విశేషం. ప్రస్తుతం 21 మంది కెనడా దౌత్యవేత్తలు, వారి కుటుంబాలు మాత్రమే భారత్‌లో ఉన్నట్టు వివరించారు. భారత్‌లో థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల ద్వారా కొనసాగుతున్న 10 వీసా దరఖాస్తు కేంద్రాలపై తమ నిర్ణయం ప్రభావం పడబోదని తెలిపారు. ఇంతేకాకుండా, చండీగఢ్, ముంబై, బెంగళూరుల్లోని కాన్సులేట్లలో ఇన్ పర్సన్ సేవలను నిలిపేయడమే గాక, ఆ నగరాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలంటూ కెనడా తాజాగా తమ పౌరులకు అడ్వైజరీ కూడా జారీ చేసింది.

గాజాలో తీరని వ్యథ

ఆగని ఇజ్రాయెల్ వైమానిక దాడులు | దక్షిణ గాజా నుంచి వెనక్కి వస్తున్న జనం

- క్షతగాత్రులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- గాజాలో 4,137కి చేరిన మృతుల సంఖ్య
- ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా బలి

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్/వాషింగ్టన్: ఇజ్రాయెల్-హమాస్ మధ్య అనూహ్యంగా మొదలైన యుద్ధం సాధారణ పాలస్తీనియన్ల ఉసురు తీస్తోంది. బతికి ఉన్నవారికి కడుపు నిండా అన్నం లేదు, కంటికి నిద్రలేదు. ఆకలి, అగచాట్లే మిగులుతున్నాయి. సేఫ్‌జోన్ అని భావించే దక్షిణ గాజాలో కూడా ఇప్పుడు భద్రత లేకుండాపోయింది. ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలతో ఉత్తర గాజా నుంచి దక్షిణ గాజాకు వలస వెళ్లిన జనం మళ్లీ వెనక్కి వచ్చేస్తున్నారు. దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు ఉధృతంగా కొనసాగుతుండడమే ఇందుకు కారణం. శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజాపై విరుచుకుపడింది. క్షిపణుల వర్షం కురిపించింది. ప్రధానంగా ఖాన్ యూనిస్ నగరంలో నష్టం అధికంగా జరిగింది. హమాస్‌కు చెందిన 100కుపైగా టార్గెట్లపై దాడులు చేశామని, మిలిటెంట్ల సొరంగాలు, ఆయుధ డిపోలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం శుక్రవారం 14వ రోజుకు చేరింది. ఇరువైపులా ప్రాణ, ఆస్తి నష్టం పెరుగుతోంది. ఈ యుద్ధంలో గాజాలో ఇప్పటివరకు 4,137 మంది మృతిచెందారని, 12,500 మందికిపైగా జనం క్షతగాత్రులుగా మారారని గాజా ఆరోగ్య శాఖ తెలియజేసింది. మరో 1,300 మంది ఇంకా శిథిలాల కిందే ఉన్నారని, వారు బతికి ఉన్నారో లేదో చెప్పలేమని వెల్లడించింది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం మరణించారు. మిలిటెంట్ల అధీనంలో 203 మంది బందీలు ఉన్నట్లు గుర్తించామని ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు.

గాజాలో సేఫ్ జోన్లు లేవు

తమ లక్ష్యం కేవలం హమాస్ మిలిటెంట్లు మాత్రమేనని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ చెప్పారు. గాజాలో హమాస్ గ్రూప్‌ను నిర్మూలించిన తర్వాత సాధారణ ప్రజలను తమ నియంత్రణలోకి తీసుకురావాలన్న ఉద్దేశం ఏదీ లేదని అన్నారు. గాజాలో ఇప్పుడు సేఫ్ జోన్లు అంటూ ఏవీ లేవని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి నిర్ దినార్ చెప్పారు. గాజా అంతటా మిలిటెంట్ల స్థావరాలు, సొరంగాలు ఉన్నాయని, వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ సైన్యం ఇప్పుడు దక్షిణ గాజాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో అక్కడ పరిస్థితులు దిగజారుతున్నాయని, జనజీవనం స్తంభించిపోతోందని, ఉత్తర గాజా నుంచి వచ్చినవారు వెనక్కి మళ్లుతున్నారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం అధికార ప్రతినిధి రవీనా శామ్‌దాసానీ చెప్పారు. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల కారణంగా క్షతగాత్రుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గాజాలోని ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. పరిమితంగా ఉన్న ఔషధాలు ఏ మూలకూ చాలడం లేదు. హాస్పిటళ్లలో కరెంటు లేకపోవడంతో డాక్టర్లు మొబైల్ ఫోన్ల వెలుగులో ఆపరేషన్లు చేస్తున్నారు. ఈజిప్టు నుంచి ఔషధాలు, నిత్యావసరాలు దిగుమతి చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని గాజా అధికారులు చెప్పారు.

ఇద్దరు అమెరికన్ల విడుదల!

తమ అధీనంలో ఉన్న బందీల్లో ఇద్దరు అమెరికన్లను విడుదల చేశామని హమాస్ సైనిక విభాగం అధికార ప్రతినిధి ఒకరు శుక్రవారం ప్రకటించారు. మానవతా దృక్పథంతో వారిని వదిలేసినట్లు తెలిపారు. అయితే, హమాస్ చెర నుంచి ఇద్దరు అమెరికన్లు విడుదలయ్యారా? లేదా? అనేది అమెరికా ప్రభుత్వం ఇంకా నిర్ధారించలేదు. హమాస్ అధీనంలో దాదాపు 200 మంది బందీలు ఉన్నట్లు సమాచారం.

క్షిపణులు, డ్రోన్లను కూల్చివేసిన అమెరికా సైన్యం

మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాద సంస్థలు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తున్నాయి. గురువారం ఇజ్రాయెల్ దిశగా దూసుకొస్తున్న క్షిపణులు, డ్రోన్లను ఉత్తర ఎర్ర సముద్రంలోని తమ యుద్ధనౌక యూఎస్ఎస్ కార్నీ కూల్చివేసిందని అమెరికా సైన్యం వెల్లడించింది. యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాద శక్తులు ఈ ఆయుధాలను ప్రయోగించాయని ఆరోపించింది. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలైన తర్వాత అమెరికా నుంచి జరిగిన తొలి ప్రతిదాడి ఇదే కావడం గమనార్హం.

హమాస్ అగ్రనేత హసన్ యూసఫ్ అరెస్టు

హమాస్ మిలిటెంట్ సంస్థ అధికార ప్రతినిధి హసన్ యూసఫ్‌ను గురువారం వెస్ట్ బ్యాంక్‌లో అరెస్టు చేసినట్లు ఇజ్రాయెల్ అంతర్గత భద్రతా సంస్థ షిన్‌బెట్ ప్రకటించింది. వెస్ట్‌బ్యాంక్‌లో నిర్వహించిన దాడుల్లో హమాస్‌కు చెందిన 60 మంది కీలక సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేసింది. హమాస్ కోసం హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలపై హసన్ యూసఫ్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించింది.



హసన్ యూసఫ్ పాలస్తీనాలో ప్రభావవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం హవ మాస్ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నాడు. వెస్ట్‌బ్యాంక్ చట్టసభలో సభ్యుడుగా వ్యవహరిస్తున్నాడు. హసన్ యూసఫ్ గతంలో 24 ఏళ్లు జైల్లో ఉన్నాడు. అంతర్జాతీయ మీడియాలో హమాస్ ప్రతినిధిగా ప్రముఖంగా కనిపించేవాడు.



ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన గాజా సిటీలోని భవనాలు



ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడి ఖాన్ యూనిస్‌లోని నాసెర్ ఆస్పత్రికి చేరిన చిన్నారి

ఇజ్రాయెలీలకు వీసా లేకుండా అమెరికా యానం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం చాలారోజులు కొనసాగే అవకాశం ఉండడంతో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్ ప్రజల కోసం వీసా రద్దు పథకాన్ని ప్రకటించింది. దీని ప్రకారం ఇజ్రాయెలీలు వీసాకు దరఖాస్తు చేసుకోకుండానే అమెరికాకు చేరుకొని, 90 రోజులపాటు ఇక్కడ నివసించవచ్చు. ఈ పథకం గురువారం నుంచే అమల్లోకి వచ్చిందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది.

డ్రగ్స్ మత్తులో ఇజ్రాయెల్‌పై మిలిటెంట్ల దాడి!

హమాస్ మిలిటెంట్లు ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేశారు. వారు ఆ సమయంలో మాదక ద్రవ్యాల మత్తులో ఉన్నారని 'ద జెరూసలేం పోస్టు' పత్రిక వెల్లడించింది. కాప్టాగాన్ అనే డ్రగ్స్ మాత్రలు తీసుకున్నారని, ఒళ్లు తెలియని స్థితిలో రెచ్చిపోయారని, సాధారణ ప్రజలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని పేర్కొంది. ఇజ్రాయెల్ సైన్యం జరిపిన ఎదురుదాడిలో పలువురు మిలిటెంట్లు మరణించారు. మృతదేహాలను సోదా చేయగా కాప్టాగాన్ డ్రగ్స్ మాత్రలు లభించాయని ఆ పత్రిక వివరించింది. హమాస్ నాయకత్వమే మిలిటెంట్లకు ఈ మాత్రలు ఇచ్చినట్లు తెలిపింది. కాప్టాగాన్‌ను పేదల కొకైన్‌గా పిలుస్తుంటారు. అన్నం దొరకని సందర్భాల్లో ఆకలి వేయకుండా, మత్తులో మునిగి ధైర్యం పొందడం కోసం కాప్టాగాన్ తీసుకుంటూ ఉంటారు.

ఇజ్రాయెల్, ఉక్రెయిన్ విజయం అమెరికాకు రక్ష: బైడెన్

ప్రత్యర్థులతో ప్రస్తుతం సాగిస్తున్న యుద్ధాల్లో ఇజ్రాయెల్, ఉక్రెయిన్ దేశాలు విజయం సాధించాలని కోరుకుంటున్నానని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌ల విజయం అమెరికా జాతీయ భద్రతకు చాలా కీలకమని అన్నారు. ఆయన గురువారం రాత్రి శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీసు నుంచి అమెరికన్లను ఉద్దేశించి మాట్లాడారు. సైనిక సాయం కింద ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌తోపాటు తైవాన్‌కు బిలియన్ల డాలర్లు ఇవ్వాలని, అందుకోసం మనం సిద్ధం కావాలని సూచించారు. నిధుల మంజూరు కోసం కాంగ్రెస్‌ను విజ్ఞప్తి చేశానని, రాబోయే ఏడాది వ్యవధిలో 100 బిలియన్ డాలర్లు కావాలని చెప్పారు. ఇదొక తెలివైన పెట్టుబడి అవుతుందని, దీనివల్ల అమెరికాలో భవిష్యత్తు తరాలకు భద్రమైన జీవితం లభిస్తుందని, అదే మనకు లభించే సత్ఫలితమని స్పష్టం చేశారు.

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు కావాలి: సౌదీ యువరాజు

1967 నాటి సరిహద్దులతో స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలని సౌదీ అరేబియా యువరాజు, ప్రధానమంత్రి మొహమ్మద్ బిన్ సల్మాన్ అన్నారు. శుక్రవారం జీసీసీ, ఆసియాన్ ఉమ్మడి శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. గాజాలో హింసాకాండ, అమాయక ప్రజల మరణంపై ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ పౌరులపై దాడులను ఖండిస్తున్నామని చెప్పారు.

సర్వం సిద్ధం

నేడు గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ ప్రయోగం



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) శనివారం ఉదయం మొట్టమొదటగా ప్రయోగించనున్న గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ (టీవీ-డీ1) ప్రయోగానికి శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. 12.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం శనివారం ఉదయం 8 గంటలకు ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి సింగిల్ స్టేజీతో (ఒకే దశతో) ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. 531.8 సెకన్లకు ప్రయోగాన్ని పూర్తి చేయనున్నారు. టీవీ-డీ1ను 17 కిలోమీటర్లు ఎత్తుకు తీసుకెళ్లి రాకెట్ శిఖరభాగాన అమర్చిన క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టంను మళ్లీ కిందకు తీసుకొచ్చే ప్రక్రియను చేపట్టడం ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం. రాకెట్ శిఖరభాగంలో అమర్చిన క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టం భూమికి 17 కిలోమీటర్లు దూరంలో అంతరిక్షంలో వదిలిపెట్టిన తరువాత దానికి పైభాగంలో అమర్చిన 10 ప్యారాచూట్ల సాయంతో బంగాళాఖాతంలో దించి సురక్షితంగా తీసుకువచ్చే ప్రక్రియను చేపడుతున్నారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో కోస్టల్ నేవీ సిబ్బంది ఒక ప్రత్యేక బోట్‌లో వేచి ఉండి సముద్రంలో క్రూమాడ్యూల్ పడిన తరువాత దాన్ని సురక్షితంగా తీసుకొస్తారు. భవిష్యత్తులో వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి క్షేమంగా తీసుకువచ్చే ప్రక్రియను పరిశీలించే ప్రయోగం ఇదే కావడం విశేషం.

సఫాయి కార్మికుల కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారమివ్వాలి

ప్రభుత్వ యంత్రాంగానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సఫాయి కార్మికులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించింది. అదేవిధంగా, డ్రెయినేజీలను శుభ్రం చేస్తూ శాశ్వత వైకల్యానికి గురయ్యే వారికి కనీసంగా రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని కూడా పేర్కొంది. మాన్యువల్ స్కావెంజింగ్ విధానాన్ని పూర్తిగా లేకుండా చేయాలని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఒకవేళ సఫాయి కార్మికులు విధుల్లో ఇతర అవకరాలకు గురయిన సందర్భాల్లో రూ.10 లక్షలను పరిహారంగా చెల్లించాలని కూడా ఈ సందర్భంగా జస్టిస్ భట్ పేర్కొన్నారు.

అచ్యుతానందన్‌కు 100 ఏళ్లు



అలప్పుజ: కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ సీఎం వెలిక్కకత్తు శంకర్ అచ్యుతానందన్ శుక్రవారంతో 100 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 2006-11 సంవత్సరాల్లో ఆయన సీఎంగా చేశారు. 1991 నుంచి 2016 దాకా మూడుసార్లు విపక్ష నేతగా ఉన్నారు. వీఎస్‌గా ప్రసిద్ధుడైన ఆయన 82 ఏళ్ల వయసులో సీఎం పదవి చేపట్టిన నేతగానూ రికార్డు సృష్టించారు. స్ట్రోక్ నేపథ్యంలో ఐదేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. చివరికి 2016 ఎన్నికల్లో కూడా కేరళలో వామపక్ష కూటమి వీఎస్‌నే ముందు పెట్టుకుని ప్రచారం చేసింది. కాంగ్రెస్‌ను ఓడించి అధికారం చేపట్టింది. అభిమానులు ఆయన్ను ఫిడెల్ క్యాస్ట్రో ఆఫ్ కేరళ అని పిలుచుకుంటారు. అలప్పుజ జిల్లా పున్నప్రగ్రామంలో 1923లో జన్మించిన వీఎస్ 11 ఏళ్లప్పుడే కన్నవారిని పోగొట్టుకున్నారు. మరుసటేడే స్కూలు మానేసి అన్న టైలరింగ్ షాపులో పనికి కుదురుకున్నారు. 15 ఏళ్ల వయసులో కాంగ్రెస్‌లో చేరారు. రెండేళ్ల తర్వాత సీపీఐలోకి మారి పార్టీలో చకచకా ఎదిగారు. 1964లో సీపీఐ నుంచి బయటికొచ్చి సీపీఎంను ఏర్పాటు చేసిన 32 మంది నేతల్లో వీఎస్ ఒకరు. పుట్టినరోజు సందర్భంగా పలువురు నాయకులు, ప్రముఖులు వీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

'నమో భారత్'కు ప్రధాని మోదీ పచ్చజెండా

సాహిబాబాద్: దేశంలో మొట్టమొదటి నమో భారత్ రైలు(ర్యాపిడ్ రైలు సర్వీసు)కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పచ్చజెండా ఊపారు. ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ మార్గంలో నిర్మిస్తున్న రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్)లో 17 కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. ఈ 17 కిలోమీటర్ల కారిడార్‌తోపాటు ఇదే మార్గంలో 'నమో భారత్' రైలును మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని సాహిబాబాద్ నుంచి దుహాయి డిపో వరకు ఆయన నమో భారత్ రైలులో ప్రయాణించారు. రైలులో పాఠశాల విద్యార్థులు, రైల్వే సిబ్బందితో మాట్లాడారు. ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ మొత్తం పొడవు 82.15 కిలోమీటర్లు. మిగిలిన మార్గం మరో ఏడాదిన్నరలో పూర్తవుతుందని, దాన్ని తానే ప్రారంభిస్తానని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌తోపాటు హరియాణా, రాజస్తాన్‌లో నగరాలు, పట్టణాలను అనుసంధానించేలా మరికొన్ని నమో భారత్ ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్, బెంగళూరు మెట్రో రైలును కూడా ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు.

గాజా కింద మరో గాజా!

గాజాస్ట్రిప్‌లో శత్రుదుర్భేద్య సొరంగాలు • హమాస్ మిలిటెంట్ల తిరుగులేని అస్త్రాలు

- వాటిని కనిపెట్టడం అంత ఈజీ కాదు
- ఇజ్రాయెల్ ఆర్మీకి తీవ్ర ప్రతిఘటన తప్పదు
- మిలటరీ నిపుణుల హెచ్చరికలు

సరిహద్దులు దాటి మెరుపు దాడులతో భయోత్పాతం సృష్టించిన హమాస్ పనిపట్టే లక్ష్యంతో ఇజ్రాయెల్ ఆర్మీ దూకుడుగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతానికి గాజాస్ట్రిప్‌పై భారీ వైమానిక దాడులతో వందలాదిగా భవనాలను ఇజ్రాయెల్ ఆర్మీ నేలమట్టం చేస్తూ పోతోంది. సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులను మోహరించింది. దాని దృష్టంతా ఇప్పుడు హమాస్ శ్రేణులపైనే ఉంది. ఇజ్రాయెల్ ఆర్మీ అత్యాధునిక సాంకేతికత, ఆయుధ బలంతో హమాస్ ఏమాత్రం సరితూగదు. అయితే, గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ ఆర్మీ పని అనుకున్నంత సులువు కాదన్నది నిపుణుల మాట. ఏళ్లపాటు శ్రమించి ఏర్పాటు చేసుకున్న రహస్య భూగర్భ సొరంగాల విస్తారమైన నెట్‌వర్క్ హమాస్‌కు పెట్టని కోటగా మారింది. గత వారం నరమేధం సృష్టించిన హమాస్ మిలిటెంట్లు సరిహద్దులు దాటేందుకు సముద్ర, భూ, ఆకాశ మార్గాలతోపాటు ఈ సొరంగమార్గాలను కూడా వాడుకున్నారనే అనుమానాలున్నాయి. శత్రుదుర్భేద్యమైన టన్నెల్ నెట్ వర్క్ ఎలా, ఎక్కడుందన్నది ఇజ్రాయెల్ ఆర్మీకి అంతుచిక్కడం లేదు. ఈ టన్నెళ్లలోనే హమాస్ ఆయుధ సామగ్రి, నెట్‌వర్క్ అంతా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ బందీలను అండర్‌గ్రౌండ్‌లోనే దాచినట్లు ఆర్మీ అంటోంది. ఇజ్రాయెల్ 2014 నుంచి గాజా స్ట్రిప్‌తో ఉన్న 60 కిలోమీటర్ల సరిహద్దుల్లో భూగర్భంలో బారియర్లను ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.7,500 కోట్లకు పైగా ఖర్చు చేసింది. సరిహద్దులకు ఆవలి వైపు ఏర్పాటయ్యే సొరంగాలను సైతం గుర్తించేందుకు ఎల్బిట్ సిస్టమ్స్, రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు సంస్థలే ఇజ్రాయెల్‌కు క్షిపణి దాడులను అడ్డుకునే ఐరన్ డోమ్‌ను సమకూర్చాయి. ఐరన్‌వాల్, ఐరన్ స్పేడ్ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ఇవి సాంకేతికతలను అభివృద్ధి పరిచాయి. అయితే, అవేవీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. టన్నెళ్ల మధ్య లింకులను అవి కనిపెట్టలేకపోయాయి. 'గాజా స్ట్రిప్‌లో రెండు లేయర్లున్నాయి. ఒకటి పౌరులది కాగా, రెండోది హమాస్‌ది. హమాస్ నిర్మించుకున్న ఆ రెండో లేయర్ ఎక్కడుందో కనిపెట్టేందుకు మేం ప్రయత్నిస్తున్నాం'అని ఇజ్రాయెల్ రక్షణ శాఖ ప్రతినిధి జొనాథన్ కొన్రికస్ చెప్పారు. అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌ను ఛేదించడం అంత సులువు కాదు. గతంలోనూ ఇజ్రాయెల్ అనేక మార్లు ప్రయత్నించి భంగపడింది. 2021లో గాజాపై భారీ చేపట్టిన బాంబు దాడులతో 100 కిలోమీటర్ల పరిధిలోని టన్నెళ్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, తమకు 500 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్ ఉన్నట్లు హమాస్ ఆ తర్వాత ప్రకటించుకోవడం గమనార్హం.

భూగర్భ మార్గాలు ప్రమాదకరమా?

సాంకేతికత ఎంతగా వృద్ధి చెందినప్పటికీ భూతల పోరాటంలో ఆధిపత్యం సాధించిన వారిని అక్షరాలా అణగదొక్కేందుకు టన్నెలింగ్ అత్యంత ప్రభావ వంతమైన మార్గంగా మారిపోయిందని స్కాట్ సవిట్జ్ అనే మిలటరీ నిపుణుడు అంటున్నారు. సొరంగాలు ఉన్నాయా, ఉంటే ఎన్ని ఉన్నాయి? అవి ఎక్కడ ఉన్నాయి? అనేది వాటిని నిర్మించిన వారికే తప్ప ప్రత్యర్థికి తెలిసే అవకా శాలు చాలా తక్కువని ఆయన చెబుతు న్నారు. సైనిక పరమైన నష్టాన్ని తగ్గించేందుకు రోబోట్‌లను పంపి సంక్లిష్టమైన సొరంగాలను కనిపెట్టొచ్చు. అయితే, లోపల జాగా తక్కువగా ఉండటం, బూబీ ట్రాప్‌లు, ఇతర ఆత్మరక్షణ ఏర్పాట్లను మిలిటెంట్లు ఏర్పాట్లు చేసుకొని ఉండే ఉంటారు. భూగర్భ టన్నెళ్ల వాతావరణం వారికే తప్ప ఇతరులకు తెలిసే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ బలగాలు అందులోకి ప్రవేశించి తీవ్ర ప్రతికూలతను ఎదుర్కోవాల్సి రావచ్చు'అని సవిట్జ్ హెచ్చరించారు.



ఎన్నో ఏళ్లుగా టన్నెళ్లను ఉపయోగించుకుంటున్న హమాస్

'అత్యంత జనసాంద్రత కలిగిన గాజాలో హమాస్ ఎన్నో ఏళ్లుగా టన్నెళ్లను ఉపయోగించుకుంటోంది. ఆయుధాలు, కమాండ్ వ్యవస్థలు, ఫైటర్లను వాటిలోనే దాచిపెడుతోంది. వాటిలోకి వెంటిలేషన్ మార్గాలు, విద్యుత్ తదితర సౌకర్యాలను సైతం సమకూర్చుకుంది. కొన్ని టన్నెళ్లయితే 35 మీటర్ల లోతులో కూడా ఉన్నాయి. రైల్ రోడ్ మార్గాలు, కమ్యూనికేషన్ గదులూ ఉన్నాయి. వాటి ప్రవేశ మార్గాలు ఎక్కువగా నివాస భవనాలు, కార్యాలయాల్లోనే ఉన్నాయి'అని నిపుణులు అంటున్నారు. మొదట్లో ఈ సొరంగాలను ఈజిప్టు నుంచి దొంగచాటుగా ఆయుధాలు, సరుకులను తరలించేందుకు వాడారు. సరిహద్దుల అవతల దాడులు జరిపేందుకు సైతం వీటిని ఉపయోగించుకున్నారు. 2006లో గిలాడ్ షలిట్ అనే ఇజ్రాయెల్ జవానును మిలిటెంట్లు సొరంగం ద్వారా దాడి చేసి, ఎత్తుకుపోయారు. అయిదేళ్ల తర్వాత వెయ్యి మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేశాక అతడిని వదిలిపెట్టారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 21 । అక్టోబర్ । 2023

2018వ వేతన కమిషన్‌లో వేతన తారతమ్యాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఫ్రీడం పార్కులో ధర్నా చేస్తున్న అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు, అధ్యాపకులు



న్యూస్‌రీల్

బీజేపీ ఎమ్మెల్యేలపై దర్యాప్తు చేయరా?

- రాజకీయ కక్షతోనే తనపై సీబీఐతో దర్యాప్తు
- డిప్యూటీసీఎం డీకే.శివకుమార్



మాట్లాడుతున్న డీకే శివకుమార్

బనశంకరి: రాజకీయ కక్షతోనే తన కేసును సీబీఐ దర్యాప్తునకు అప్పగించారని, బీజేపీ ఎమ్మెల్యేలపై తనిఖీ చేపట్టరా?అని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ప్రశ్నించారు. శుక్రవారం కుమారకృప అతిథిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు సీబీఐ దర్యాప్తు పరిధిలోకి రాదని అడ్వొకేట్ జనరల్ స్పష్టంగా తెలిపారని, కానీ దీనిపై స్పీకర్ అనుమతి తీసుకోకుండా యడియూరప్ప నేరుగా సీబీఐ దర్యాప్తునకు అనుమతి ఇచ్చారని తెలిపారు. సీబీఐ 90 శాతం దర్యాప్తు ముగిసినట్లు పేర్కొందని, అయితే తన వద్దకు ఏ విచారణ అధికారి కూడా రాలేదని, వివరాలు తీసుకోలేదన్నారు. విపక్షాల విమర్శలపై మాట్లాడిన డీకే.శివకుమార్ ... వీధుల్లో పోయే వారందరికీ సమాధానం చెప్పడం సాధ్యం కాదని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తానన్నారు.

ప్యాలెస్‌లో సరస్వతి పూజ



సరస్వతి పూజ చేస్తున్న కృష్ణదత్త ఒడయార్

మైసూరు: మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా శుక్రవారం ప్యాలెస్‌లో రాజవంశస్తులు నవరాత్రి పూజ కైంకర్యాలను సంప్రదాయం ప్రకారం చేపట్టారు. విద్యా దేవత సరస్వతి పూజను నిర్వహించారు. ప్యాలెస్‌లో ప్రైవేటు దర్బార్ నిర్వహించే యదువీర్ కృష్ణదత్తా చామరాజ ఒడెయార్ శుక్రవారం ఉదయం సరస్వతి పూజను నిర్వహించారు., వేదమంత్రాలను పఠించారు. పూజలో ఆయన కుమారుడు ఆద్యవీర్ కూడా పాల్గొన్నాడు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటికి బీజేపీ మాజీ మంత్రి

- రాజకీయ వర్గాల్లో సంచలనం



ఆనంద్‌సింగ్

హొసపేటె: బీజేపీకి చెందిన మాజీ మంత్రి బీఎస్ ఆనంద్‌సింగ్ శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప నివాసానికి వెళ్లడం నగరంలో చర్చనీయంగా మారింది. నగరంలో చక్కెర కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం 120 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే తానే స్వయంగా చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తానని ఆయన ఎమ్మెల్యేకు తెలిపినట్లు సమాచారం. ఆనంద్‌సింగ్ కుమారుడు సిద్ధార్థసింగ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందడంతో అప్పటి నుంచి ఆనంద్‌సింగ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. నగరంలో బీజేపీ కార్యక్రమాలకు కూడా ఇంత వరకు హాజరు కాలేదు. కాగా కొన్ని గంటల పాటు ఆనంద్‌సింగ్ ప్రస్తుత ఎమ్మెల్యే గవియప్పను కలిసి చర్చలు జరపడం రాజకీయాల్లో సంచలనం రేకెత్తించింది.

కూతురిపై లైంగిక దాడి, కామాంధుడికి 20 ఏళ్ల జైలు

శివాజీనగర: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బెంగళూరులోని పోక్సో న్యాయస్థానం తీర్పు చెప్పింది. 2022లో కామాక్షిపాళ్య పోలీసు స్టేషన్ వ్యాప్తిలో ఘటన జరిగింది. మైనర్ కుమార్తెపై 38 సంవత్సరాల తండ్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి కామాక్షిపాళ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ లోహిత్ కేసు నమోదు చేసుకుని కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. విచారణ జరిపిన పోక్సో కేసుల న్యాయమూర్తి నరసమ్మ.. నిందితుడికి 20 ఏళ్లజైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాలికకు న్యాయ ప్రాధికార నుంచి రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలని సిఫార్సు చేశారు.

వరుస దాడులతో గజగజ

- నాలుగేళ్లలో 151 మంది మృత్యువాత
- గజ దాడులతో పంటలకు కూడా విపరీతమైన నష్టం



మైసూరులో సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన ఏనుగు(ఫైల్)



వాహనంపై దాడిచేస్తున్న ఏనుగు (ఫైల్)

బనశంకరి: ఏనుగు నడిచిందే దారి అనేది సామెత. అడవుల్లో సరైన ఆహారం, నీరు లభించక జనావాసల్లోకి చొరబడుతున్న ఏనుగులు తమకు ఎదురైన వారిపై దాడి చేస్తున్నాయి. తొండాలతో విసిరేసి, కాళ్లతో తొక్కి దారుణంగా హతమార్చుతున్నాయి. తోటలు, పొలాలను ధ్వంసం చేసి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయి. రాష్ట్రంలో 6,395 ఏనుగులు ఉండగా నాలుగేళ్లలో ఏనుగులు దాడిలో 151 మంది మృత్యువాత పడ్డారు. తాజాగా మైసూరు జిల్లా నరగూరు తాలూకా నహోడిలో పొలానికి వెళ్తున్న చిక్కేగౌడ అనే రైతుపై ఏనుగు దాడి చేసి హతమార్చింది.

అడవుల నరికివేతతో...

జనాభా పెరిగే కొద్దీ ఆవాసాల సంఖ్య పెరుగుతోంది. వాటి నిర్మాణానికి కలప అవసరం. దీని కోసం అడవుల్లో చెట్లను కొట్టేస్తున్నారు. రోడ్లు, రహదారులు, రైలుమార్గాలు, కాలువలు, ఆనకట్టలు, గని తవ్వకాల కోసం అడవులను చదును చేస్తున్నారు. దీంతో వన్యజీవులకు ఆవాసంగా ఉన్న అడవులు ఛిద్రం కావడంతో కొన్ని వన్యజీవులు జనవసతి ప్రాంతాల్లోకి అడుగుపెడుతున్నాయి. భారీ ఎత్తున ఏనుగులు ఆహారం, నీటికోసం వలస వెళ్లేసమయంలో విధ్వంసాలకు పాల్పడుతున్నాయి. ప్రజలను పొట్టనబెట్టుకుంటున్నాయి. హాసన జిల్లా హళ్లియూరు వద్ద గాయపడిన భీమ అనే ఏనుగుకు చికిత్స అందించడానికి ఏనుగు సహాయకుడు మంజణ్ణ తన వద్ద ఉన్న ట్ర్యాంక్విలైజర్ గన్‌తో ఏనుగు పొట్టకు అనస్తీయా మందు షూట్ చేశాడు. వెంటనే కోపంతో ఏనుగు ముగ్గురు సిబ్బందిపై దాడికి యత్నించగా వారు పరుగులు తీశారు. ఏనుగు వెంటాడి మంజణ్ణను చంపేసింది. కొన్నేళ్లక్రితం టీ.నరసీపుర అడవి నుంచి మైసూరు నగరంలోకి ప్రవేశించిన ఏనుగుల్లో మదపుటేనులు నారాయణశాస్త్రి రోడ్డులో రేణుకాప్రసాద్(55) అనే వ్యక్తిపై దాడిచేసి చంపేశాయి.

సాధుజంతువైనప్పటికీ..

ఏనుగు సాధు జంతువైనప్పటికీ 12 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయసున్న ఏనుగులు ఎక్కువ కోరికతో ఉంటాయి. ఈసమయంలో ఏనుగుల తలకు రెండు కన్నుల పక్కన ద్రవం లాంటి నీరు కారుతుంది. వేరే ఏనుగులపై గొడవకు వెళ్లడం, కొన్ని సమయాల్లో ప్రజలపై దాడులకు పాల్పడటం లాంటివి చోటుచేసుకుంటాయి. ఓ దశలో మావటీలపై దాడిచేసి చంపేస్తాయని అటవీశాఖ పశువైద్య డాక్టర్ డీఎన్.నాగరాజ్ తెలిపారు.

ఏనుగుల దాడులకు చెక్

హాసన జిల్లాలో మనుషులు-జంతువుల మధ్య సంఘర్షణకు తగ్గించే ఉద్దేశంతో కర్ణాటక అటవీశాఖ ఇటీవల హాసన అటవీశాఖ విభాగం వ్యవసాయశాఖను సంప్రదించింది. పంటలు పద్ధతిలో మార్పులు చేయడంపై అన్వేషించడానికి అధ్యయనం చేసి ఏనుగులు జనవసతిప్రాంతాలోకి రాకుండా చర్యలు తీసుకుంది.

ఏనుగుల దాడుల్లో మృతుల సంఖ్య

రాష్ట్రంలో 6,395 ఏనుగులు ఉండగా నాలుగేళ్లలో ఏనుగులు దాడితో 151 మంది మృత్యువాత పడ్డారు. 2018 ఏప్రిల్, 2019 మార్చి మధ్య 13 మందిని బలి తీసుకున్న ఏనుగులు.. 2019-20లో 30 మందిని హతమార్చాయి. 2020-21లో 26 మందిని, 2021-22లో 28 మందిని, 2022-23లో 30 మందిని చంపేశాయి.

33 మంత్రులకు కొత్త కార్లు

శివాజీనగర: రాష్ట్రంలో ఓవైపు దుర్భిక్ష పరిస్థితులు నెలకొనగా మరో వైపు ప్రభుత్వం 33 మంది మంత్రులకు రూ.9.90 కోట్లతో ఇన్నోవా హైబ్రిడ్ కార్లు కొనుగోలు చేసింది. దసరా ఆరంభమవుతుండగానే మంత్రుల నివాసానికి కారు వచ్చింది. అనవసర ఖర్చులను అరికడతామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం మంత్రుల కోసం కొత్త కార్లను కొనుగోలు చేసింది. రాష్ట్రంలో భయంకరమైన కరువుంది. వర్షం కొరతతో పంటలు పండటం లేదు. వ్యవసాయ కార్మికులకు పనులు లేక బతుకు కష్టంగా మారింది. పంటను కాపాడుకోవాలని రైతులు బిందెలతో నీరుపోస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వంకోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇన్నోవా హైబ్రిడ్ కార్లను కొనుగోలు చేసింది.

రెండున్నరేళ్ల తర్వాత మంత్రి మండలిలో మార్పులు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక్ పట్టణశెట్టి

శివాజీనగర: రెండున్నర సంవత్సరాల తరువాత మంత్రి మండలిలో మార్పు జరుగుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక పట్టణశెట్టి వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడుతూ తాను సీనియర్ ఎమ్మెల్యేనని, మంత్రి పదవి దక్కాల్సి ఉండగా అది నెరవేరలేదన్నారు. రెండున్నర సంవత్సరాల తరువాత మంత్రి అవుతాననే భరోసాను వ్యక్తం చేశారు. కులాన్ని బట్టి కాకుండా అనుభవం దృష్టిలో పెట్టుకొని మంత్రి పదవులు కేటాయించాలన్నారు. మంత్రి పదవి దక్కినా, దక్కకపోయినా పార్టీలోనే కొనసాగుతానన్నారు. మంత్రి సతీశ్ జార్కిహొళి నేతృత్వంలో ఎమ్మెల్యేల పర్యటన గురించి స్పందించిన ఆయన.. అభివృద్ధి పనులపై మాట్లాడేందుకు వెళ్లినపుడు ఆ రోజు ఆయన ఇంట్లోనే అల్పాహారం సేవించానన్నారు. అదే రోజు నాలుగైదు మంది ఎమ్మెల్యేలు వచ్చి అల్పాహారం తీసుకున్నారన్నారు. సతీశ్ జార్కిహొళి మైసూరుకు రావాలని తనను ఆహ్వానించలేదని, ఈ విషయంపై ఎలాంటి సమావేశం జరగలేదన్నారు.

వ్యవసాయానికి ఐదు గంటల కరెంట్



మాట్లాడుతున్న మంత్రి సుధాకర్, చిత్రంలో కలెక్టర్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: వ్యవసాయానికి రోజూ ఐదు గంటల పాటు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేస్తామని మంత్రి సుధాకర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో విద్యుత్ ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ సంక్షోభం నెలకొందని, ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి రైతులకు ఐదు గంటల పాటు విద్యుత్ ఇస్తామని, వారు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లను, పరిసరాలను స్వచ్ఛతగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ ఈసీఓ ప్రకాశ్, ఎస్పీ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసుల ఉపసంహరణపై కదలిక

- ఫైలును మంత్రివర్గ సమావేశంలో ఉంచాలని సీఎం ఆదేశాలు

బనశంకరి: కావేరి, మేకెదాటు పాదయాత్రతో పాటు కన్నడనాడు హితరక్షణకోసం పోరాటాల్లో పాల్గొన్న ఉద్యమకారులపై నమోదైన కేసులను ఉపసంహరణకు సంబంధించిన ఫైలును మంత్రివర్గసమావేశంలో పెట్టాలని హోంమంత్రికి సీఎం సిద్ధరామయ్య సూచించారు. కన్నడ నాడు,జలాలు, భాష హితరక్షణకోసం జరిగిన పోరాటాల్లో ప్రజాప్రతినిధులు సీనియర్ రాజకీయనేతలు, కన్నడ ఉద్యమకారులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. కావేరి, మేకేదాటుపై ధర్నాలు చేపట్టారు. ఆందోళన కార్యక్రమాలను అణచివేసేందుకు అప్పటి బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్‌రాజకీయనేతలు, రైతునేతలు, కన్నడ పోరాటనేతలపై కేసులు బనాయించింది. దీంతో కోర్టులు చుట్టూ తిరగాల్సివస్తుంది. కేసులను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ దినేశ్‌గూళిగౌడ సీఎంకు లేఖ రాశారు. దీంతో సీఎం పైవిధంగా స్పందించారు.

మెట్రో మూడో దశకు అనుమతివ్వండి



కెంగేరి-చల్లఘట్ట మధ్య మెట్రో సర్వీసులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టాలపై పరుగులు తీస్తున్న మెట్రో రైలు

- ప్రధాని మోదీని కోరిన సీఎం సిద్దరామయ్య
- మెట్రో విస్తృత మార్గాన్ని వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ

శివాజీనగర: కేఆర్ పురం నుంచి బయప్పనహళ్లి, కెంగేరి నుంచి చల్లఘట్టపురం వరకు మెట్రో రైలు విస్తత మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ ద్వారా ప్రారంభించారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సీఎం నివాస కార్యాలయం కృష్ణాలో జరిగిన వర్చువల్ సభలో పాల్గొన్నారు. సీఎం రాజకీయ కార్యదర్శి నజీర్ అహమ్మద్, రాష్ట్ర ప్రణాళికా కమిషన్ ఉపాధ్యక్షుడు ప్రొ.రాజీవ్‌గౌడ, ఎమ్మెల్యే ఎస్.టీ.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ప్రధానమైన రెండు మార్గాలైన కృష్ణరాజపురం-బయ్యప్పనహళ్లి మధ్య 2.10 కి.మీ.పొడవు, కెంగేరి నుంచి చల్లఘట్టపుర వరకు 2.05 కి.మీ.ల పొడవు మార్గాన్ని ఈనెల 9న ప్రజల సేవకు పూర్తి చేయగా ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. సీఎం మాట్లాడుతూ 45 కిలోమీటర్ల పొడవున మెట్రో మూడో దశ నిర్మాణానికి సుమారు రూ. 15,611 కోట్లు ఖర్చు కానుందన్నారు. ఇప్పటికే నివేదిక తయారుచేసి కేంద్రం అనుమతికి పంపామన్నారు. ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతి ఇవ్వాలని ఆయన ప్రధాని మోదిని కోరారు. మెట్రో మూడో దశతో పాటుగా సర్జాపుర నుంచి హెబ్బాళ వరకు 27 కి.మీ. పొడవు మెట్రో రైలు స్టేజ్-3ఏకు సమగ్ర నివేదిక ప్రణాళికా నివేదికను తయారుచేయనున్నట్లు తెలిపారు. మెట్రో జాల 74 కి.మీలకు విస్తరించిందని, రోజూ 2 లక్షల మందికిప పైగా ప్రయాణీకులు సంచరిస్తున్నారని ముఖ్యమంత్రి ఇదే సందర్భంలో తెలిపారు. బెంగళూరు అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీ, నగర వ్యవహారాల మంత్రులతో పాటుగా ఇతర మంత్రులకు మెట్రో ప్రాజెక్ట్‌లో పని చేసిన కాంట్రాక్టర్లకు, ఆర్థిక సహాయాన్ని అందించిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌తో పాటుగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ జల విధానం కావాలి



దీక్షలో పాల్గొన్న బసవ మృత్యుంజయ స్వామీజీ

మండ్య: అంతర్రాష్ట్ర నదీ వివాదాల పరిష్కారానికి జాతీయ జల విధానం చక్కని మార్గమని ఈ నేపథ్యంలో తక్షణమే జలనీతి విధానాన్ని అమలు చేయాలని కూడల సంగమ పంచమసాలి పీఠాధ్యక్షుడు శ్రీ బసవ మృత్యుంజయ స్వామీజీ డిమాండ్ చేశారు. నగరంలోని సర్ ఎంవీ విగ్రహం ఎదుట జిల్లా రైతు హితరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలో స్వామీజీ పాల్గొని తన మద్దతు ప్రకటించారు. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని కావేరి జల వివాదాన్ని పరిష్కరించాలని కోరారు.

రైతుల ఆందోళన :

కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయడాన్ని ఖండిస్తూ రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు,. తాలూకాలోని ఇండువాలు, సిద్దయ్యన కొప్పలు, సుండహళ్లి, కిరంగదూరు, మోళే కొప్పలు గ్రామంలోని రైతులు ఎద్దుల బండ్లు, బైక్‌లు, ట్రాక్టర్ల ద్వారా ఊరేగింపుగా నగరంలోని జయచామరాజేంద్ర ఒడయార్ సర్కిల్‌కు చేరుకున్నారు. చౌరస్తాలో మానవహారం నిర్వహించారు.



నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బెళగావి జిల్లాలోని సవదత్తి యల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం ఆలయ ప్రాంగణం వద్ద సందడి



దసరా పండుగ నేపథ్యంలో బెంగళూరు కేఆర్ మార్కెట్‌లో శుక్రవారం సందడి కనిపించింది. ఆయుధ పూజ సమీపిస్తుండటంతో జోరుగా సాగుతున్న పూల విక్రయాలు.

అవినీతిలో కాంగ్రెస్ సర్కార్: బీజేపీ

- పోస్టర్లను విడుదల చేసిన నేతలు



పోస్టర్లను విడుదల చేస్తున్న సదానందగౌడ తదితరులు

యశవంతపుర: ఐటీ అధికారుల దాడుల అనంతరం ప్రతిపక్ష బీజేపీ అధికార కాంగ్రెస్‌పై దాడి మొదలు పెట్టింది. రాహుల్‌గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్, సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, రామయ్య, కెంపణ్ణలు వసూల్ రాజాలంటూ వారి చిత్రాలతో కూడిన పోస్టర్‌ను శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ సీఎం డీవీ సదానందగౌడ, ఎమ్మెల్యే రవి సుబ్రమణ్య, ఎమ్మెల్సీ ఛలవాది నారాయణస్వామి, ఎన్ రవికుమార్ విడుదల చేశారు. డీకే శివకుమార్ ఫొటో కింద కాంట్రాక్టర్ అంబికాపతి ఫొటోను పెట్టారు. దాని కింద ప్రదీప్, ప్రమోద్, ప్రహ్లాద్‌లూటీ కంపెనీ అంటూ రాశారు.

సీబీఐతో విచారణ జరిపించాలి

అనంతరం బీజేపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎటీఎం ప్రభుత్వం కలెక్షన్ వసూళ్లతో నడుస్తుందని ఆరోపించారు. అవినీతి పరుల అడుగు జాడల్లో ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు నడుస్తున్నట్లు విమర్శలు చేశారు. ఐటీ దాడికీ సంబంధించి సీబీఐ విచారణ చేయాలని మాజీ సీఎం డీవీ సదానందగౌడ డిమాండ్ చేశారు. డీకే శివకుమార్ కలెక్షన్లు చేయటానికే బెళగావికి వెళ్లారని ఆరోపించారు. డీసీఎం డీకే శివకుమార్‌పై సీబీఐ విచారణను కోనసాగించాలని డిమాండ్ చేశారు.





సంప్రదాయ దుస్తులు ధరించి టాంగాలో పర్యటిస్తున్న మంత్రి హెచ్‌కే పాటిల్ దంపతులు, రాచనగరిలో టాంగాలలో పర్యాటకుల సవారీ

రాచనగరిలో టాంగాల సందడి

మైసూరు: మైసూరు దసరా మహోత్సవం ఆరో రోజు శుక్రవారం సంప్రదాయ టాంగా సవారి నిర్వహించారు. పురాతన సంప్రదాయ దుస్తులను ధరించిన దంపతులు టాంగాలో కూర్చొని రాజ వీధుల్లో సవారి చేశారు. దంపతుల్లో పురుషులు తెల్లని చొక్కా, పంచె, మైసూరు పేట ధరించారు. మహిళలు చీరలను ధరించారు. రాష్ట్ర మంత్రి హెచ్‌కే పాటిల్ కూడా సంప్రదాయ దుస్తులు ధరించి భార్యతో కలసి టాంగా సవారీ చేశారు. పురాతత్వ శాఖ ఆధ్వర్యంలో నూతన దంపతులకు ఈ టాంగా సవారీని ఏర్పాటు చేశారు.

వేడెక్కుతున్న బెళగావి రాజకీయం

- మళ్లీ తెరపైకి బెళగావి పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్ష పదవి వ్యవహారం
- ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరు



మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, సతీశ్ జార్కిహోళి

బనశంకరి: గత జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణప్రభుత్వం కూలిపోవడానికి కారణమైన బెళగావి పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ పదవిని తమ వర్గీయులకు కట్టబెట్టాలని మహిళా శిశు సంక్షేమశాఖామంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, మరో వైపు ప్రజాపనులశాఖమంత్రి సతీశ్‌జార్కిహోళి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో మంత్రుల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. సంకీర్ణ సర్కార్ హయాంలో తమవర్గానికి చెందిన నేతకు పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్ష పదవి కట్టబెట్టాలని అప్పట్లో బెళగావి గ్రామాంతర ఎమ్మెల్యేగా ఉన్న లక్ష్మీహెబ్బాళ్కర్, గోకాక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి పట్టుబట్టారు. ఆ సమయంలో మంత్రిగా ఉన్న డీకే.శివకుమార్ లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు మద్దతుగా నిలవగా రమేశ్‌జార్కిహోళికి సోదరుడు, మంత్రిగా ఉన్న సతీశ్‌జార్కిహోళి మద్దతు ఇచ్చారు. సోదరుల సవాల్‌కు ఎదురొడ్డి నిలబడిన లక్ష్మీహెబ్బాళ్కర్ చివరికి వారిపై పైచేయి సాధించి తమ మద్దతుదారుడికి పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్ష పదవి దక్కేలా చూశారు. ఈ వివాదం రాజీ ద్వారా పరిష్కారమైనట్లు కనబడినప్పటికీ లక్ష్మీహెబ్బాళ్కర్- రమేశ్‌జార్కిహోళి బ్రదర్స్ మధ్య వర్గపోరు అలాగే కొనసాగి ఆపరేషన్ కమలకు దారితీసి సంకీర్ణప్రభుత్వం కూలిపోవడానికి కారణమైంది. అనంతరం మూడున్నరేళ్ల పాటు కాంగ్రెస్ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. కాగా ఈ ఏడాదిజరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. కానీ పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్ష పదవి విషయంలో ఇద్దరు మంత్రుల మధ్య పోరు మొదలైంది. పైకి ఇద్దరు మంత్రులు కలిసిపనిచేస్తున్నట్లు కనబడినా అధికారుల బదిలీలు, స్థానికంగా పార్టీ కార్యకలాపాల్లో వైరుధ్యం అలాగే ఉంది. లక్ష్మీహెబ్బాళ్కర్‌కు డిప్యూటీసీఎం డీకే.శివకుమార్ ఆశీస్సులు ఉండటంతో జార్కిహోళి కుటుంబానికి తలనొప్పిగా మారింది. మంత్రి వర్గ కూర్పులో కూడా మహిళా ఎమ్మెల్యేలు అందరిని వెనక్కి నెట్టి లక్ష్మీహెబ్బాళ్కర్ మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నతవ్యక్తుల సహకారం ఉండటంతో లక్ష్మీహెబ్బాళ్కర్ పీఎల్‌డీ బ్యాంకుపై పట్టుసాధించాలని భీష్మించుకున్నారు. దీనిపై బహిరంగంగా మాట్లాడలేక రగిలిపోతున్న సతీశ్‌జార్కిహోళి 20 మందికి పైగా ఎమ్మెల్యేలను విహారయాత్రకు తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఓ పక్క కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ-జేడీఎస్ తెరవెనుక ప్రయత్నాలు చేస్తుండగా కాంగ్రెస్‌లో విభేదాలు కొంపముంచే అవకాశం ఉంది. ఈ విషయంపై సీఎం సిద్దరామయ్య తన ఆప్తుల ద్వారా రాజీప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో బయటివారి జోక్యం తగ్గకపోతే రానున్న రోజుల్లో తీవ్రరూపం దాల్చేఅవకాశం ఉంది.

క్లుప్తంగా

లోకాయుక్త మెరుపు దాడులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలోని దావణగెరె, బెళగావి జిల్లాల్లో లోకాయుక్త అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. శుక్రవారం దావణగెరె జిల్లాలో సీఏ సైట్ అమ్మకంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలపై జిల్లాలోని మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో లోకాయుక్త అధికారులు సోదాలు నిర్వహించారు. దావణగెరె నగరాభివృద్ధి శాఖ, మహానగర పాలికె కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయంలో లోకాయుక్త అధికారులు సోదాలు నిర్వహించి కోట్లాది రూపాయల లావాదేవీల రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లాలో డీడీపీఐ బసవరాజ్ రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు వల పన్ని పట్టుకున్నారు.

బాగేవాడి కాలువ రైతుల ధర్నా


ధర్నా చేపట్టిన రైతులు, ప్రజలు

కంప్లి: శ్రీనివాస్ క్యాంప్ వద్ద ఎల్ఎల్‌సీ కాలువ నుంచి బాగేవాడి కాలువకు నీరు పారించే తూముపై రైతులు శుక్రవారం ధర్నా చేశారు. తెక్కలకోటె ఎస్ఐ శాంతమూర్తి, సిరిగేరి ఏఎస్ఐ శ్రీనివాస్, నీరావరి శాఖ ఏఈఈ తిప్పేస్వామి కాలువ వద్దకు చేరుకుని రైతుల గోడును ఆలకించి పరిస్థితిని చక్కదిద్దారు. కాగా ధర్నాలో బాగేవాడి కాలువ ఆయకట్టు పరిధిలోని వీకే క్యాంప్, ఉప్పారహళ్లి, బలకుంది గ్రామాల్లోని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా.. 13 మందికి గాయాలు

హుబ్లీ: తాలూకాలోని పాలె గ్రామం వద్ద జాతీయ రహదారిలో ప్రైవేట్ బస్సు బోల్తా పడగా, 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వీరిలో ఏడుగురిని కిమ్స్ ఆస్పత్రిలో, మిగిలిన వారిని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బస్సు బెంగళూరు నుంచి హుబ్లీ మీదుగా బెళగావికి వెళుతుండగా డ్రైవర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు వాలిపోయింది. దీంతో ప్రయాణికులు గాయపడినా ఎవరికీ ప్రాణాపాయం కాలేదని హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు.

ఉపకాలువకు నీరు వదలరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద ఉపకాలువకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాన్వి తాలూకా రైతులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో 76వ డిస్ట్రిబ్యూటరీ జీనూరు క్యాంప్, పోత్నాళ్, ముద్దంగడి, ఈరలగడ్డ, ఖారదిన్ని గ్రామాల రైతులు మాట్లాడారు. తమ భూములకు నీరందాలంటే కాలువలో నీటి గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. జొన్న, పత్తి, మిరప పంటలకు నష్టం వాటిల్లే అవకాశముందన్నారు. కాలువకు నీరొదిలి రైతులను ఆదుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సంచార జాతులకు ఇళ్లు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పంపాపతి

కంప్లి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గుడార నగరలను నిర్మించి సంచార జాతులకు ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దేవరాజ్ అరసు వేదిక బళ్లారి జిల్లా అధ్యక్షుడు కల్లుకంబ పంపాపతి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ అతిథిగృహంలో సంచార జాతుల విముక్తి సమాఖ్య, బళ్లారి జిల్లా గుడార యువకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై దృష్టి సారించి సానుకూలంగా స్పందించాలని ఆయన ఒత్తిడి చేశారు.

మహేశ్వరికి పతకాల పంట


పతకాలను అందుకున్న మహేశ్వరి

రాయచూరు రూరల్: పల్లెటూరులో పుట్టిన ఓ గ్రామీణ ప్రతిభాన్వితురాలు మైసూరులో ఈనెల 18న జరిగిన 103వ స్నాతకోత్సవంలో 8 బంగారు పతకాలు, మూడు నగదు బహుమతులను అందుకుంది. మైసూరు వర్సిటీలో ఎంఎస్సీ బాటనీ విభాగంలో తాలూకాలోని బుళ్లాపూర్‌కు చెందిన మహేశ్వరి ఐదో తరగతి వరకు గ్రామంలో, ఆరు నుంచి 10వ తరగతి వరకు గాణదాళలో, ఇంటర్, డిగ్రీ రాయచూరు ఎల్‌వీడీ కళాశాలలో చదివి మైసూరు విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ బాటనీ చదువుతూ ఎనిమిదో ర్యాంక్ సాధించింది. భవిష్యత్‌లో ఐఏఎస్ కావాలనే ఆశ ఉందన్నారు.

వ్యాపారుల మాయాజాలం

- ఏపీఎంసీలో వేరుశెనగ రైతులను మోసం చేస్తున్న వ్యాపారులు
- వేరే మార్కెట్లతో పోల్చితే తక్కువకు కొంటున్న వైనం


మార్కెట్‌లో వేరుశెనగను రాసులుగా పోసిన దృశ్యం

సాక్షి బళ్లారి: ఆరుగాలం రైతులు కష్టపడి పంటలను పండిస్తే వ్యాపారులు ఎక్కడో ఒక చోట మోసం చేస్తూ రైతులను నిండా ముంచుతున్న ఉదంతాలు జరుగుతూనే ఉన్నాయి. ఈసారి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మెట్ట ప్రాంతాల్లో, సాగునీటి వసతులు కలిగిన భూముల్లో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కరువు ఛాయలు ఏర్పడడంతో రైతులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వాలు కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించారే కానీ సహాయక చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అష్టకష్టాలతో రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు మాయాజాలంతో రైతులను తీవ్రంగా మోసం చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ వేరుశెనగ కొనుగోళ్లకు మారుపేరు. ఈ మార్కెట్‌కు జిల్లాతో పాటు పొరుగున ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాల వివిధ తాలూకాల రైతులు వేరుశెనగను తీసుకొచ్చి అమ్ముకోవడం పరిపాటి.

క్వింటాల్‌కు రూ.1000 వరకు నష్టం

ఎన్నో ఏళ్లుగా పొరుగు జిల్లాల రైతులు ఈ ఏపీఎంసీ మార్కెట్‌లో వేరుశెనగను విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ వ్యాపారులు వేరుశెనగ రైతులను నిండా ముంచేస్తున్నారు. ప్రధానంగా వేరుశెనగ కొనుగోలు బళ్లారి ఏపీఎంసీతో పాటు చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో పెద్ద ఎత్తున జరుగుతోంది. ఈ రెండు ప్రాంతాల్లోని మార్కెట్లకు బళ్లారి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన రైతులు వేరుశెనగను తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. బళ్లారి, చెళ్లకెరె మార్కెట్లలో వేరుశెనగ కొనుగోళ్లను పరిశీలిస్తే ఒకే నాణ్యతగల వేరుశెనగ రెండు మార్కెట్లలో ఒకే రోజు ఒక క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000ల వరకు తక్కువ ధరకు తీసుకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెళ్లకెరె మార్కెట్లో కంటే బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో ఒక క్వింటాల్‌ను రూ.1000 వరకు తక్కువకు కొనుగోలు చేసినట్లు కళ్యాణదుర్గం నియోజకవర్గ రైతులు వాపోయారు.

సిండికేట్ అవుతున్నా పట్టించుకోని అధికారులు

ఈవిధమైన వ్యాపారం ఏపీఎంసీలో సీజన్ ప్రారంభం నుంచి సాగిస్తూ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యాపారులు అధిక లాభాలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేరుశెనగ క్వింటాల్ ధర రూ.7 వేల నుంచి రూ.8500ల వరకు పలుకుతోంది. అయితే గత్యంతరం లేక కొందరు రైతులు తెలిసో తెలియకో ఏపీఎంసీకి తీసుకొచ్చి విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఏపీఎంసీ ఉన్నతాధికారులు కానీ, పాలకులు కానీ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టలేకపోవడంతో వేరుశెనగ రైతులు క్వింటాల్‌కు రూ.1000ల వరకు నష్టపోవాల్సి వస్తోంది. పంట పండించి మార్కెట్‌కు తెచ్చిన తర్వాత మార్కెట్‌లో వేరుశెనగ ధర గిట్టుబాటు అయ్యేలా ఉన్నా ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆయకట్టుకు అందని నీరు..ఎండుతున్న పైరు


నీటి ప్రవాహం లేని ఎడమ కాలువ


వాడుముఖం పట్టిన పత్తి పంట

- నాలుగు లక్షల హెక్టార్లలో పంట నష్టం
- తుంగభద్ర ఎడమ కాలువ రైతులు డీలా

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు సాగునీరందక పోవడంతో రైతులు డీలా పడ్డారు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో లక్షలాది హెక్టార్లలో పంట నష్టం సంభవించే అవకాశాలున్నాయి. కాలువ పైభాగంలో నీటి గేజ్ నిర్వహణ, నీటి పరిమాణం పెంపుపై అధికారులు తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. ఫలితంగా చివరి ఆయకట్టులో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. కాలువకు నీటి సరఫరాపై గతంలో ముఖ్యమంత్రి యడియూరప్ప సర్కారు అమలు చేసిన ఆదేశాలను అధికారులు సక్రమంగా పాటించనందు వల్లే నేడు ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు వాడుముఖం పట్టాయనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

పంట నష్టం వివరాలు:

సింధనూరు, మస్కి, కవితాళ, మాన్వి ప్రాంతాలలో వరి, పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నారు. దాదాపు రెండు లక్షల హెక్టార్లలో వరి, రాయచూరు, సిరవార తాలూకాల్లో లక్ష హెక్టార్లలో పత్తి, లక్ష హెక్టార్లలో మిరప పంటలు పండిస్తున్నారు. నెలాఖరు వరకు రోజుకు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే పంటలు చేతికందే అవకాశం ఉంది. సరైన వానలు లేక కరువు నెలకొనడంతో పాటు కాలువకు నీటి సామర్థ్యం పెంపు, గేజ్ నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల పంటలు నష్టపోయే ప్రమాదం నెలకొంది. సక్రమంగా నీటిని విడుదల చేస్తే రైతులు కష్టాల నుంచి గట్టెక్కుతారు. గత ఐదు రోజుల నుంచి ఏడో మైలు వద్ద రైతులు నిరవధిక ధర్నాకు ఉపక్రమించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు వచ్చినా రైతుల సమస్య కొలిక్కి రాకపోవడం విడ్డూరంగా ఉంది.

కాంగ్రెస్‌లో చేరేవారి పెద్ద జాబితానే ఉంది

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలో చేరేవారి పెద్ద జాబితానే తమ వద్ద ఉందని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పూర్ణిమా శ్రీనివాస్ పార్టీలో చేరిక కార్యక్రమంలో డీకేశి మాట్లాడారు. తనకు ఈ రోజు ఎంతో సంతోషకరమైన రోజని, పూర్ణిమా పార్టీలోకి రానపుడు, ఆమె భర్త శ్రీనివాస్‌కు వల వేశాను. వేర్వేరు కారణాలతో ఇంతకాలం పార్టీలో చేరలేదు. శుక్రవారం వారు అందరి సమక్షంలో తమ పార్టీలో చేరారు. నేడు కేవలం పూర్ణిమా, శ్రీనివాస్ మాత్రం పార్టీలో చేరటం లేదు. కర్ణాటక రాష్ట్రంలోని అనేక సంఘాల నుంచి వేలాది మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు.

మాజీ కార్పొరేటర్ అరెస్ట్

యశవంతపుర: కాంట్రాక్టర్‌ను కిడ్నాప్ కేసుకు సంబంధించి యశవంతపుర మాజీ కార్పొరేటర్ జీకే వెంకటేశ్‌ను బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. కాంట్రాక్టర్ చంద్రు యశవంతపుర ప్రాంతాల పనులను టెండర్ ద్వారా దక్కించుకున్నారు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ ఆక్రోశం వ్యక్తం చేశారు. నీ ద్వారా నష్టపోయానని, ఆ నష్టాన్ని భరించాలంటూ చంద్రుపై ఒత్తిడి చేసి బెదిరించాడు. రెండు రోజుల క్రితం చంద్రును కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. రూ.3కోట్లకు చెక్కు రాయించుకుని దాడి చేసి వదిలేశాడు. చంద్రు ఫిర్యాదుతో జీకే వెంకటేశ్‌ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

యుద్ధాన్ని నివారించాలి

తుమకూరు: ఇజ్రాయిల్–హమాస్ దేశాల మధ్య దాడి, ప్రతిదాడులను ఖండిస్తూ ప్రగతిపర సంఘాల ఒక్కూట, తుమకూరు జిల్లా శాంతిప్రియకలు, సీపీఐ నాయకులు శుక్రవారం తుమకూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. సి.యతిరాజ్ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల వేలాది మంది పౌరులు, అమాయకులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ సంస్థలు ముందుకు వచ్చి ఈ యుద్ధాన్ని నిలవరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .

కేపీసీసీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిబాబు



బనశంకరి: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్‌సమితి (కేపీసీసీ) ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రవాసాంధ్రుడు జీ.హరిబాబు నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ అధ్యక్షుడు కెప్టెన్ అజయ్‌సింగ్‌యాదవ్ ఉత్తర్వులు జారీచేశారు. తనపై పార్టీ అదిష్టానం నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు హరిబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాటలతో మురిసిన యువత


పాట పాడుతున్న యువ గాయకుడు

మైసూరు: యువ దసరా రెండో రోజూ శాండల్‌వుడ్ గాయకులు రఘు దీక్షిత్, యువ గాయకుడు సంజీత్ హెగ్డే తమ సంగీత గాత్రంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నగరంలోని మహారాజ కాలేజీ మైదానంలో యువ దసరా ఉపసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొని పాటల ఝురిలో తడిసిపోయింది. తొలి రోజు హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ సందడి చేయగా, రెండో రోజు రఘుదీక్షిత్, సంజీత్ సందడి చేశారు. వీరికి తోడు శాండల్‌వుడ్‌లోని పలువురు కళాకారులు మైసూరు యువతను విశేషంగా అలరించారు.

పోలీసుల భోజనంలో పురుగులు



కృష్ణరాజపురం: నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు ఇచ్చిన భోజనంలో పురుగులు కనిపించాయి. పోలీసులకు శుక్రవారం పెరుగన్నం పాకెట్లు ఇచ్చారు. ఒక పాకెట్‌లో పురుగులు కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రతిసారి నాణ్యతలేని భోజనం అందించడంపై అసహనం వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం కూడా పోలీసులకిచ్చిన భోజనంలో ఇలాంటి ఘటనే జరిగింది. దీంతో పోలీసులు భోజనంలో వచ్చిన పురుగులను ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.


పాతకాలం నాటి కార్లను ప్రదర్శనకు ఉంచిన దృశ్యం


ముద్దొస్తున్న పాతకాలం నాటి కారు

వింటేజ్ కార్లు, బైక్‌ల సందడి


పాతకాలం నాటి బైక్‌లు

మైసూరు: మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు రోజురోజుకి జోరందుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఎంజీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం 'ది మైసూరు దసరా వింటేజ్ కార్లు, బైక్‌ల షో అండ్ ర్యాలీ'ని నిర్వహించారు. మైసూరు హెబ్బాళ పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన ఈ ప్రదర్శన, ర్యాలీలో పలు పాతకాలపు కార్లు, బైక్‌లను ప్రదర్శించారు. వీటిని చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు., ర్యాలీలో 1909లో తయరు చేసిన ఫోర్డు కారు, 1935లో బ్రిటిషర్లు తయారు చేసిన మాస్టర్ పీస్ కారుగా పిలిచే రోల్స్‌రాయ్స్ కారు ఇలా పలు కార్లు సందడి చేశాయి. బుల్క్ రోడ్ మాస్టర్ కారు, విల్లీ జీప్, కాడ్‌లీక్, కింగ్స్‌వే కారు, మిరర్ మైనర్, డిస్టో కారు కూడా అందరి దృష్టిని అలరించాయి.

కాలువలో జారి పడి దంపతుల మృతి

మైసూరు: బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదశాత్తు దంపతులు నీటిలో పడి మృతి చెందిన ఘటన నంజనగూడు తాలూకా హరతలెలో జరిగింది. హరతలె గ్రామానికి చెందిన శంకర్, బేబీ దంపతులు మరణించారు. బీచనహళ్లి బలదండ కాలువలో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. అక్కడ కాలు జారి బేబీ కాలువలో పడిపోయింది. ఆమెను రక్షించేందుకు నీటిలో దిగిన శంకర్ కూడా నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలించి మృతదేహాలను వెలికితీశారు. నంజనగూడు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

రైతును కట్టేసి దోపిడీకి యత్నం..

కేరళకు చెందిన ఓ రైతును బంధించి బెదిరించిన ఘటన నంజనగూడు తాలూకా యడహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అరుణ్ అనే వ్యక్తి తన తోటలోని అరటి పంటను విక్రయించాడు. నిత్యం అరటి తోటను కత్తిరిస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న దొంగలు దోపిడీకి స్కెచ్ వేశారు. ముసుగులు వేసుకుని తోటలోకి చొరబడి కేరళ రైతుకు కత్తి చూపించి గన్‌తో డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. అయితే డబ్బులు తన దగ్గర లేవని, యజమాని తీసుకెళ్లాడని రైతు చెప్పాడు. రైతు మాటలు నమ్మని దొంగలు అతని కాళ్లు, చేతులు కట్టేసి షెడ్‌లో డబ్బుల కోసం గాలించి చివరికి వట్టి చేతులతో వెళ్లిపోయారు. హుల్లహళ్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మలబార్ గ్రాండ్ మా హోమ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్



గ్రాండ్‌మా హోమ్

సాక్షి బెంగళూరు: దేశంలోని అతిపెద్ద ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన మలబార్ గోల్డ్ – డైమండ్స్, కర్ణాటకలోని బెంగళూరులో మహిళల కోసం గ్రాండ్‌మా హోమ్‌ను ప్రారంభించింది. ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ హాజరై శుక్రవారం నగరంలోని బనశంకరిలో ఈ కొత్త ప్రాంగణాన్ని ప్రారంభించారు. కుటుంబాలు వదిలేసిన వ్యక్తులు, నిర్లక్ష్యానికి గురైన మహిళలకు ఉచిత వసతి, ఆహారం, వైద్య సహాయాన్ని గ్రాండ్‌మా హోమ్ అందించనుంది. అలాగే సదరు మహిళల భౌతిక, మానసిక సమస్యలకు వైద్యారోగ్య సహకారం అందిస్తుంది. గ్రాండ్‌మా హోమ్ 14,780 చదరపు అడుగుల విస్తీర్ణంలో 104 మంది మహిళలకు వసతి కల్పించే సామర్థ్యంతో సౌకర్యవంతమైన, సురక్షితమైన, పరిశుభ్రమైన జీవన వాతావరణాన్ని కలిగించేలా ఏర్పాటైంది. ఈ హోంలో వృద్ధుల సంరక్షణ కోసం వైద్య బృందం 24 గంటల పాటు తమ సేవలను అందిస్తారు. కార్యక్రమంలో మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్, ఎండీ ఇండియా ఆపరేషన్స్ ఓ.ఆషర్, పునరావాస ట్రస్ట్ డాక్టర్ ఇద్రీస్ చైర్మన్ ధనల్ దయా, ఎమ్మెల్యేలు, ఎన్ఏ హ్యారిస్, ఆర్.అశోక తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు దేహశుద్ధి

తుమకూరు: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని గూడ్స్ షెడ్‌కాలనీలో ఉంటున్న సయ్యద్ (40) అదే కాలనీలో ఉండే ఏడేళ్ల బాలికను బిస్కెట్ ఇస్తానని పిలిచి క్యాత్సంద్ర వద్ద నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. అదే సమయంలో స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం మహిళా పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

అన్నభాగ్య లబ్ధిదారులకు నగదు బదిలీ

బనశంకరి: అన్నభాగ్య పథకం లబ్ధిదారులకు డీబీటీ ద్వారా నగదు బదిలీకి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్.మునియప్ప అధికారులను ఆదేశించారు. శుక్రవారం విధానసౌధలో ఆ శాఖ ప్రగతిపై ఆయన సమీక్ష జరిపారు. బియ్యానికి బదులుగా నగదు అందించడానికి చర్యలు తీసుకోవాలని, సర్వర్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆకలిరహితంగా చేయడమే తమ ధ్యేయమన్నారు. ప్రభుత్వ కార్యదర్శి జీసీ.ప్రకాష్, అధికారి అనితాలక్ష్మీ, ఆహారపౌరసరఫరాలశాఖ మండలి డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

మైసూరు: వంటింటిలోని గిన్నెతో తనయుడు కొట్టగా తండ్రి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటన విరాజపేట సమీపంలోని నాంగాల గ్రామంలో జరిగింది. నాంగాల గ్రామ నివాసి సీకే చిట్టియప్ప (63)కు, కుమారుడు దర్శన్ తమ్మయ్య మధ్య వంట విషయంలో వీ గొడవ జరిగింది. విచక్షణ కోల్పోయిన దర్శన్ తనపక్కనే ఉన్న గిన్నెతో తండ్రిని కొట్టాడు. బలమైన గాయాలు కావడంతో చిట్టియప్ప మృతి చెందాడు. విరాజపేట గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యాపార సంస్థలపై పాలికె దాడులు

బనశంకరి: సిగరెట్ ఇతర ఉత్పత్తులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న దుకాణాలపై పాలికె అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం నగరవ్యాప్తంగా 8 వలయాల్లో 13 వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. 50 దుకాణాలకు నోటీసులు జారీచేశారు. పాలికె ఆరోగ్యకమిషనర్ కేవీ.త్రిలోకేచంద్ర మాట్లాడుతూ రూ.50 వేల జరిమానా వసూలు చేశామన్నారు. బెంగళూరులో వీకెండ్ లో పబ్‌లు, రెస్టారెంట్, హోటల్స్‌లో సందర్శకులు సందడి ఎక్కువగా ఉంటుంది, దీనిపై తనిఖీలు నిర్వహించాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించామన్నారు.

కోలారు వార్తలు...

మినీ ఉద్యోగమేళాలో 71 మందికి కొలువులు


దరఖాస్తుకు క్యూలో నిలిచిన నిరుద్యోగ అభ్యర్థులు

కోలారు: నగరంలోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం మినీ ఉద్యోగ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌశల్య అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఈ మినీ ఉద్యోగమేళాలో 10 కంపెనీలు పాల్గొని 71 మందికి ఉద్యోగాలు కల్పించాయన్నారు. 172 మందికి ఉద్యోగాలను రిజర్వులో ఉంచారని, భవిష్యత్తులో వారికి కూడా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఉద్యోగ మేళాలో 172 మంది పురుషులు, 187 మంది మహిళలు కలిపి మొత్తం 357 మంది పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిలో 32 మంది పురుషులు, 39 మంది మహిళలు ఉన్నారన్నారు. మినీ ఉద్యోగ మేళాలో వేమగల్, కోలారు, వైట్‌ఫీల్డ్, నరసాపురం నుంచి ఎల్ఐసీ, సూపర్ టెక్ ఇంజినీర్స్, టీవీఎస్ ట్రెనింగ్ ఇండియా, భారత్ ఫైనాన్సియల్స్, నేహా అసోసియేట్స్, పార్కో ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలు పాల్గొన్నాయన్నారు. నిరుద్యోగ యువత వాక్ ఇన్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. సహాయక ఉద్యోగాధికారి మునికృష్ణ, శ్వేత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమే సాధనకు సోపానం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: దివ్యాంగుల్లోని ప్రతిభావంతులకు కూడా సరైన అవకాశాలు కల్పిస్తే మరింతగా రాణిస్తారని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ హొసమని తెలిపారు. శుక్రవారం అంతరగంగ విద్యా సంస్థలో దివ్యాంగుల హక్కులపై నిర్వహించిన జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులు కూడా ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ కెఎస్ శంకర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక మండలిని రచించాలన్నారు. ఎన్నికలలో పోటీకి ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ నారాయణస్వామి, ఆరోగ్య శాఖాధికారి శ్రీనాథ్, సీనియర్ న్యాయవాది ధన్‌రాజ్, ముళబాగిలు సార్క్ సంస్థ ప్రముఖుడు మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచరంగి అలంకారం


పంచరంగి అలంకరణలో అమ్మవారు


పూలంగి అలంకరణలో వేణుగోపాల స్వామి

కోలారు: శరన్నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం మూలా నక్షత్రం రోజున హాళెహంచిన కాలనీలోని దుర్గా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పంచరంగి అలంకరణ చేశారు. నగరంలోని కిలారి పేటలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి పూలంగి అలంకరణ చేశారు. శారదా శంకరమఠంలోని శారదా మాత ఆలయంలో అమ్మవారికి సరస్వతి దేవి అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకంతో పాటు వివిధ ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. పిల్లలు తమకు విద్యా బుద్ధులు వచ్చేలా కరుణించాలని అమ్మవారిని మొక్కుకున్నారు.

విద్యార్థులకు ప్రణాళిక అవసరం


మాట్లాడుతున్న నాగేంద్ర ప్రసాద్

కోలారు: విద్యార్థులు కఠోర సాధనతో ప్రణాళికకు అనుగుణంగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా పదో తరగతి నోడల్ అధికారి ఏఎన్ నాగేంద్ర ప్రసాద్ టెన్త్ విద్యార్థులకు సలహా ఇచ్చారు. శుక్రవారం తాలూకాలోని తొరలక్కిలో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాసే విద్యార్థులకు మార్గదర్శన కార్యక్రమంలో మాట్లాడారు. నిరంతర శ్రమతోనే వంద శాతం ఫలితాలు వస్తాయన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. విద్యార్థులు తమ చేతిరాతను మెరుగు పరచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశయాల మేరకు విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరును తేవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

8 గంటల విద్యుత్ కోసం ధర్నా


ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: ప్రభుత్వం లోడ్ షెడ్డింగ్ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపి వేయడాన్ని మానుకుని రైతులకు సక్రమంగా 8 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం పదాధికారులు నగరంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి బెస్కాం ఏఈఈకి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేరి నాగరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీల్లో ఒకటైన ఉచిత విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పంప్‌సెట్లకు 8 గంటల నిరంతర విద్యుత్‌ను అందించాలన్నారు. రాష్ట్ర రైతు సంఘం మాలూరు తాలూకా అధ్యక్షుడు హెచ్‌జీ వెంకటేష్, సుజాత, దీప, మాగొంది రత్నమ్మ, అమరేష్, కెఎస్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ కార్యకర్త ఆత్మహత్య కేసు సీఐడీకి



విలేకరులతో మాట్లాడుతున్న హోం మంత్రి

తుమకూరు: కలబురిగి సింధోళి తాలూకాలో బీజేపీ కార్యకర్త ఆత్మహత్య కేసును సీఐడీ విచారణకు అప్పగిస్తామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడుతూ... మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పేరు చెప్పి బీజేపీ కార్యకర్త శివకుమార పూజారి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సీఐడీ విచారణకు అప్పగిస్తామన్నారు.

శంకరాచార్యుల రచనలు ఆధ్యాత్మికతకు సోపానాలు



లలితా సహస్రనామ పారాయణం

గౌరిబిదనూరు: జగద్గురు ఆది శంకరాచార్యుల వారి రచనలు మానవులు ఆధ్యాత్మికతకు సోపానాల వంటివని సౌందర్యలహరి సంచాలన సమితి ఆశా రవికుమార్ తెలిపారు. గురువారం రాత్రి నగరంలోని వివి పురం శారదా మందిరంలో శరన్నవరాత్రి సందర్భంగా సౌందర్య లహరి సంచాలనా సమితి వారిచే జరిగిన ఆది శంకరాచార్యుల విరచితమైన స్తోత్ర పారాయణాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆది శంకరులు రచించిన గణేశ భుజంగ స్తోత్రం, వేదసార శివస్తుతి, మీనాక్షి స్తోత్రం, కాశీ పంచకం, దక్షిణామూర్తి స్తోత్రం, షట్పది తదితర వాటిని పఠనం చేశారు.

అలరిస్తున్న పుస్తక మేళా

మైసూరు: మైసూరు దసరాలో ఏర్పాటు చేసిన పుస్తక మేళా పాఠకులను, సాహితీవేత్తలను విశేషంగా అలరిస్తోంది. నగరంలోని ఓవల్ మైదానంలో పుస్తక మేళాను నిర్వహిస్తున్నారు. సుమారు 60కి పైగా స్టాళ్లలో పుస్తకాల ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఈ స్టాళ్లలో తక్కువ ధరకే పుస్తకాలను విక్రయిస్తున్నారు. అయితే పుస్తకాలను కొనుగోలు చేసే వారి సంఖ్య మాత్రం తక్కువగా ఉంటోంది.

జైలులో ఖైదీలు యోగా సాధన

మైసూరు: జిల్లా కారాగారంలోని ఖైదీలకు కూడా యోగాసనాలు చేయించడం ద్వారా దసరా వేడుకలను శుక్రవారం నిర్వహించారు,. యోగ దసరా ఉపసమితి ఆధ్వర్యంలో ఖైదీలకు విశిష్ట యోగాభ్యాసనాలు చేయించారు. దసరా నేపథ్యంలో గత నెల రోజుల నుంచి జైలులో యోగా శిక్షణ తరగతులను ఎస్వీవైఎస్ఎస్ సంస్థ అందిస్తోంది. సుమారు 300 మంది రెండు గంటల పాటు యోగా సాధన చేశారు. చామరాజనగర జిల్లా పాలన యంత్రాంగం, ఆయుష్ సంస్థ సభ్యులు, దసరా యోగా ఉప సమితి సభ్యులు యోగా చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

రైఫిల్ షూటింగ్‌లో తుమకూరుకు పతకాల పంట



సాధించిన పతకాలతో క్రీడాకారులు

తుమకూరు: బెంగళూరులోని సాయి షూటింగ్ రేంజిలో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగిన దసరా సీఎం షూటింగ్ పోటీల్లో తుమకూరు క్రీడాకారులు సత్తా చాటి ఒక బంగారు, రెండు వెండి, నాలుగు కాంస్య పతకాలను సాధించారు. పురుషుల విభాగంలో పూర్ణచంద్ర 10 మీటర్ల రైఫిల్ విభాగంలో బంగారు పతకం, 10 మీటర్ల రైఫిల్ విభాగంలో మహిళల్లో తుమకూరుకు చెందిన స్థానిక సుల్తానా కాంస్య పతకం సాధించారు. ధ్యాన్ టీఎం, విజేత శెట్టి 10 మీటర్ల రైఫిల్ మహిళల బృందం రజత పతకం సాధించింది.

గుండెపోటుతో మాజీ ఉపాధ్యక్షుడు మృతి



యల్లప్ప (ఫైల్)

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు కే యల్లప్ప గుండెపోటుతో మృతి చెందారు. కరీం సొన్నేనహళ్లికి చెందిన యల్లప్ప కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో పలు పదవులు అలంకరించారు. తాలూకా పంచాయతీ ఉపాధ్యక్షుడిగా, గ్రామ పంచాయతీ సభ్యుడిగా పలుమార్లు ఎన్నికయ్యారు. దొడ్డ తాలూకాలోని రాజకీయ నాయకులలో యల్లప్ప కూడా ఒకరు. గురువారం రాత్రి యల్లప్పకు గుండెపోటు రావడంతో దొడ్డ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స ఫలించక ఆయన కన్నుమూసారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. యల్లప్ప స్వగ్రామంలోని ఆయన స్థలంలో గురువారం అంత్యక్రియలు జరిగాయి.

సైబర్ దొంగలు... టార్గెట్ సిలికాన్ సిటీ

- కస్టమర్ కేర్, కేఈబీ సిబ్బంది పేరుతో వంచన
- వేలల్లో డబ్బు కోల్పోతున్న జనం
- దేశంలోనే సైబర్ నేరాల్లో కర్ణాటక మూడోస్థానం



పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు

బనశంకరి: టెక్ సిటీలో సైబర్ మోసగాళ్లు అమాయకులను వంచిస్తూనే ఉన్నారు. సైబర్ కేటుగాళ్లకు సిలికాన్ సిటీ టార్గెట్‌గా మారింది, డబ్బు ప్రలోభాల్లో పడి సోషల్ మీడియా, ఆన్‌లైన్ ద్వారా సైబర్ వంచకుల చేతిలో నగదు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకు హెచ్చుమీరుతుంది. దేశంలోనే సైబర్ నేరాల్లో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. సైబర్ వంచనలో ప్రజలు రోజుకు కోటి రూపాయలకు పైగా కోల్పోతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఎస్‌బీఐ కస్టమర్ కేర్ సిబ్బంది, కేఈబీ సిబ్బంది పరిచయం చేసుకుని మీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయిందని మీ పాన్‌కార్డు నెంబరు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వీరి మాటలు నమ్మి సైబర్ వంచకులు పంపిన లింక్ ఓపెన్ చేయగానే అకౌంట్‌లో ఉన్న నగదు ఊడ్చేస్తారు.

ఉత్తరభారత్ వారే :

సైబర్ వంచకులు ఉత్తర భారతదేశానికి చెందిన వారే అధికంగా ఉంటారు. వంచకులు అప్రమత్తంగా ఉంటూ తమ ఆచూకీ లభించకుండా జాగ్రత్తపడతారు. దీంతో పోలీసులు, వంచకుల ఆచూకీ కనిపెట్టడం కష్టతరమౌతుంది. అయినప్పటికీ గత ఏడాది పోలీసులు రూ.116 కోట్లు వంచకుల నుంచి రాబట్టారు. రాజస్థాన్, జార్ఖండ్, హర్యానాతో పాటు బయటి దేశాల్లో మకాం వేసి వంచనకు తెగబడతారు. వంచనకు పాల్పడిన అనంతరం నగదు వేర్వేరు అకౌంట్లకు జమ అవుతుంది. హ్యాక్ చేయడంతో క్షణాల్లో నగదు మరో అకౌంట్‌కు జమ అవుతుంది. దీంతో పోలీసులు వంచకులను ట్రేస్ చేయడం అంతసులభం కాదు.

సైబర్‌క్రైం వివరాలు	
2020	10,378
2021	8,132
2022	12,551
2023	1,325

సైబర్ క్రైం నేరాలు దర్యాప్తు 75 శాతం దర్యాప్తు ప్రక్రియ సాంకేతిక నైపుణ్యంతో కూడుకుని ఉంటుంది. వంచకులు వినియోగించిన మొబైల్ నెంబరు, ఐపీ అడ్రస్, నెట్‌వర్కింగ్, లోకేషన్‌ట్రేస్, బ్యాంకు అకౌంట్లు వివరాలు ఆధారంగా దర్యాప్తు చేపడతారు. కానీ చాలా కేసుల్లో అన్ని రికార్డులు నకిలీగా ఉంటాయి. దీంతో పోలీసులు అసలైన వంచకులు ఆచూకీ కనిపెట్టడం ఆలస్యమౌతుంది.

బెంగళూరు 8 వలయాల్లో సైబర్ ఎకనామిక్ నార్కోటిక్స్ (సీఈఎన్) పోలీసులు పనిచేస్తుండగా వంచనకు గురైన బాధితులు 1930 నెంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు లేదా పోలీస్‌స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.

వంచనకు గురైన బాధితులు సహాయవాణి 1930 కు గంటలోగా ఫిర్యాదు చేస్తే నగదు స్వాధీనం చేసుకోవచ్చు. అంతేగాక ప్రజలు ప్రలోభాలకు గురై అనవసరంగా వ్యక్తిగత సమాచారం ఇవ్వడం, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీతో పాటు బ్యాంకు సమాచారం ఇవ్వడం లింక్‌లపై క్లిక్ చేయడం లాంటి వాటిపై జాగృతం చేస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు.

సరస్వతీదేవిగా బనశంకరి దేవి



సరస్వతీ అలంకారం



అమ్మవారి పూజల్లో కమిటీ అధ్యక్షుడు బసవరాజు

- బనశంకరి ఆలయంలో వేడుకగా శరన్నవరాత్రి పూజలు

బనశంకరి: బనశంకరి సన్నిధిలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి శ్రీసరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకపుర రోడ్డులో వెలసిన బనశంకరీదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవ, ప్రత్యేక పంచామృతాభిషేకం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనంకరీదేవి మూలవిరాట్‌కు సరస్వతి అలంకరణ, శాకంబరీదేవి సరస్వతి అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చకుల బృందం సరస్వతి, ధన్వంతరి హోమం చేపట్టి మధ్యాహ్నం పూర్ణాహుతి, మహామంగళ హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాక సమితి అధ్యక్షుడు బసవరాజ్, ఆలయ ఈఓ లక్ష్మీ, సూపరిండెంట్ శ్రీనివాసమూర్తి, సమితి సభ్యులు హనుమంతరాయప్ప, వెంకటేశ్, చంద్రు తదితరులు పాల్గొన్నారు. మహిళలు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.



పూజకుణిత నృత్యం చేస్తున్న నాగరాజు బృందం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బనశంకరీదేవి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం జయలక్ష్మి బృందంచే హరికథ, నాగరాజు బృందం పూజకుణిత కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

వేడుకగా పుష్పయాగం : దేవీనవరాత్రులు సందర్భంగా శుక్రవారం సాయంత్రం బనశంకరీదేవికి పుష్పయాగం నిర్వహించారు. బనశంకరి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రధాన అర్చకులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో పుష్పయాగం నిర్వహించారు.

కొడుకుతో కలసి భర్త హత్య

మండ్య: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భార్య తన కొడుకు సాయంతో భర్తను హత్య చేసిన ఘటన మద్దూరు తాలూకా చాపురదొడ్డి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఉమేశ్ (46) హత్యకు గురయ్యాడు. భార్య సవిత (45), కుమారుడు శశాంక్ (20)లు కత్తి, కర్రలతో బాది ఉమేశ్‌ను హత్య చేశారు. ఉమేశ్‌ను రక్షించేందుకు వచ్చిన అతని అక్క సరోజమ్మపై కూడా నిందితులిద్దరూ దాడికి యత్నించారు. హత్యకు సంబంధించి బేసగరహళ్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

బాధ్యతలకు సంబంధించి వివాదం :

ఘటన తర్వాత పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మద్దూరు గ్రామీణ ఇన్‌స్పెక్టర్ వెంకటేగౌడ, సిబ్బంది గాలించి బెంగళూరు చామరాజపేటలో ఉన్న నిందితులను అరెస్టు చేశారు. ఉమేశ్, సవితా మధ్య బాధ్యతలకు సంబంధించి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఐదు నెలల క్రితమే సవితా తన కుమారుడు శశాంక్‌తో కలసి ఉమేశ్‌పై దాడి చేసింది. అప్పుడు ఉమేశ్‌కు కాలు విరిగింది. ఈ ఘటనపై బేసగరహళ్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం సవితా కుమారుడుతో కలసి బెంగళూరులో వేరుగా ఉంటోంది. పితృపక్ష ఆచరణ కోసం చాపురదొడ్డిలోని తన భర్త ఇంటికి వచ్చినప్పుడు ఉమేశ్, అతని సోదరి సరోజమ్మ వారిని లోపలికి రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై అర్ధరాత్రి సమయంలో ఉమేశ్, సవితా మధ్య గొడవ జరిగింది. పరిస్థితి విషమించడంతో ఆ స్థలానికి తన కుమారుడు శశాంక్‌ను సవిత రప్పించింది. ఇద్దరు కలసి ఉమేశ్‌పై దాడి చేశారు. తీవ్ర రక్తస్రావంతో ఉమేశ్ అక్కడికక్కడే చనిపోయాడు. 22 ఏళ్ల క్రితం ఉమేశ్‌కు సవితతో వివాహం జరిగింది. దంపతులకు శశాంక్, సౌజన్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సవిత గార్మెంట్స్‌లో పని చేస్తోంది. ఐదేళ్ల నుంచి దంపతుల మధ్య వివాదాలు రాజుకున్నాయి. దీంతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు.

మహిష దసరాకు యత్నం

బనశంకరి: చిక్కమగళూరు నగరంలో మహిష దసరా ఆచరణకు యత్నించిన వందలాదిమంది దళితపర, ప్రగతిపర సంస్థల కార్యకర్తలను చిక్కమగళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నగరంలోని హనుమంతప్ప సర్కిల్ నుంచి ఆజాద్ పార్కు సర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించడానికి సిద్ధం కావడంతో వివిధ సంఘాల కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల చర్యపై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగంపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, దళిత కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఊరేగింపులో మహిషాసుర ఫొటో ప్రదర్శనకు ప్రయత్నించిన కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుజాగ్రత్త చర్యగా 24 వరకు జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధిస్తూ జిల్లా కలెక్టర్ మీనా నాగరాజ్ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్‌ఐ తిట్టాడని వ్యక్తి ఆత్మహత్య

యశవంతపుర: ఓ ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ బహిరంగంగా తిట్టాడని ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా భట్కళలో జరిగింది. భట్కళ తాలూకా హడ్రవళ్లి పట్టణంలోని మణ్కులికి చెందిన మారుతీ నాగప్ప నాయక్(63) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బైక్ ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ బహిరంగంగా దూషించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగప్ప నాయక్ ఆత్మహత్య చేసుకున్నట్లు సోదరుడు సుబ్రాయ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేమ వైఫల్యంతో యువకుడు...

ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ నగర పోలీసుస్టేషన్‌లో జరిగింది. నగర పరిధిలోని కామాజికి చెందిన సచిన్ (24) ప్రేమ వైఫల్యం కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం నుంచి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు గాలించారు. సమీపంలో గుట్టపై సచిన్ శవాన్ని గుర్తించారు. ప్రేమ విఫలం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడ డెత్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పాత సామాన్ల వ్యాపారి హత్య

శివాజీనగర: పాత సామాన్ల వ్యాపారిని కారుతో ఢీకొట్టించి హత్య చేశారు. ఈఘటన పులికేశీనగర పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో అర్ధరాత్రి జరిగింది. ఎస్‌కే గార్డెన్‌కు చెందిన సయ్యద్ అస్గర్ (49) పాత సామానుల వ్యాపారంతో జీవిస్తున్నాడు. మిత్రులను చూడటానికి తన ఇంటి నుంచి పాటరి సర్కిల్ వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో ఆర్థిక లావాదేవీల విషయంలో మిత్రులతో గొడవ జరిగింది. గొడవ తారాస్థాయికి చేరుకోగా నలుగురు కలిసి కారుతో సయ్యద్‌ను ఢీకొట్టించి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సయ్యద్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పులికేశీనగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముద్దేనహళ్లిలో మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకుల బృందం

చిక్కబళ్లాపురం: నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నగరం సమీపంలోని సత్యసాయి గ్రామం ముద్దేనహళ్లిలో మృత్యుంజయ హోమం, యాగ మంటపంలో దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా దుర్గామాత ఆరాధకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విశేష పూజలు, అలంకరణలు



లక్ష్మీదేవి అలంకరణ



శారదా దేవికి ఇంద్రాణి అలంకరణ

గౌరిబిదనూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నగరంలోని వివిధ ఆలయాల్లో మూల విరాట్‌లకు విశేష పూజలు, అలంకరణలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

యశవంతపుర: వివాహేతర సంబంధం కారణంగా భార్యను హత్య చేసిన భర్తతో పాటు ఆమె సోదరులను అరెస్ట్ చేశారు. బెళగావి జిల్లా గోకాక్ పట్టణానికి చెందిన శివలీలా విఠల్ బంగి (32)ని భర్త ఆమె సోదరులు విషయం తెలుసుకొని మందలించారు. ఆమె తన మాటలను వినటంలేదంటూ జనవరి 2020న శివలీలాను హత్య చేసి శవాన్ని లారీలో పెట్టుకుని మూడలగి సమీపంలో పడేశారు. ఇందుకు సంబంధించి శివలీల సోదరి లక్కవ్వ కంబళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారించగా మూడేళ్ల తరువాత కేసును ఛేదించారు. శివలీల పుట్టిన ఊరు మూడలగి తాలూకా జోక్యానట్టి గ్రామంలో పోలీసులు పర్యటించి విచారించగా గ్రామస్థులు కూడా అనుమానం వ్యక్తం చేయటంతో శివలీల భర్తతో పాటు ఇద్దరు సోదరులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.



జాతరలో కళాబృందాల ఊరేగింపు



ఎద్దుల బండిపై మంత్రి చెలువరాయస్వామి

రైతు జాతర

మైసూరు: మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా ఆరో రోజు శుక్రవారం రైతు దసరా ఘనంగా జరిగింది. నగరంలోని కోటె ఆంజనేయ స్వామి దేవస్థానం ఎదుట రైతు దసరా ఊరేగింపును వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి నందికి పూజ చేసి ప్రారంభించారు. ఆ తర్వాత మూగజీవికి ముద్దుపెట్టి అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం నగారా వాయించి ఈ రైతు దసరా ఎద్దుల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం పువ్వులు, తోరణాలతో కలర్‌ఫుల్‌గా అలంకరించిన ఎద్దులు ఊరేగింపుగా సాగాయి. వీటికితోడు జానపద కళాకారులు, నృత్యాలు, సంగీత వాయిద్యాల నడుమ కోలాహలంగా రైతు దసరా సాగింది. వందలాది మంది రైతులు పాల్గొన్నారు. జేకే మైదానంలో ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శనలో వివిధ రకాల వ్యవసాయోత్పత్తులు ప్రదర్శించారు.

హోసూరు వార్తలు..

చైన్‌స్నాచర్ అరెస్ట్

హోసూరు: చైన్ స్నాచర్‌ను హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...రెండు రోజుల క్రితం పళనికి చెందిన సుమతి (52) హోసూరు సమీపంలోని సద్దనపల్లి గ్రామంలో ఉంటున్న కూతురి ఇంటికి బయలుదేరింది. గురువారం సాయంత్రం సిద్దనపల్లి బస్టాప్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తి సుమతి మెడలోని ఐదు పౌన్ల గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి హోసూరు అలసనత్తం ప్రాంతానికి చెందిన శివారెడ్డిని అరెస్ట్ చేసి గొలుసును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

కళాశాల విద్య కీలకం



విద్యార్థి విభాగ సంక్షేమ సంఘాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శరయు

హోసూరు: తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్రిష్ణగిరి జిల్లా జీనూరు వద్ద నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల పరిశోధన సంస్థలో విద్యార్థి విభాగ సంక్షేమ సంఘాన్ని శుక్రవారం కలెక్టర్ శరయు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యా దశలో కళాశాల విద్య కీలకమని, విద్యార్థులు శ్రద్ధతో చదివి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రీడ, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులందజేశారు. అధికార్లు అఖిలరాణి, తమిళ్‌సెల్వన్, గీత, హిందుమతి, విద్య తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

మైసూరు: తేనెటీగలు దాడి చేయడంతో రైతు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా తట్టెకెరె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ (58) మృతి చెందాడు. శుక్రవారం ఉదయం మేకల కోసం గడ్డి కోస్తుండగా హఠాత్తుగా చెట్టుమీద నుంచి వచ్చిన తేనెటీగలు దాడి చేశాయి. సొమ్మసిల్లి పడిపోయిన అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు ఢీ, బైకిస్టు మృతి

కారు–బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హుణసూరు నగరం ఆర్టీఓ కార్యాలయం వద్ద జరిగింది. పిరియా పట్టణ బెట్టదపుర నివాసి అబ్దుల్ జబ్బార్ మైసూరు నుంచి స్వగ్రామానికి వస్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ వాహనాలు

- ప్రారంభించిన మేయర్ ఎస్.ఏ.సత్య



ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డుల్లో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు కొనుగోలు చేసిన 30 ఎలక్ట్రిక్ వాహనాలను మేయర్ ఎస్.ఏ.సత్య శుక్రవారం ప్రారంభించారు. గతంలో జరిగిన సమావేశంలో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. దీంతో ఎల్‌డీ మ్యాన్‌పవర్ సొల్యూషన్ సంస్థ 30 ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసింది. కారక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మండల అధ్యక్షుడు రవి, పారిశుధ్య నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.మాదేశ్వరన్, కార్పొరేటర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని ధర్నా

కెలమంగలం: వేగనిరోధకాలు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ విద్యార్థులు, స్థానికులు శుక్రవారం రాయకోట– క్రిష్ణగిరి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వివరాలు. క్రిష్ణగిరి సమీపంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను కాలన్‌కొటాయ్ గ్రామం వద్ద బస్సునుంచి దించుతుండగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. దీంతో 8 మంది విద్యార్థులు గాయపడ్డారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కాలన్‌కొటాయ్ వద్ద వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నోమార్లు విన్నవించినా అధికారులు స్పందించలేదని మండిపడ్డారు. రాయకోట పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. సమస్యను రహదార్ల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి



పొలంలో శవమై పడి ఉన్న వ్యక్తి

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తిపై ఒంటి ఏనుగు దాడి చేసి చంపేసింది. తళి సమీపంలోని నెల్లుమారు గ్రామానికి చెందిన క్రిష్ణప్ప వ్యవసాయ పొలంలో శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒంటి ఏనుగు దాడి చేయడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు తళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కొత్త బస్టాండు ఏర్పాటుకు నేడు శంకుస్థాపన



బస్టాండ్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

హోసూరు: హోసూరు సమీపంలోని బత్తలపల్లి కాయగూరల మార్కెట్ వద్ద రూ. 30 కోట్లతో కొత్తగా కొత్త బస్టాండు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం జరుగనుంది. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నెహ్రూ, ఆహార భద్రత శాఖ మంత్రి చక్రపాణి హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. పనులు ప్రారంభోత్సవానికి చేపట్టిన ఏర్పాట్లను మేయర్ ఎస్. ఏ.సత్య, కమిషనర్ స్నేహ శుక్రవారం పరిశీలించారు.

ఆలయ ధ్వంసాన్ని నిరసిస్తూ రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా ఉద్దనపల్లిలోని ప్రసిద్ధి పొందిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు శుక్రవారం హోసూరు – రాయకోట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ఉద్దనపల్లి పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించినా ఫలితంలేకపోయింది. దీంతో ఆలయాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని రప్పించి అదే స్థలంలో ఆలయం పునర్నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


● అనుష్క ● సమంత ● రకుల్ ● కృతీ శెట్టి

సినిమా తర్వాత సినిమా... ఒకేసారి రెండు లేక మూడు సినిమాలు చేసే హీరోయిన్లు హఠాత్తుగా కొత్త సినిమా సైన్ చేయకపోతే? 'వాట్ నెక్స్ట్' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆ నాయికలు ఇతర భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ డైరీలో తెలుగు సినిమా లేకపోవడం ఫ్యాన్స్‌ని నిరుత్సాహ పరిచే విషయం. ప్రస్తుతం తెలుగులో సినిమా సైన్ చేయని నాయికల గురించి తెలుసుకుందాం.

వాట్ నెక్ట్స్

గ్యాప్ లేకుండా...

అటు కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ఆకట్టుకున్న అనుష్క జోరు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిందనే చెప్పాలి. ఏడాదికి ఐదారు తెలుగు సినిమాలు చేసిన ఆమె ప్రస్తుతం ఏడాదికి ఒక్క సినిమాతోనే సరిపెట్టుకుంటున్నారు. 2021, 2022లో అయితే అనుష్క కనీసం ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈ ఏడాది నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇక నాన్‌స్టాప్‌గా సినిమాలు చేస్తానని, తెలుగులో గ్యాప్ లేకుండా ప్రాజెక్ట్స్ కమిట్ అవుతానని అన్నారు అనుష్క. ప్రస్తుతం 'కథనార్– ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. అయితే తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయలేదు.

సంవత్సరం విరామం

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న సమంత సంవత్సరం పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మయోసైటిస్' వ్యాధి బారిన పడిన ఆమె కొన్నాళ్ల పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉంటూ చికిత్స తీసుకుని సినిమాలు చేశారు. ఇక సమంత ఫుల్ స్పీడ్‌తో సినిమాలు చేస్తారని ఆశించిన ఆమె అభిమానుల ఆనందం ఆవిరి అయ్యేట్లు ఏడాది పాటు తాను సినిమాలకు గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించారు సమంత. మయోసైటిస్ పూర్తి స్థాయి చికిత్స కోసమే సమంత ఈ బ్రేక్ తీసుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన 'ఖుషి' చిత్రం సెప్టెంబరు 1న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. 'ఖుషి' వంటి హిట్ మూవీ తర్వాత సమంత నటించనున్న తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఇకపోతే హిందీలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, 'చెన్నయ్ స్టోరీస్' (ఇంగ్లీష్–తమిళ్) చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రెండేళ్లు గ్యాప్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు రకుల్ ప్రీత్‌సింగ్. తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తా చాటిన ఈ బ్యూటీ రెండేళ్లుగా ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడం విశేషం. క్రిష్ దర్శకత్వం వహించిన 'కొండపొలం' చిత్రంలో నటించారు రకుల్. 2021 అక్టోబర్ 8న ఆ సినిమా విడుదలైంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు రకుల్. బాలీవుడ్‌కి పరిమితమై వరుసగా హిందీ సినిమాలు చేస్తున్నారామె. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఐ లవ్ యు', 'మేరీ పత్నీ కా రీమేక్' చిత్రాలతో పాటు తమిళంలో 'ఆయలాన్, ఇండియన్ 2' చిత్రాలు చేస్తున్నారు. అయితే రెండేళ్లుగా కనీసం ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడంతో ఆమె ఫ్యాన్స్ నిరుత్సాహపడుతున్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా ఈ బ్యూటీ తెలుగులో తన జోరు చూపిస్తారేమో చూడాలి.

కొత్త సినిమా ఎప్పుడు?

తెలుగు పరిశ్రమలోకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు కృతీ శెట్టి. తొలి సినిమా 'ఉప్పెన '(2021) తో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులను దోచారీ బ్యూటీ. గత ఏడాది (2022) కృతీ శెట్టి నటించిన 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు రిలీజయ్యాయి. ఈ ఏడాది ఆమె నటించిన తెలుగు చిత్రం 'కస్టడీ' ఒక్కటే రిలీజ్ అయింది. ఆ చిత్రం విడుదలై ఆర్నెల్లు దాటినా మరో తెలుగు సినిమా సైన్ చేయలేదు కృతి. తెలుగులో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం మలయాళంలో 'అజయంతే రండం మోషణం', తమిళంలో 'జెనీ' సినిమాలు చేస్తున్నారు. మరి.. కృతీ డైరీలో కొత్త తెలుగు సినిమా చేరేది ఎప్పుడు?

ఈ ఏడాది 'దసరా, భోళా శంకర్' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రాల తర్వాత మరో తెలుగు సినిమా అంగీకరించని కీర్తి తమిళంలో నాలుగు సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించనున్న తదుపరి తెలుగు సినిమా ఏంటి? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే విధంగా గత ఏడాది విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత మరో తెలుగు సినిమా ఒప్పుకోలేదు పూజా హెగ్డే. మహేశ్‌బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా ఎంపికైనా ఎందుకనో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారీ బ్యూటీ. అలాగే 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నభా నటేశ్ ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాలు చేశారు. అయితే 'మాస్ట్రో' (2021) తర్వాత ఇప్పటివరకూ ఆమె మరో తెలుగు సినిమాపై ఎలాంటి సమాచారం లేదు. అదే విధంగా మెహరీన్, నిధీ అగర్వాల్, అనూ ఇమ్మాన్యుయేల్ వంటి హీరోయిన్ల జోరు కూడా తెలుగులో తగ్గింది. మెహరీన్ ఈ ఏడాది 'స్పార్క్' (తెలుగు–తమిళ్) లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆమె నటించే తెలుగు సినిమాపై క్లారిటీ లేదు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో రిలీజైన 'రావణాసుర' చిత్రం తర్వాత అనూ ఇమ్మాన్యుయేల్ ఏ తెలుగు సినిమాలోనూ నటించడం లేదు. అలాగే నిధీ అగర్వాల్ చేతిలోనూ 'హరి హర వీరమల్లు' మినహా మరో తెలుగు సినిమా లేదు. ఈ సినిమా ఎప్పుడో ఒప్పుకున్నారామె. అయితే షూటింగ్ ఆలస్యం అవుతోంది. ఈ చిత్రం తర్వాత వేరే ఏ తెలుగు సినిమా కూడా ఆమె కమిట్ కాలేదు.


● కీర్తీ సురేశ్ ● పూజా హెగ్డే ● నభా నటేశ్ ● నిధీ అగర్వాల్ ● మెహరీన్ ● అనూ ఇమ్మాన్యుయేల్


● అశోక్ వర్ధన్, సునీల్ బలుసు, విజయశాంతి, కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్ చిలుకూరి

కొత్త సినిమా షురూ

కల్యాణ్ రామ్ హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మురళీ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, విజయశాంతి క్లాప్ కొట్టారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ''భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న చిత్రమిది. కల్యాణ్ రామ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే ఇతర నటీనటులు, పూర్తి వివరాలను తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సి. రామ్ ప్రసాద్.

అనుకున్నవన్నీ జరగవు


● 'అల్లరి' నరేశ్, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భరత్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన సందీప్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది'' అన్నారు. జి. సందీప్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''నరేశ్‌గారు క్రైమ్, కామెడీ జానర్ చిత్రాలు ఎన్నో చేశారు. మా టైటిల్ లాంచ్ చేయడానికి ఆయనే కరెక్ట్ అనిపించింది'' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీవీ నవీన్.

బేబి కాంబో రిపీట్


● ఆనంద్, వైష్ణవీ చైతన్య

'బేబి' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. 'బేబి' చిత్ర దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నంబూరి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.

మేమొస్తే తొలి కేసు.. ఇంగ్లిష్ మీడియంపైనే

సర్కారు స్కూళ్లలో టోఫెల్, ఐబీ విధానంపైనా కేసులు పెడతాం: పవన్



- ఈ స్కామ్ చేసిన అందరినీ జైలుకు పంపించాలి
- యాక్సెంట్ కోసం వేల కోట్లా?.. యూట్యూబ్ వీడియోలు చాలు
- మంచి ఇంగ్లిష్ మాట్లాడని బొత్స మంత్రి ఎలా అయ్యారు?
- మన సీఎం కూడా గొప్ప యాక్సెంట్ ఏమీ మాట్లాడరు
- ఆంగ్లంతో అద్భుతాలే నిజమైతే అమెరికా, బ్రిటన్‌లో పేదరికమే ఉండకూడదు
- ముఖ్యమంత్రి పదవి చేపట్టే అంశంలో నేనెప్పుడూ విముఖత చూపలేదు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్కూళ్లలో పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువులను అడ్డుకుంటూ న్యాయస్థానాలను ఆశ్రయించిన పెత్తందారులకు ఎదురు దెబ్బలు తగలడం, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకడంతో గత్యంతరం లేక వెనక్కి తగ్గారు. సర్కారు స్కూళ్లను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్ది కార్పొరేట్‌కు దీటుగా మార్చడాన్ని చంద్రబాబు–రామోజీ ద్వయం మొదటి నుంచి అడ్డుకుంటుండగా తాజాగా వారి పార్టనర్ పేద పిల్లలపై తన అక్కసును చాటుకున్నారు. ఎన్నికల అనంతరం జనసేన–టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాము పెట్టే మొదటి కేసు ఇంగ్లిష్ మీడియం విద్య, ప్రభుత్వ పాఠశాలల్లో టోఫెల్ శిక్షణ, ఐబీ విధానంపైనే అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే కానీ ఎదగలేమంటూ ఈ ప్రభుత్వం ఓ తప్పుడు భావనను సృష్టిస్తోందని, అవగాహన లేమితో చేస్తున్నారో? లేక ఇందులో స్కామ్ ఉందో తెలియడం లేదని వ్యాఖ్యానించారు. 'ఈ స్కామ్ చేసిన అందరినీ జైలుకు పంపించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మేం వేసే మొదటి కేసు ఇదే అవుద్ది. వీటిలో కచ్చితంగా స్కామ్ జరుగుతోందనే బలమైన అనుమానాలున్నాయి. మంత్రి బొత్స సత్యనారాయణ మాపై వ్యంగ్యంగా మాట్లాడటం కాకుండా మేం చెప్పిన దాంట్లో సదుద్దేశాన్ని చూడాలి' అని పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌తో కలసి పార్టీ నేతలతో, మీడియా సమావేశాల్లో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన వివరాలు ...

ఐదో తరగతి పిల్లలకు టోఫెల్ ఎందుకు?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చాలా అవకతవకలు చేసుకుంటూ వెళ్లారు. ప్రత్యేకించి విద్యార్థులను పూర్తిగా గందరగోళ పరిచే కార్యక్రమాలు చేస్తున్నారు. ఇంగ్లిషు ఎందుకని అడుగుతుంటే యాక్సెంట్ కోసం అని చెబుతున్నారు. యాక్సెంట్ కోసమే అయితే ఇన్ని వేల కోట్లు ఖర్చు అవసరం లేదు. యూట్యూబ్‌లో బోలెడన్నీ ఫ్రీ కోర్సులున్నాయి. అమెరికన్ యాక్సెంట్, బ్రిటిష్ యాక్సెంట్ అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియం విద్యకు సంబంధించి మేం మొదటి నుంచి సలహాలిస్తున్నా ప్రభుత్వం మమ్మల్ని వ్యతిరేకులుగా చిత్రీకరిస్తోంది. యూనివర్సిటీ, కాలేజీ విద్యార్థులకు టోఫెల్ అవసరం. ఐదో తరగతి పిల్లలకు ఎందుకు? ఆ లాజిక్ ఏమిటీ? మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాట్లాడే ఇంగ్లిష్ అందరం విన్నాం. మంత్రి బొత్స సత్యనారాయణ మంచి ఇంగ్లిష్ ఏమీ మాట్లాడరే! ఆయన ఎలా మంత్రి అయ్యారు? మన ముఖ్యమంత్రి కూడా గొప్ప యాక్సెంట్ ఏమీ మాట్లాడరు. ఇంగ్లిష్ మాట్లాడుతారు కానీ అమెరికా, బ్రిటిష్ యాక్సెంట్‌లో ఏమీ మాట్లాడరు. ఇంగ్లిష్ నేర్చుకుంటే అద్భుతాలు జరుగుతాయనుకుంటే అమెరికా, బ్రిటన్‌లో పేదరికమే ఉండకూడదు. టీడీపీతో కలసి వెళ్లే అంశంలో ఏవైనా చిన్న ఇబ్బందులున్నా సరి చేసుకొని ముందుకు వెళతాం. ముఖ్యమంత్రి పదవి చేపట్టే అంశంలో నేను ఎప్పుడూ విముఖత చూపలేదు. అయితే ఈరోజు జనసేన పార్టీకి ముఖ్యమంత్రి పదవి కంటే ప్రజల భవిష్యత్ ముఖ్యం.

పేద పిల్లల విద్యపై విషమెందుకు?



- పేద పిల్లలు గొప్పగా ఎదగడం కొందరికి నచ్చడం లేదు
- పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నదే వైఎస్ జగన్ ప్రభుత్వ లక్ష్యం
- అందుకే ఐబీ, టోఫెల్ అమలును వివాదం చేస్తున్నారు
- ఐబీ సిలబస్ అమలు ఇంకా విధివిధానాల దశలోనే ఉంది
- అయినా ఏదో జరిగిపోయినట్లు తప్పుడు ప్రచారం
- విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేందుకే టోఫెల్ శిక్షణ
- సెలబ్రిటీ పార్టీ ఆరోపణలు చేస్తే.. ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది
- ఎవరెన్ని కుట్రలు పన్నినా పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్యనందిస్తాం
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదింటి పిల్లలకు మంచి జరుగుతుంటే కొందరు ఓర్వలేక, విషం కక్కుతున్నారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తే పేద పిల్లలు గొప్పగా ఎదుగుతారని, ఇది ఇష్టం లేకే కొందరు దిగజారి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంటర్నేషనల్ బకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలుపై పచ్చ పత్రిక కథనాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలు విధివిధానాల రూపకల్పనపై ఒప్పందం జరిగితే, అదేదో తప్పు చేసినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. అందులో భాగంగా బైజూస్ కంటెంట్‌తో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, తరగతి గదుల్లో అత్యాధునిక ఐఎఫ్‌పీ స్క్రీన్లతో బోధనను డిజిటలైజ్ చేశామన్నారు. ఇప్పుడు ఆ విద్యార్థులు అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడేలా టోఫెల్ శిక్షణ కూడా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేందుకు ఇస్తున్న టోఫెల్ శిక్షణను ఎలా తప్పుబడతారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలుకు చర్యలు ప్రారంభించామన్నారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఏటా ఒక తరగతి పెంచాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు మార్గదర్శకాల రూపకల్పనపై ఒప్పందం జరిగితే.. ఏకాయెకిన సిలబస్ అమలు చేస్తున్నామని, అందుకోసం వేల కోట్ల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఐబీ సిలబస్ అమలు ప్రాథమిక స్థాయిలో ఉందని, ఇప్పటివరకు ఎలాంటి నిధులూ ఖర్చు చేయలేదని చెప్పారు. ఇవన్నీ సిలబస్ అమలు సమయంలో వచ్చే అంశాలన్నారు. ఐబీ సిలబస్ అమలు 12 ఏళ్ల దీర్ఘకాలిక ప్రక్రియ అని తెలిపారు. ఐబీ సిలబస్ అమలుకు ఢిల్లీ, మహారాష్ట్ర, హరియాణా ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాయని గుర్తుచేశారు. మారుతున్న ప్రపంచ పోకడలకు అనుగుణంగా మన విద్యార్థులు ప్రగతి సాధించకపోతే వెనుకబడిపోతారని, వారిని ఉన్నతంగా నిలపడమే తమ ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. సామాన్య కుటుంబాల్లోని విద్యార్థులకు మంచి జరుగుతుంటే సెలబ్రిటీ పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, వారికి ఎల్లో మీడియా వంతపాడుతోందని మంత్రి విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ ప్రభుత్వ లక్ష్యం మారదని, పేద పిల్లలకు అంతర్జాతీయ విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దుతామని మంత్రి బొత్స తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, ఏఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

స్కిల్ కుంభకోణం వివరాలు బహిర్గతం చేయకుండా ఆదేశాలివ్వండి

- ఈ కేసు, ఇతర కేసుల గురించిన వివరాలు చెప్పకుండా చూడండి
- కేసు వివరాలు బహిర్గతం చేయడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది
- సమావేశాలు పెట్టిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సంజయ్‌పై చర్యలకు ఆదేశించండి
- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో వాదనలు వినిపిస్తున్న న్యాయవాదులను, దర్యాప్తు చేస్తున్న అధికారులను లక్ష్యంగా చేసుకుంటూ భౌతిక దాడులకు, తీవ్ర ఆరోపణలకు దిగిన తెలుగుదేశం పార్టీ వర్గాలు... ఇప్పుడు మరో అడుగు ముందుకు వేశాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబుకు ఎలాంటి ఊరట రాకుండా న్యాయస్థానాల్లో గట్టిగా వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని, సీఐడీ చీఫ్ సంజయ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. అందులో భాగంగా స్కిల్ కుంభకోణం గురించిన వాస్తవాలను పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు వివరించేందుకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఎన్.సంజయ్‌లపై ఆ వర్గాలు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశాయి. స్కిల్ కుంభకోణం కేసు లేదా ఇతర ఏ కేసుకు సంబంధించిన సమాచారాన్ని కూడా బహిర్గతం చేయకుండా, ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా సుధాకర్‌రెడ్డి, సంజయ్‌ను ఆదేశించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పత్రికా సమావేశాలు పెట్టడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా వారిద్దరిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోర్టును కోరారు. అంతేకాక సుధాకర్‌రెడ్డి, సంజయ్ నిర్వహించిన సమావేశంపై విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. అలాగే పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సంజయ్‌ను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. సమావేశాలు పెడుతూ, హోటళ్లలో ఉంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని సత్యనారాయణ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సెంట్రల్ సివిల్ సర్వెంట్ రూల్స్‌కు విరుద్ధంగా వీరు వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు వివరాలను రహస్యంగా ఉంచాల్సింది పోయి సమావేశాలు పెట్టి బహిర్గతం చేయడం నైతిక విలువలకు విరుద్ధమన్నారు. చంద్రబాబుతో పాటు ఇతర నిందితుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడుతూ, స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని వివరించారు. స్కిల్ కేసులో నిర్వహించిన సమావేశాల కోసం ఖర్చు చేసిన మొత్తాన్ని సుధాకర్‌రెడ్డి, సంజయ్ నుంచి వసూలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సత్యనారాయణ తన పిటిషన్‌లో కోర్టును కోరారు.

చంద్రబాబుకు సుప్రీంలో నో రిలీఫ్

- ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ 9కి వాయిదా
- ఈలోగానే స్కిల్ స్కామ్ కేసులో తీర్పు వెలువరిస్తామన్న కోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోరుతూ మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నవంబరు 9వ తేదీకి వాయిదా వేసింది. శుక్రవారం ఈ పిటిషన్ జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం వద్దకు రాగా చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. మొత్తంగా మూడు ఎఫ్ఐఆర్‌లు దాఖలు కాగా ఒకటి తీర్పు రిజర్వు అయిందని నివేదించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తీర్పు వెలువడే వరకు ఈ కేసులో వేచి చూద్దామా? అని జస్టిస్ బోస్ ప్రశ్నించగా, ఆ విషయాన్ని ధర్మాసనానికే వదిలేస్తున్నట్లు లూథ్రా బదులిచ్చారు. అయితే, చంద్రబాబుకు మధ్యంతర రక్షణ కొనసాగించాలని లేదంటే ఈ పిటిషన్‌కు కాలపరిమితి ముగిసిపోతుందన్నారు. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ జోక్యం చేసుకుంటూ ఒక వ్యక్తి ఒకసారి కస్టడీలో ఉన్నప్పుడు మరోసారి అరెస్టు ఉత్పన్నం కాదని, జ్యుడీషియల్ కస్టడీ కొనసాగుతుందని తెలిపారు. ఇదే అంశాన్ని కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. స్కిల్ కేసులో తీర్పు కోసం వేచి చూస్తున్నామన్నారు. చంద్రబాబు కస్టడీలో ఉన్నందున ప్రశ్నించుకోవచ్చని జస్టిస్ బోస్ పేర్కొనగా, ఇంటరాగేషన్ చేయాలంటే కోర్టు అనుమతి అవసరమని, సెక్షన్ 267 కింద వారెంటు జారీ చేశామని రంజిత్ కుమార్ తెలిపారు. చంద్రబాబును అరెస్టు చేసిన తర్వాతే పోలీసు కస్టడీని కోరగలమన్నారు. ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకుంటూ ఇదంతా అబద్ధమని, చట్టాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపణలు చేశారు. సెప్టెంబరు 9న కస్టడీలో తీసుకున్న నాటి నుంచి చంద్రబాబును ఏ ప్రశ్నా అడగలేదన్నారు. ఈ సమయంలో జస్టిస్ బోస్ జోక్యం చేసుకుంటూ ముందస్తు బెయిలుపై నవంబరు 8న విచారిస్తామని తొలుత ప్రకటించారు. అయితే విచారణను నవంబరు 9కి వాయిదా వేయాలని సిద్ధార్థ లూథ్రా అభ్యర్థించడంతో న్యాయస్థానం అందుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై తొలుత తీర్పు వెలువరిస్తామని, తర్వాత ఈ అంశాన్ని పరిగణిస్తామని ధర్మాసనం పేర్కొంది. అప్పటి వరకు చంద్రబాబు అరెస్టు ఉండదని తెలిపింది. కాగా, ఈ నెల 29వ తేదీ వరకు సుప్రీంకోర్టుకు సెలవులు కావడంతో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తీర్పు ఆ తర్వాతే వెలువడే అవకాశం ఉంది.

చంద్రబాబుకు 25 వరకు రోజుకు రెండు లీగల్ ములాఖత్‌లు

విజయవాడ ఏసీబీ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుపై వివిధ కోర్టుల్లో పలు కేసులు విచారణలో ఉన్నందున ఆయనకు ఈ నెల 25 వరకు రోజుకు రెండు లీగల్ ములాఖత్‌లకు అవకాశం ఇవ్వాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. చంద్రబాబుకు రోజుకు మూడు లీగల్ ములాఖత్‌లకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం శుక్రవారం విచారించింది. మొదట ప్రతివాదులను చేర్చకుండా దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. సరైన ఫార్మాట్‌లో పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. దాంతో చంద్రబాబు తరపు న్యాయవాదులు శుక్రవారం సాయంత్రం సరైన ఫార్మాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణ వరకు అంటే ఈ నెల 25 వరకు చంద్రబాబుకు రోజుకు రెండు ములాఖత్‌లు ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ న్యాయవాదులను ఆదేశించింది.

ఫైబర్‌నెట్ కేసులో పీటీ వారెంట్ కేసు 10కి వాయిదా

ఫైబర్‌నెట్ టెండర్ల కుంభకోణంలో నిందితుడు చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం నవంబర్ 10కి వాయిదా వేసింది. స్కిల్ స్కామ్‌లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన్ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ గతంలోనే సీఐడీ పీటీ వారెంట్‌ను దాఖలు చేసింది. కాగా, ఫైబర్ నెట్ కేసుపై చంద్రబాబు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు నవంబర్ 9న విచారించనుంది. విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో శుక్రవారం విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు ఈ విషయాన్ని తెలుపుతూ మెమో దాఖలు చేశారు. దీంతో న్యాయస్థానం ఈ కేసును నవంబర్ 10కి వాయిదా వేసింది.

కాల్ డేటా పిటిషన్‌పై విచారణ 26కు వాయిదా

స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసిన సిట్ అధికారుల కాల్ డేటాను ఇవ్వాలన్న ఆయన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 26కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ న్యాయవాదులను న్యాయమూర్తి ఆదేశించారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని సీఐడీ న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరడంతో ఆ మేరకు వాయిదా వేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	232	65,398
నిఫ్టీ ▽	82	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,063	▽ 123
డోజోన్స్	33,308	▽ 106
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
షాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	60,250
బంగారం (22 క్యారెట్)	57,380
వెండి (కేజీ)	77,550

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.44	102.75
€	యూరో	ఎస్‌బీఐ	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.70	61.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.24	12.31

తాన్లా లాభం 29% జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాన్లా ప్లాట్‌ఫామ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 29 శాతం ఎగసి రూ.143 కోట్లు సాధించింది. ఈపీఎస్ రూ.8.14 నుంచి రూ.10.61లకు చేరింది. ఎబిటా 41 శాతం అధికమై రూ.197 కోట్లను తాకింది. ఎబిటా మార్జిన్ 312 బేసిస్ పాయింట్లు పెరిగింది. టర్నోవర్ 19 శాతం దూసుకెళ్లి రూ.1,009 కోట్లకు చేరింది. తాన్లా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో శుక్రవారం 4.21 శాతం పెరిగి రూ.1,067.50 వద్ద స్థిరపడింది.

లారస్ ల్యాబ్స్ లాభం తగ్గింది

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లారస్ ల్యాబ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 84 శాతం తగ్గి రూ.37 కోట్లకు చేరింది. ఎబిటా 58 శాతం క్షీణించి రూ.188 కోట్లకు పడిపోయింది.



ఎబిటా మార్జిన్ 28.5 నుంచి 15.3 శాతంగా ఉంది. టర్నోవర్ 22.3 శాతం తగ్గి రూ.1,224 కోట్లు నమోదైంది. ఒక్కో షేరుకు 40 పైసలు మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న ప్రతిపాదనకు కంపెనీ ఆమోదం తెలిపింది. ఫలితాల నేపథ్యంలో లారస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో శుక్రవారం 0.95 శాతం అధికమై రూ.399.65 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-2-2023	
విశాఖ	540-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	528-00
విజయవాడ	528-00
రిటైల్ ధర (డజను)	72.00
20-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

క్యూ2లో రూ. 1,729 కోట్లు

న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 35 శాతంపైగా క్షీణించి రూ. 1,729 కోట్లకు పరిమితమైంది. ఆదాయం నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,680 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,703 కోట్ల నుంచి రూ. 7,014 కోట్లకు వెనకడుగు వేసింది. ఈ కాలంలో మైనెడ్ మెటల్ ఉత్పత్తి 1.4 శాతం క్షీణించి 2,52,000 టన్నులకు పరిమితం కాగా.. రిఫైన్డ్ మెటల్ తయారీ సైతం 2 శాతం తగ్గి 2,41,000 టన్నులకు చేరింది. సమీకృత జింక్ ఉత్పత్తి 2.3 శాతం నీరసించి 1,85,000 టన్నులను తాకింది. శుద్ధిచేసిన లెడ్ ఉత్పత్తి ఫ్లాట్‌గా 57,000 టన్నులుగా నమోదైంది. సెరెంటికా రెనెవబుల్స్ ఇండియాలో కంపెనీకిగల 26 శాతం వాటా



తనఖాకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. రూ. 2,648 కోట్ల క్యాష్ ఫ్లో సాధించినట్లు తెలియజేసింది. హింద్ జింక్‌లో వేదాంతాకు 64.9 శాతం, ప్రభుత్వానికి 29.5 శాతం చొప్పున వాటా ఉంది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2% నీరసించి రూ. 309 వద్ద ముగిసింది.

భవిష్యత్ తరాలపై రుణభారం మోపం..

- ద్రవ్య లోటు కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ద్రవ్య లోటును కట్టడి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భవిష్యత్ తరాలపై రుణాల భారం మోపకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకుంటోందని ఆమె వివరించారు. కౌటిల్య ఆర్థిక సదస్సు 2023లో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ప్రభుత్వ రుణభారాన్ని తగ్గించుకునేందుకు తోడ్పడే చర్యలన్నింటినీ పరిశీలిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 'దేశ స్థూల ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశాలు, అలాగే ద్రవ్య నిర్వహణపరమైన బాధ్యతల గురించి, నేడు తీసుకునే నిర్ణయాల ప్రభావం భవిష్యత్ తరాలపై ఎలా ఉంటుందనే అంశం గురించి ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉంది. తదనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నాం'



అని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇతర దేశాలతో పోలిస్తే ప్రభుత్వ రుణభారం మరీ ఎక్కువగా లేకపోయినప్పటికీ, దాన్ని కూడా తగ్గించుకునే క్రమంలో మిగతా దేశాలు ఎలాంటి ప్రయోగాలు చేస్తున్నాయనేది పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. డిజిటల్ ఎకానమీ ద్వారా దేశీయంగా మరింత పారదర్శకత పెరుగుతోందని మంత్రి చెప్పారు. అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి తేవడంలో జన్ ధన్ ఖాతాలు కీలక సాధనాలుగా మారాయని వివరించారు. 2014లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు బోలెడన్ని సందేహాలు వ్యక్తమయ్యాయని, ఆ ఖాతాల్లో పైసా కూడా ఉండకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులకు నిర్వహణపరంగా భారమవుతాయనే విమర్శలు వచ్చాయని ఆమె చెప్పారు. అయితే, నేడు జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం రూ. 2 లక్షల కోట్ల పైగా బ్యాలెన్స్ ఉందని మంత్రి తెలిపారు. కోవిడ్ పరిస్థితుల్లో నిరుపేదలు ఈ ఖాతాల ద్వారానే ప్రభుత్వం నుంచి నిధులు పొందగలిగారని వివరించారు.

'ఉగ్ర' ముప్పును కూడా పరిగణనలోకి తీసుకున్నాకే పెట్టుబడులు..

పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు అంతర్జాతీయంగా ఉగ్రవాద ముప్పు ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వ్యాపారవర్గాలకు నిర్మలా సీతారామన్ సూచించారు. ఉగ్రవాదం ప్రస్తుతం యావత్ ప్రపంచంపైనా ప్రభావం చూపుతోందని, ఏ ఒక్క ప్రాంతమూ మినహాయింపుగా లేదని ఆమె పేర్కొన్నారు. వ్యాపారపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో భారీ స్థాయి రిస్కులు నెలకొన్నప్పుడు పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని మంత్రి చెప్పారు.

మూడో రోజూ నష్టాలే

- ఎఫ్‌ఎంసీజీ, ఇంధన షేర్లలో భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 232 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. బలహీన అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం కొనసాగింది. దేశీయంగా ఇటీవల వెలువడిన కీలక కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరిచాయి. క్రూడాయిల్ ధరలు, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం కూడా ఒత్తిడిని పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 232 పాయింట్లు పతనమై 65,398 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 19,543 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ట్రెండ్‌కు అనుగుణంగా సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో బలహీనంగా కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 321 పాయింట్లు క్షీణించి 65,309 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు పతనమై 19,519 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ఇంధన, వినిమయ, మెటల్, టెలికం, ఎఫ్‌ఎంసీజీ, కమోడిటీ షేర్లలో భారీగా అమ్మకాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 1.02%,



0.76% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 456 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.9 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 885 పాయింట్లు, నిఫ్టీ 208 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

- సెప్టెంబర్ క్వార్టర్‌లో మార్జిన్లు క్షీణించడంతో హిందుస్థాన్ యూనిలివర్(హెచ్‌యూఎల్) షేరు 2% నష్టపోయి రూ.2,495 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో రెండున్నరశాతం పతనమైన రూ. 2,485 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు పతనంతో కంపెనీకి రూ.12,418 కోట్ల నష్టం వాటిల్లింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.86 లక్షల కోట్లుగా నమోదైంది.
- ఆశించిన స్థాయిలో క్యూ2 ఆర్థిక ఫలితాలు నమోదుకాకపోవడం ఐటీసీ షేరు 3% క్షీణించి రూ.438 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.15,027 కోట్లు తగ్గి రూ.5.47 లక్షల కోట్లుగా నమోదైంది.
- క్యాబ్ అగ్రిగేటర్లు, డెలివరీ సర్వీసు సంస్థలకు విద్యుత్ వాహనాల విధానానికి ఢిల్లీ ప్రభుత్వం అనుమతినివ్వడం ఇంద్రప్రస్థ గ్యాస్ కంపెనీ షేరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఫలితంగా బీఎస్‌ఈలో 12% నష్టపోయి రూ.403 వద్ద స్థిరపడింది. పలు రేటింగ్ సంస్థలు ఈ షేరు కొనుగోలు టార్గెట్ ధరను తగ్గాయి.
- చివరి రోజు నాటికి ఐఆర్‌ఎం ఎనర్జీ ఐపీఓకు 27.05 రెట్ల స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ 76.24 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 20.62 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర విభాగం 48.34 రెట్లు, క్యూఐబీ కోటా 44.73 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 9.29 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రెండు ఎక్స్ఛేంజీలలో అక్టోబర్ 31న షేర్లు లిస్ట్ కానున్నాయి

రూ. 66 వేల కోట్లతో సెమీకాన్ పరిశోధన కేంద్రం

కేంద్రానికి నిపుణుల కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ: దేశీయంగా సెమీకండక్టర్ల విభాగానికి మరింత ఊతమిచ్చే దిశగా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రానికి నిపుణుల కమిటీ సూచించింది. ఇందుకు ప్రాథమికంగా వచ్చే అయిదేళ్లలో 8 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,500 కోట్లు) వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి



రాజీవ్ చంద్రశేఖర్‌కు కమిటీ ఈ మేరకు ఓ నివేదికను సమర్పించింది. ప్రతిపాదిత భారత్ సెమీకండక్టర్ రీసెర్చ్ సెంటర్ వచ్చే ఏడాది నుంచి రూపుదిద్దుకోగలదని మంత్రి తెలిపారు.

ఘనంగా ఆర్.ఎస్.బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



హైదరాబాద్: ఆర్.ఎస్.బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు తిరుపతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నటి అనుపమ పరమేశ్వరన్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా యాజమాన్యం రూ.1,000 విలువ చేసే కొనుగోలుపై తక్షణ బహుమతులు, ఎస్‌బీఐ కార్డుపై 5% క్యాష్ బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది.

వన్‌ప్లస్ ఓపెన్ ఫోల్డబుల్ ఫోన్‌పై రిలయన్స్ డిజిటల్ ఆఫర్లు



ముంబై: వన్‌ప్లస్ ఓపెన్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌పై రిలయన్స్ డిజిటల్ ఆఫర్లు ప్రకటించింది. ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై రూ.5వేల వరకు తక్షణ తగ్గింపు, దాదాపు రూ.8వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్‌లు అందిస్తుంది. రిలయన్స్ డిజిటల్ అవుట్‌లెట్‌లో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 27న విడుదలయ్యే ఈ ఫోన్ ధర రూ.1,39,999. 'అద్భుతమైన వన్‌ప్లస్ ఓపెన్ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకమైన ఆవిష్కరణ కోసం వన్‌ప్లస్‌తో జట్టుకట్టడం ఆనందంగా ఉంది. భారత కస్టమర్లకు సరికొత్త టెక్నాలజీని అందించడమే మా లక్ష్యం' రిలయన్స్ డిజిటల్ సీఈఓ బ్రియాన్ బాడే అన్నారు.

సాక్షి స్పోర్ట్స్



రష్మిక అలవోక విజయం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. బ్యాంకాక్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-1, 6-3తో నాలుగో సీడ్ హిరోకో కవాటా (జపాన్)పై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఎనిమిది ఏస్‌లు సంధించడం విశేషం.

రాణించిన త్రిష: హైదరాబాద్ ఘనవిజయం

బీసీసీఐ సీనియర్ మహిళల టి20 టోర్నీలో శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌లో హైదరాబాద్ 83 పరుగులతో ఒడిషాను ఓడించింది. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 158 పరుగులు చేసింది. గొంగడి త్రిష (54 బంతుల్లో 72: 11 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు అర్ధసెంచరీతో చెలరేగింది. అనంతరం ఒడిషా 16.5 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది.



చెలరేగిన వార్నర్, మార్ష్

- భారీ సెంచరీలు చేసిన ఓపెనర్లు
- పాకిస్తాన్‌పై 62 పరుగుల తేడాతో గెలిచిన ఆస్ట్రేలియా
- రాణించిన జంపా, స్టొయినిస్

బెంగళూరు: వరుస ఓటముల నుంచి తేరుకున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పుంజుకుంది. వార్నర్, మార్ష్‌ల మెరుపులతో పాటు స్టొయినిస్ సూపర్ స్పెల్, ఆడమ్ జంపా స్పిన్ ఆసీస్‌ను గెలిపించాయి. శుక్రవారం జరిగిన ప్రపంచకప్ పోరులో ఆస్ట్రేలియా 62 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 367 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ వార్నర్ (124 బంతుల్లో 163; 14 ఫోర్లు, 9 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (108 బంతుల్లో 121; 10 ఫోర్లు, 9 సిక్సర్లు) శతక్కొట్టారు. షాహిన్ అఫ్రిదికి 5 వికెట్లు దక్కాయి. తర్వాత పాకిస్తాన్ 45.3 ఓవర్లలో 305 పరుగుల వద్ద ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్లు ఇమాముల్ హక్ (71 బంతుల్లో 70; 10 ఫోర్లు), అబ్దుల్లా షఫిక్ (61 బంతుల్లో 64; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. జంపా 4, స్టొయినిస్ 2 వికెట్లు తీశారు.



వార్నర్



సిక్సర్ల హోరు

వార్నర్ లాంటి డాషింగ్ ఓపెనర్‌కు 10, 105 స్కోర్ల వద్ద ఏకంగా రెండుసార్లు లైఫ్‌లు వస్తే ఎంత విధ్వంసం సృష్టిస్తాడో పాక్‌కు తెలిసొచ్చేలా చేశాడు. మరోవైపు మార్ష్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో మైదానం సిక్సర్లతో హోరెత్తింది. వార్నర్ 85 బంతుల్లో వన్డేల్లో 21 సెంచరీని పూర్తి చేసుకోగా, మార్ష్ 100 బంతుల్లో రెండో శతకం సాధించాడు. 259 స్కోరు వద్ద మార్ష్‌ను షాహిన్ అవుట్ చేయడంతో పాక్ ఊపిరి పీల్చుకుంది. మ్యాక్స్‌వెల్ (0), స్మిత్ (7)లు నిరాశ పరిచినా... వార్నర్ ధాటి కొనసాగింది. 325 స్కోరు వద్ద రవూఫ్ అతని జోరుకు బ్రేకులేయడంతో 38 పరుగుల స్వల్ప వ్యవధిలో ఆసీస్ 6 వికెట్లను కోల్పోయింది.

అప్పుడు... ఇప్పుడు...

12 ఏళ్ల క్రితం భారత ఉపఖండంలో జరిగిన 2011 ప్రపంచకప్‌లో జింబాబ్వేపై పల్లెకెలెలో లంక ఓపెనర్లు దిల్షాన్, తరంగ 282 పరుగులతో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు చేశారు. మళ్లీ ఇప్పుడు భారత్‌లో రెండో అత్యధిక భాగస్వామ్యాన్ని ఆసీస్ ఓపెనర్లు వార్నర్, మార్ష్‌లు సాధించారు. తొలి వికెట్‌కు 259 పరుగులు జోడించారు. మొత్తం 13 వరల్డ్‌కప్‌ల చరిత్రలో ఓపెనర్లు శతక్కొట్టడం ఇది నాలుగోసారి మాత్రమే!

పాక్ జోడీదీ అదే బాట

పాకిస్తాన్‌తో పోల్చితే ఆస్ట్రేలియా బౌలింగ్ దళం పదునైంది. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ అంతా నిప్పులు చెరిగే సమర్థులే! కానీ ఈ త్రయం పాక్ ఓపెనింగ్ జోడీని 21 ఓవర్లదాకా ప్రభావమే చూపలేకపోయింది. స్పిన్నర్లు జంపా, మ్యాక్స్‌వెల్‌లను బరిలోకి దించినా... షఫిక్-ఇమాముల్ జోడీ యథేచ్ఛగా తమ పరుగుల జోరు కొనసాగించడంతో వీరి ఇన్నింగ్స్ కూడా ఆసీస్ ఇన్నింగ్స్‌లా పరుగుల పట్టాలెక్కింది.



మార్ష్

షఫీక్ 52 బంతుల్లో, ఇమాముల్ 54 బంతుల్లో ఫిఫ్టీలు సాధించారు. అయితే స్టొయినిస్‌కు బంతిని అప్పగించాక పరిస్థితి మారింది. 134 స్కోరు వద్ద ఓపెనింగ్ జోడీని స్టొయినిస్ తొలి బంతికే విడగొట్టాడు. తన వరుస ఓవర్లలో షఫిక్, ఇమాముల్‌లను పెవిలియన్ చేర్చడంతో ఆట రూటు మారింది. జంపా స్పిన్ తిరగడంతో కెప్టెన్ బాబర్ ఆజమ్ (18), రిజ్వాన్ (40 బంతుల్లో 46; 5 ఫోర్లు), ఇఫ్తికార్ (20 బంతుల్లో 26; 3 సిక్సర్లు) ఎంతో సేపు నిలువలేదు. దీంతో పాక్ పరాజయం ఖాయమైంది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X నెదర్లాండ్స్
వేదిక: లక్నో
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) షాదాబ్ (సబ్) (బి) రవూఫ్ 163; మార్ష్ (సి) ఉసామ మీర్ (బి) షాహిన్ 121; మ్యాక్స్‌వెల్ (సి) బాబర్ (బి) షాహిన్ 0; స్మిత్ (సి అండ్ బి) ఉసామ మీర్ 7; స్టొయినిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షాహిన్ 21; ఇంగ్లిస్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 13; లబుషేన్ (సి) షాదాబ్ (సబ్) (బి) రవూఫ్ 8; కమిన్స్ (నాటౌట్) 6; స్టార్క్ (సి) షకీల్ (బి) షాహిన్ 2; హాజల్‌వుడ్ (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 0; జంపా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 367. వికెట్ల పతనం:** 1-259, 2-259, 3-284, 4-325, 5-339, 6-354, 7-360, 8-363, 9-363. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 10-1-54-5, హసన్ అలీ 8-0-57-0, ఇఫ్తికార్ 8-0-37-0, రవూఫ్ 8-0-83-3, ఉసామ మీర్ 9-0-82-1, నవాజ్ 7-0-43-0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 64; ఇమాముల్ (సి) స్టార్క్ (బి) స్టొయినిస్ 70; బాబర్ (సి) కమిన్స్ (బి) జంపా 18; రిజ్వాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 46; షకీల్ (సి) స్టొయినిస్ (బి) కమిన్స్ 30; ఇఫ్తికార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 26; నవాజ్ (స్టంప్డ్) ఇంగ్లిస్ (బి) జంపా 14; ఉసామ మీర్ (సి) స్టార్క్ (బి) హాజల్‌వుడ్ 0; షాహిన్ అఫ్రిది (సి) లబుషేన్ (బి) కమిన్స్ 10; హసన్ అలీ (సి) ఇంగ్లిస్ (బి) స్టార్క్ 8; రవూఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (45.3 ఓవర్లలో ఆలౌట్) 305. వికెట్ల పతనం:** 1-134, 2-154, 3-175, 4-232, 5-269, 6-274, 7-277, 8-287, 9-301, 10-305. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 8-0-65-1, హాజల్‌వుడ్ 10-1-37-1, ప్యాట్ కమిన్స్ 7.3-0-62-2, ఆడమ్ జంపా 10-0-53-4, గ్లెన్ మ్యాక్స్‌వెల్ 5-0-40-0, స్టొయినిస్ 5-0-40-2.

హెచ్‌సీఏ కొత్త అధ్యక్షుడిగా జగన్‌మోహన్ రావు ఎన్నిక

ఒక ఓటు తేడాతో విజయం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొత్త అధ్యక్షుడిగా అరిశనపల్లి జగన్మోహన్ రావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ ప్యానెల్‌కు చెందిన జగన్‌మోహన్ రావు ఒక ఓటు తేడాతో తన సమీప ప్రత్యర్థి అమర్‌నాథ్ (క్రికెట్ ఫస్ట్ ప్యానెల్)పై విజయం సాధించారు. జగన్‌మోహన్‌కు 63 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 62 ఓట్లు లభించాయి. అధ్యక్ష పదవికి బరిలో నిలిచిన అనిల్‌కుమార్‌కు 34, పీఎల్ శ్రీనివాస్‌కు 10 ఓట్లు దక్కాయి. మొత్తం 173 ఓట్లు అందుబాటులో ఉండగా నలుగురు ఓటర్లు గైర్హాజరయ్యారు. దాంతో 169 ఓట్లు పోలయ్యాయి. ఆరు పదవుల కోసం నాలుగు ప్యానెల్‌ల నుంచి 24 మంది పోటీపడ్డారు. తాజా ఫలితాలతో హెచ్‌సీఏలో ఎట్టకేలకు అధికారికంగా ఎన్నికైన కార్యవర్గం బాధ్యతలు చేపట్టనుంది. అక్షర గ్రూప్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ అయిన జగన్‌మోహన్ రావు భారత హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం హెచ్‌సీఏ నిర్వహించిన తెలంగాణ ప్రీమియర్ లీగ్‌లో మెదక్ మావెరిక్స్ జట్టుకు యజమానిగా ఆయన క్రికెట్ వ్యవహారాల్లోకి అడుగుపెట్టారు. యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ నుంచి ఇద్దరు, క్రికెట్ ఫస్ట్ ప్యానెల్ నుంచి ఇద్దరు, గుడ్ గవర్నెన్స్ ప్యానెల్‌ను ఇద్దరు చొప్పున విజయం సాధించగా, ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సీఏ ప్యానెల్ నుంచి ఎవరూ నెగ్గలేదు.



హెచ్‌సీఏ కొత్త కార్యవర్గం: ఎ.జగన్‌మోహన్ రావు (అధ్యక్షుడు), దల్జీత్ సింగ్ (ఉపాధ్యక్షుడు), ఆర్.దేవరాజ్ (కార్యదర్శి), బసవరాజు (సంయుక్త కార్యదర్శి), సీజే శ్రీనివాస్ (కోశాధికారి), సునీల్ కుమార్ (కౌన్సిలర్).

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గాయపడిన భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో ఆదివారం ధర్మశాలలో జరిగే తదుపరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో తన బౌలింగ్‌లోనే బంతిని ఆపే ప్రయత్నంలో గురువారం పాండ్యా చీలమండకు గాయమైంది. వెంటనే బౌలింగ్ నుంచి తప్పుకున్న అతడిని స్కాన్‌ల కోసం ఆస్పత్రికి పంపించారు. గాయం తీవ్రమైంది కాదని కెప్టెన్ రోహిత్ ఇప్పటికే ప్రకటించాడు. అయితే ముందు జాగ్రత్తగా విశ్రాంతి కోసం తర్వాతి మ్యాచ్‌ను పక్కన పెట్టినట్లు బీసీసీఐ ప్రకటించింది. తదుపరి చికిత్స కోసం అతను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి వెళతాడు. అనంతరం ఈ నెల 29న ఇంగ్లండ్‌తో భారత్ ఆడే మ్యాచ్ కోసం పాండ్యా నేరుగా లక్నో చేరుకుంటాడు.

సెమీస్‌లో సింధు



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ -750 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సింధు 21-19, 21-12తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్‌లో గట్టిపోటీ ఎదురైంది. అయితే రెండో గేమ్‌లో సింధు పూర్తి ఆధిపత్యం చలాయించి విజయాన్ని ఖాయం చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో కరోలినా మారిన్ (స్పెయిన్)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉంది. క్వార్టర్ ఫైనల్లో కరోలినా మారిన్ 19-21, 21-15, 21-18తో తై జు యింగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది.





Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

ఆడంబరంగా గురువందన

కంప్లి: కరూరు గ్రామంలో 2002లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల గురువందన కార్యక్రమం ఆడంబరంగా జరిగింది. కార్యక్రమంలో నాడు 10వ తరగతి చదివిన వారిలో 56 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని పరస్పరం కుశల ప్రశ్నలను వేసుకుని అలనాటి జ్ఞాపకాలను పంచుకొన్నారు. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలవడంతో నాటి రోజులు, నేటి తమ స్థితిగతులను పంచుకొని సంబరపడ్డారు.

బాగేవాడి కాలువ రైతుల ధర్నా



ధర్నా చేపట్టిన రైతులు, ప్రజలు

కంప్లి: శ్రీనివాస్ క్యాంప్ వద్ద ఎల్ఎల్‌సీ కాలువ నుంచి బాగేవాడి కాలువకు నీరు పారించే తూముపై రైతులు శుక్రవారం ధర్నా చేశారు. తెక్కలకోటె ఎస్ఐ శాంతమూర్తి, సిరిగేరి ఏఎస్ఐ శ్రీనివాస్, నీరావరి శాఖ ఏఈఈ తిప్పేస్వామి కాలువ వద్దకు చేరుకుని రైతుల గోడును ఆలకించి పరిస్థితిని చక్కదిద్దారు. కాగా ధర్నాలో బాగేవాడి కాలువ ఆయకట్టు పరిధిలోని వీకే క్యాంప్, ఉప్పారహళ్లి, బలకుంది గ్రామాల్లోని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పంప్‌సెట్లకు త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో రైతులకు త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలని అఖిల భారత రైతు వ్యవసాయ కూలికార్మికుల సంఘం జిల్లాధ్యక్షుడు మల్లనగౌడ డిమాండ్ చేశారు. శుక్రవారం దేవదుర్గ తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. దేవదుర్గను కరువు పీడిత తాలూకాగా ప్రకటించాలని, రైతులకు ఏడు గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతూ తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు.

ఉపకాలువకు నీరు వదలరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద ఉపకాలువకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాన్వి తాలుకా రైతులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో 76వ డిస్ట్రిబ్యూటరీ జీనూరు క్యాంప్, పోత్నాళ్, ముద్దంగడి, ఈరలగడ్డ, ఖారదిన్ని గ్రామాల రైతులు మాట్లాడారు. తమ భూములకు నీరందాలంటే కాలువలో నీటి గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. జొన్న, పత్తి, మిరప పంటలకు నష్టం వాటిల్లే అవకాశముందన్నారు. కాలువకు నీరొదిలి రైతులను ఆదుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సంచార జాతులకు ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంపాపతి

కంప్లి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గుడార నగరలను నిర్మించి సంచార జాతులకు ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దేవరాజ్ అరసు వేదిక బళ్లారి జిల్లా అధ్యక్షుడు కల్లుకంబ పంపాపతి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ అతిథిగృహంలో సంచార జాతుల విముక్తి సమాఖ్య, బళ్లారి జిల్లా గుడార యువకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై దృష్టి సారించి సానుకూలంగా స్పందించాలని ఆయన ఒత్తిడి చేశారు.

మహేశ్వరికి పతకాల పంట



పతకాలను అందుకున్న మహేశ్వరి

రాయచూరు రూరల్: పల్లెటూరులో పుట్టిన ఓ గ్రామీణ ప్రతిభాన్వితురాలు మైసూరులో ఈనెల 18న జరిగిన 103వ స్నాతకోత్సవంలో 8 బంగారు పతకాలు, మూడు నగదు బహుమతులను అందుకుంది. మైసూరు విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ బాటనీ విభాగంలో తాలూకాలోని బుల్లాపూర్‌కు చెందిన మహేశ్వరి ఐదో తరగతి వరకు గ్రామంలో, ఆరు నుంచి 10వ తరగతి వరకు గాణదాళలో, ఇంటర్, డిగ్రీ రాయచూరు ఎల్‌వీడీ కళాశాలలో చదివి మైసూరు విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ బాటనీ చదువుతూ ఎనిమిదో ర్యాంక్ సాధించింది. భవిష్యత్‌లో ఐఏఎస్ కావాలనే ఆశ ఉందన్నారు.

వ్యాపారుల మాయాజాలం

- ఏపీఎంసీలో వేరుశెనగ రైతులను మోసం చేస్తున్న వ్యాపారులు
- వేరే మార్కెట్లతో పోల్చితే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వైనం



మార్కెట్‌లో వేరుశెనగను రాసులుగా పోసిన దృశ్యం

సాక్షి బళ్లారి: ఆరుగాలం రైతులు కష్టపడి పంటలను పండిస్తే వ్యాపారులు ఎక్కడో ఒక చోట మోసం చేస్తూ రైతులను నిండా ముంచుతున్న ఉదంతాలు జరుగుతూనే ఉన్నాయి. ఈసారి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మెట్ట ప్రాంతాల్లో, సాగునీటి వసతులు కలిగిన భూముల్లో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కరువు ఛాయలు ఏర్పడడంతో రైతులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వాలు కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించారే కానీ సహాయక చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అష్టకష్టాలతో రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు మాయాజాలంతో రైతులను తీవ్రంగా మోసం చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ వేరుశెనగ కొనుగోళ్లకు మారుపేరు. ఈ మార్కెట్‌కు జిల్లాతో పాటు పొరుగున ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాల వివిధ తాలూకాల రైతులు వేరుశెనగను తీసుకొచ్చి అమ్ముకోవడం పరిపాటి.

క్వింటాల్‌కు రూ.1000 వరకు నష్టం

ఎన్నో ఏళ్లుగా పొరుగు జిల్లాల రైతులు ఈ ఏపీఎంసీ మార్కెట్‌లో వేరుశెనగను విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ వ్యాపారులు వేరుశెనగ రైతులను నిండా ముంచేస్తున్నారు. ప్రధానంగా వేరుశెనగ కొనుగోలు బళ్లారి ఏపీఎంసీతో పాటు చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలో పెద్ద ఎత్తున జరుగుతోంది. ఈ రెండు ప్రాంతాల్లోని మార్కెట్లకు బళ్లారి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన రైతులు వేరుశెనగను తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. బళ్లారి, చెళ్లకెరె మార్కెట్లలో వేరుశెనగ కొనుగోళ్లను పరిశీలిస్తే ఒకే నాణ్యతగల వేరుశెనగ రెండు మార్కెట్లలో ఒకే రోజు ఒక క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000ల వరకు తక్కువ ధరకు తీసుకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెళ్లకెరె మార్కెట్లో కంటే బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో ఒక క్వింటాల్‌ను రూ.1000 వరకు తక్కువకు కొనుగోలు చేసినట్లు కళ్యాణదుర్గం నియోజకవర్గ రైతులు వాపోయారు.

సిండికేట్ అవుతున్నా పట్టించుకోని అధికారులు

ఈవిధమైన వ్యాపారం ఏపీఎంసీలో సీజన్ ప్రారంభం నుంచి సాగిస్తూ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యాపారులు అధిక లాభాలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేరుశెనగ క్వింటాల్ ధర రూ.7 వేల నుంచి రూ.8500ల వరకు పలుకుతోంది. అయితే గత్యంతరం లేక కొందరు రైతులు తెలిసో తెలియకో ఏపీఎంసీకి తీసుకొచ్చి విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఏపీఎంసీ ఉన్నతాధికారులు కానీ, పాలకులు కానీ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టలేకపోవడంతో వేరుశెనగ రైతులు క్వింటాల్‌కు రూ.1000ల వరకు నష్టపోవాల్సి వస్తోంది. పంట పండించి మార్కెట్‌కు తెచ్చిన తర్వాత మార్కెట్‌లో వేరుశెనగ ధర గిట్టుబాటు అయ్యేలా ఉన్నా ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గృహిణి ఆత్మహత్య

హుబ్లీ: గృహిణి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ధార్వాడలోని శ్రీరామనగర్‌లో శుక్రవారం వెలుగు చూసింది. భాగ్యశ్రీ(23) అనే మహిళకు తొమ్మిది నెలల క్రితం సుభాష్‌తో వివాహమైంది. అయితే తన భర్త మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె భర్తతో గొడవ పడి గురువారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు విద్యాగిరి పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ బస్సు బోల్తా.. 13 మందికి గాయాలు

హుబ్లీ: తాలూకాలోని పాలె గ్రామం వద్ద జాతీయ రహదారిలో ప్రైవేట్ బస్సు బోల్తా పడగా, 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వీరిలో ఏడుగురిని కిమ్స్ ఆస్పత్రిలో, మిగిలిన వారిని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బస్సు బెంగళూరు నుంచి హుబ్లీ మీదుగా బెళగావికి వెళుతుండగా డ్రైవర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు వాలిపోయింది. దీంతో ప్రయాణికులు గాయపడినా ఎవరికీ ప్రాణపాయం కాలేదని హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు.

ఆరోగ్య పరీక్షా శిబిరం పరిశీలన



ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని పరిశీలించిన అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధికారులు పర్యటించి శాఖాపరమైన పరిశీలన జరిపారు. శుక్రవారం జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు నగరంలోని దేవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డు సేవలు అందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఇతర వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు జాగృతిని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు గణేష్, వాసంతిలున్నారు.

నేడు ఏసీ కోర్టు ప్రారంభం



మాట్లాడుతున్న మల్లికార్జున ముతాలిక్

గంగావతి: నగరంలో శనివారం అడిషనల్ సెషన్స్(ఏసీ) కోర్టును ప్రారంభించనున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున ముతాలిక్, కార్యదర్శి హెచ్ఎం మంజునాథ్ తెలిపారు. కోర్టు ఆవరణంలో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత దశాబ్ద కాలానికి పైగా ఏసీ కోర్టు స్థాపన, ఇతర సౌకర్యాల కోసం తమ సంఘం చేస్తున్న పోరాటానికి నేటితో కొంత ఫలితం దక్కిందన్నారు. ఈ కోర్టు స్థాపనతో భూ, ఇతర సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. గత నెలలో కొప్పళ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోర్టుకు విచ్చేసిన సందర్భంగా ఈ విషయం మనవి చేయడంతో కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ఆయన తమ వినతిపై స్పందించడాన్ని అభినందిస్తున్నామన్నారు. సంఘం ఉపాధ్యక్షులు బసప్పనాయక్, పదాధికారులు వెంకటేష్‌గౌడ పాల్గొన్నారు.

అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఐజీ లోకేష్‌కుమార్, ఎమ్మెల్యే గవియప్ప తదితరులు

హొసపేటె: విజయనగర జిల్లా పోలీసు శాఖ డీఏఆర్ ప్రాంగణంలో నిర్మించిన పోలీసు అమరవీరుల స్మారక స్థూపాన్ని శుక్రవారం సాయంత్రం బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గవియప్ప, ఎస్పీ శ్రీహరిబాబుతో పాటు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అజయ్‌సింగ్‌తో ఎమ్మెల్యే సమావేశం



అజయ్‌సింగ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: నియోజకవర్గ అభివృద్ధి కోసం కలబురిగి కేంద్రంగా ఉన్న కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ) అధ్యక్షుడు డాక్టర్ అజయ్ సింగ్‌తో శుక్రవారం ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి బెంగళూరులో సమావేశమై చర్చించారు. నియోజకవర్గంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆస్పత్రి, కాలేజీ, నీటి సౌకర్యం లాంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆయనను అభ్యర్థించారు. ఈ విషయంపై అజయ్‌సింగ్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఓ ప్రకటనలో తెలిపారు.

ఆయకట్టుకు అందని నీరు..ఎండుతున్న పైరు



నీటి ప్రవాహం లేని ఎడమ కాలువ



వాడుముఖం పట్టిన పత్తి పంట

- నాలుగు లక్షల హెక్టార్లలో పంట నష్టం
- తుంగభద్ర ఎడమ కాలువ రైతులు డీలా

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు సాగునీరందక పోవడంతో రైతులు డీలా పడ్డారు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో లక్షలాది హెక్టార్లలో పంట నష్టం సంభవించే అవకాశాలున్నాయి. కాలువ పైభాగంలో నీటి గేజ్ నిర్వహణ, నీటి పరిమాణం పెంపుపై అధికారులు తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. ఫలితంగా చివరి ఆయకట్టులో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. కాలువకు నీటి సరఫరాపై గతంలో ముఖ్యమంత్రి యడియూరప్ప సర్కారు అమలు చేసిన ఆదేశాలను అధికారులు సక్రమంగా పాటించనందు వల్లే నేడు ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు వాడుముఖం పట్టాయనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

పంట నష్టం వివరాలు:

సింధనూరు, మస్కి, కవితాళ, మాన్వి ప్రాంతాలలో వరి, పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నారు. దాదాపు రెండు లక్షల హెక్టార్లలో వరి, రాయచూరు, సిరవార తాలూకాల్లో లక్ష హెక్టార్లలో పత్తి, లక్ష హెక్టార్లలో మిరప పంటలు పండిస్తున్నారు. నెలాఖరు వరకు రోజుకు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే పంటలు చేతికందే అవకాశం ఉంది. సరైన వానలు లేక కరువు నెలకొనడంతో పాటు కాలువకు నీటి సామర్థ్యం పెంపు, గేజ్ నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల పంటలు నష్టపోయే ప్రమాదం నెలకొంది. సక్రమంగా నీటిని విడుదల చేస్తే రైతులు కష్టాల నుంచి గట్టెక్కుతారు. గత ఐదు రోజుల నుంచి ఏడో మైలు వద్ద రైతులు నిరవధిక ధర్నాకు ఉపక్రమించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు వచ్చినా రైతుల సమస్య కొలిక్కి రాకపోవడం విడ్డూరంగా ఉంది.

వేశ్యావాటికపై దాడి..ఇద్దరు మహిళలకు విముక్తి

హుబ్లీ: వేశ్యా వాటిక నిర్వహిస్తున్న లాడ్జిపై గురువారం రాత్రి దాడి చేసిన ధార్వాడ టౌన్ పోలీసులు ఇద్దరు మహిళలను కాపాడారు. ధార్వాడ లయన్ బజార్‌లోని లాడ్జిపై పోలీసులు దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఉన్న ఇద్దరు మహిళలను రక్షించారు. లాడ్జి యజమాని, మేనేజర్లపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

లోకాయుక్త మెరుపు దాడులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలోని దావణగెరె, బెళగావి జిల్లాల్లో లోకాయుక్త అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. శుక్రవారం దావణగెరె జిల్లాలో సీఏ సైట్ అమ్మకంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలపై జిల్లాలోని మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో లోకాయుక్త అధికారులు సోదాలు నిర్వహించారు. దావణగెరె నగరాభివృద్ధి శాఖ, మహానగర పాలికె కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయంలో లోకాయుక్త అధికారులు సోదాలు నిర్వహించి కోట్లాది రూపాయల లావాదేవీల రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లాలో డీడీపీఐ బసవరాజ్ రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు వల పన్ని పట్టుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కోలారు: చిక్కబళ్లాపురలోని సర్ ఎంవీ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన డివిజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కోలారుకు చెందిన కనక బాస్కెట్‌బాల్ క్లబ్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కనక బాస్కెట్ బాల్ క్లబ్ సభ్యులు తరుణ్, హేమంత్, హర్షిత్, పాండు, జగదీష్, శివ, ఆదిత్య, తిలక్, హరి, వేణు, గుణ, దేవేంద్ర, అఖిల్, అభి పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాస్కెట్‌బాల్ జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు.

డ్యాం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

హొసపేటె: టీబీ డ్యాం రోడ్డులో జిల్లాధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న తుంగభద్ర హెచ్ఎల్‌సీ కాలువ గట్టు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న అక్రమ కట్టడాలను జిల్లాధికారి దివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగింపు కార్యాచరణను ప్రారంభించారు. జేసీబీ యంత్రంతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా జిల్లాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో కట్టడాల నిర్మాణం చట్ట వ్యతిరేకమన్నారు. ఈ విషయంపై కట్టడ యజమానులకు ఇప్పటికే నోటీసులిచ్చినా వాటిని తొలగించలేదన్నారు. చివరికి తామే రంగంలోకి దిగి కట్టడాలను కూల్చే పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం ఈ అక్రమ కట్టడాలను కూల్చివేశామన్నారు. ఈ సందర్భంగా ఏసీ అక్రంపాషా, తహసీల్దార్ విశ్వజిత్ మెహత తదితరులు పాల్గొన్నారు.

8 గంటల విద్యుత్ కోసం ధర్నా

కోలారు: ప్రభుత్వం రైతులకు సక్రమంగా 8 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం పదాధికారులు నగరంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి బెస్కాం ఏఈఈకి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేరి నాగరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వడంలో విఫలమైందన్నారు. రైతుల పంప్‌సెట్లకు 8 గంటల నిరంతర విద్యుత్‌ను అందించాలన్నారు. రైతు సంఘం మాలూరు తాలూకా అధ్యక్షుడు హెచ్‌జీ వెంకటేష్, సుజాత, దీప, మాగొంది రత్నమ్మ, అమరేష్, కెఎస్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



అమరేష్(ఫైల్)

రాయచూరు రూరల్: సరదాగా ఈతకెళ్లిన ఓ బాలుడు మృత్యువాత పడిన ఘటన శుక్రవారం జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో చోటు చేసుకుంది. హొసళ్లికి చెందిన అమరేష్(16) అనే బాలుడు పూలబావి వద్ద నారాయణపుర కుడి కాలువలో స్నానానికి దిగాడు. అయితే కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు కాలువ వద్దకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు.



సీతారామ ఆశ్రమంలో సరస్వతి దేవి అలంకరణ



బెంకిమారెమ్మకు కొబ్బరితో అలంకరణ



కనకదుర్గమ్మకు వెండి ఆభరణాల అలంకరణ



నగరేశ్వరాలయంలో పల్లకీ సేవలు



ప్రత్యేక అలంకరణలో కాళికా దేవి



కన్యకా పరమేశ్వరి దేవికి సరస్వతి దేవి అలంకరణ



సింహవాహనంలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



మేగోటె దుర్గాదేవి



శాంభవిదేవి



వాసవీ మంటపంలో ధనలక్ష్మీ దేవి అలంకరణ

మేరా మాటీ-మేరా దేశ్‌పై జాగృతి జాతా

హొసపేటె: భారతావని సేవకు అందరం చేయి చేయి కలుపుదాం అని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తెలిపారు. తాలూకాలోని డణ్ణాయకనకెరెలో శుక్రవారం చేపట్టిన మేరా మాటీ-మేరా దేశ్ జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా రెండో దశలో తాలూకా అంతటా సేకరించిన మట్టిని ఈ జాతా ద్వారా నెహ్రూ యువకేంద్రానికి అందజేస్తారన్నారు. ఇక్కడి నుంచి జిల్లా స్థాయి కార్యక్రమానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సెక్రటరీ భీమప్ప, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బసవరాజు, జిల్లా ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ కో-ఆర్డినేటర్ ఫాజిల్ అహ్మద్, టీపీ ఈఓ ఉమేష్, టీపీ అసిస్టెంట్ డైరెక్టర్ షమీమ్ బాను తదితరులు పాల్గొన్నారు.

ముద్దాపుర జీపీకి గాంధీ గ్రామ పురస్కారం

కంప్లి: ఇటీవల ముద్దాపుర గ్రామ పంచాయతీకి గాంధీ గ్రామ పురస్కారం ప్రకటించిన సందర్భంగా మండ్య జిల్లా మంగళ గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు విచ్చేసి పాలనా వైఖరి, అభివృద్ధి పనులను వీక్షించి సమాచారం పొందారు. పంచాయతీ పరిధిలోని కణివి తిమ్మలాపుర ప్రభుత్వ పాఠశాలను సందర్శించి స్మార్ట్‌క్లాస్‌లను వీక్షించి అభినందించారు.

పాఠశాల స్థలం కబ్జాపై చర్యలేవీ?

రాయచూరు రూరల్: నగరంలో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆలయ నిర్మాణం పేరుతో ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. లాల్‌బహద్దూర్ శాస్త్రినగర్‌లో సర్వే నంబర్-384 -1లో 1017 చ.మీ.స్థలాన్ని నగరసభ, నగరాభివృద్ధి శాఖలు విద్యా శాఖకు ప్రభుత్వ హైస్కూలు నిర్మాణానికి కేటాయించిందన్నారు. పక్కన ఉన్న నివాసులు ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్, రాడ్‌ల వంటి సామగ్రి నిల్వకు తాత్కాలిక గోదాముల పేరుతో ఆక్రమించారన్నారు. శాఖా పరంగా ఆక్రమణదారులపై కేసు నమోదు చేసి పాఠశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఎడమ కాలువకు నీటి పరిమాణం పెంచండి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి నిర్వహణ చేయాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజ్‌కు రైతులు విన్నవించారు. శుక్రవారం నాలుగో రోజు ఏడో మైలు వద్ద ఎడమ కాలువ రైతుల పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన ఆందోళన శిబిరం వద్దకు వచ్చిన మంత్రికి వారు వినతిపత్రం అందించారు. ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే కాలువకు విడుదల చేసే నీటి పరిమాణాన్ని పెంచాలని కోరారు.

చదువుల తల్లి..కల్పవల్లి

- సరస్వతిదేవిగా అమ్మవారి దర్శనం
- దర్శించుకుని పులకించిన భక్తజనం

బళ్లారి అర్బన్: విజయదశమి సందర్భంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆరో రోజు శుక్రవారం సాయంత్రం స్థానిక అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలతో పాటు అమ్మవార్లకు వివిధ రూపాల్లో అలంకరణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. ధార్మిక పూజలతో పాటు పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తి గీతాలను ఆలపించారు.

అమ్మవారికి విశేష అలంకరణ పూజలు

గంగావతి: అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, అలంకరణలు చేపట్టారు. ప్రధానంగా రాజమాత మేగోటె దుర్గాదేవి ఆలయంలో అర్చకులు బ్రహ్మానంద స్వామి ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారి సన్నిధిలో 3 గంటల పాటు హోమాన్ని నెరవేర్చారు. హేమగుడ్డలో దుర్గాదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్ శ్రీనాథ్ కుటుంబ సభ్యులు హోమ పూజలను జరిపారు. అమ్మవారి ఆలయాల్లో నవరాత్రుల ఆరో రోజు కూడా ఉచిత ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కాస్‌బావి వద్ద అంబా భవానికి అలంకరణ



నగరేశ్వరి ఆలయంలో సరస్వతి దేవి అలంకరణ

రాయచూరు రూరల్: జిల్లాలో శుక్రవారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కోట ప్రాంతంలో వెలసిన కాళికా దేవాలయంలో అమ్మవారిని పల్లకీలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సిరవార తాలూకా నవల్‌కల్‌లో శాంభవీ దేవికి ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. మమదాపూర్‌లో మారికాంబ దేవి, కాస్‌బావి వద్ద అంబా భవానిని ఘనంగా అలంకరించారు. ఉప్పారవాడి లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం, కన్యకా పరమేశ్వర ఆలయంలో గరుడ వాహనంలో స్వామివారిని ఊరేగించారు.



చిన్న దుర్గమ్మకు మహాలక్ష్మి అలంకరణ